www.andhrajyothy.com
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రసాయన ఎరువులకు 'నానో' తోడు



పోషకాలు ఎక్కువ.. పర్యావరణానికి మేలు
రసాయన ఎరువులతో నష్టాలే అధికం
నానో యూరియాలో 80-90% పోషకాలు
రసాయన యూరియాలో 30-40 శాతమే
రసాయన యూరియా 75%, నానో 25% వాడటం మేలు
పంట ప్రాథమిక దశలో నానో వద్దు.. ఆఖరి దశలో వాడితే ప్రయోజనం
వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫారసు
12

శనివారం | 9-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 132
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి మ.1.25 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం మ.2.24 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా.6.18-7.52; దుర్ముహూర్తం: ఉ.6.00-7.41; అమృతఘడియలు: తె.3.42-5.16; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జడ్పీల్లో బీసీలు
డబుల్!


42% రిజర్వేషన్‌తో దాదాపు సగం చైర్మన్లు బీసీలే?

- ఉన్నత పదవుల్లో గణనీయంగా పెరగనున్న ప్రాతినిధ్యం.. ప్రస్తుతం 32 మందిలో ఏడుగురే..
- పంచాయతీల్లో పెరిగేది కొద్ది శాతమేనా?.. స్థానిక సంస్థల్లో ఇప్పటికే 40% ప్రాతినిధ్యం
- జిల్లాల వారీగా చూస్తే 30 నుంచి 55%.. చాలా చోట్ల జనరల్ స్థానాల్లోనూ బీసీల గెలుపు
- పార్టీలే చొరవ చూపి 42% అవకాశమిస్తే.. భవిష్యత్తులో చట్టసభల్లో ఎక్కువ మంది బీసీలు

(హైదరాబాద్, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఎన్నికలు సెప్టెంబరు 30లోపు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైకోర్టు గడువు మేరకే ఈ విషయంలో ప్రభుత్వం ముందుకెళ్లే పరిస్థితి ఉంది. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ చట్టం తేవాలని, ఆ తర్వాత ఆర్డినెన్స్‌కు అయినా ఆమోదం పొందాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాజకీయంగా పోరాటం చేసినా కేంద్రం సహకరించలేదని, ఇక పార్టీల పరంగా రిజర్వేషన్లు ఇవ్వడమే తమ ముందున్న మార్గమని సీఎం రేవంత్‌రెడ్డి నర్మగర్భంగా చెప్పేశారు. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే జరిగేదేంటి? స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం ఎలా ఉంటోంది? కొన్ని జిల్లాల సమాచారాన్ని, రాష్ట్ర స్థాయి సమాచారాన్ని ఆంధ్రజ్యోతి పరిశీలించింది. అందులో రెండు విషయాలు ప్రస్ఫుటమయ్యాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల్లో బీసీల ప్రాతినిధ్యం వారికిచ్చిన రిజర్వేషన్ల కంటే ఎక్కువగానే ఉంది. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు కల్పించారు. చాలా జిల్లాల్లో ఇంతకంటే భారీగానే ఆ సామాజిక వర్గాల అభ్యర్థులు గెలుపొందారు. తమకు రిజర్వు చేసిన స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లోను బీసీలు గెలుపొందారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల్లో వీరి ప్రాతినిధ్యం ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ఉంది. సగటున 30 శాతం నుంచి 55 శాతం వరకు ఉంది. రాష్ట్రస్థాయిలో చూస్తే ఇది సుమారు 40 శాతం వరకు ఉండొచ్చని లెక్కలు చెప్తున్నాయి. ఒకవేళ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇక్కడ మరో రెండు శాతం, లేకుంటే ఇంకొంత శాతం మాత్రం బీసీలకు అదనంగా అవకాశాలు దక్కుతాయి. వీటికి తోడు బీసీలు గెలుచుకునే జనరల్ స్థానాలు ఉండనే

మిగతా 13వ పేజీలో...





వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు!

అలహాబాద్ హైకోర్టు జడ్జిపై ఆదేశాల ఉపసంహరణ
తీర్పు నుంచి సంబంధిత రెండు పేరాల తొలగింపు
సీజేఐ విజ్ఞప్తి మేరకేనన్న సుప్రీం జడ్జి జస్టిస్ పార్దీవాలా
కేసును పునర్విచారించాలని అలహాబాద్ హైకోర్టుకు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిని క్రిమినల్ కేసుల విచారణ చేపట్టకుండా నిషేధించాలని ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. గత తీర్పులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మీద చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు పేర్కొంది. ఈ వ్యవహారాన్ని ఇంతటితో ముగిస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ నెల 4న వివాదాస్పద తీర్పును వెలువరించింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌ను

మిగతా 2వ పేజీలో...

ఆ నంబరు అమిత్ షాదే!



సిట్ విచారణకు హాజరయ్యేందుకు ర్యాలీగా తరలివస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కేంద్ర హోం మంత్రితో మాట్లాడిన మాటలూ వినేశారా?
నడ్డా, సంతోష్‌లతో జరిగిన సంభాషణలూ విన్నారు!
బండి సంజయ్ ముందు ముగ్గురి నంబర్లు ఉంచిన సిట్
అవాక్కయిన కేంద్ర మంత్రి.. 'సిట్‌తో తేలదు.. సీబీఐకి ఇస్తేనే కేసు కొలిక్కి'.. సంజయ్‌తో పోలీసు అధికారులు?

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. విచారణాధికారులు ఇచ్చిన ఫోన్ నంబర్లు చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌తో పలుమార్లు మాట్లాడారు. శుక్రవారం విచారణ సందర్భంగా ఈ ముగ్గురు అగ్రనేతల ఫోన్ నంబర్లను సిట్ అధికారులు సంజయ్ ముందుంచారు. ఆ నంబర్లు ఎవరివని అడగడంతో సంజయ్ అవాక్కయినట్లు తెలిసింది. కేంద్ర హోం మంత్రి, పార్టీ అగ్రనేతలతో తాను మాట్లాడిన మాటలు కూడా విన్నట్లు తెలియడంతో దిగ్భ్రాంతికి గురైనట్లు సమాచారం. అలాగే పార్టీకి విరాళాలు

మిగతా 12వ పేజీలో...

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

నేరుగా సీబీఐ విచారించి ఉంటే కేసీఆర్‌ను జైల్లో వేసేవాళ్లం
నా ఫోన్ నిరంతరం ట్యాప్
రేవంత్, హరీశ్ ఫోన్లూ వదల్లేదు
6500 ఫోన్లు ట్యాప్ చేశారు!
సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్
లీగల్ నోటీసులిస్తాననడానికి కేటీఆర్‌కు సిగ్గుండాలని వ్యాఖ్య
12

బండికి 48 గంటల గడువు!
ట్యాపింగ్‌పై వ్యాఖ్యలు వెనక్కు తీసుకోకుంటే కోర్టుకే: కేటీఆర్

అమెరికా ఆయుధాల కొనుగోళ్లు
నిలిపివేత?



ట్రంప్ సుంకాలపై యూపీలోని కాన్పూర్‌లో వ్యాపారుల నిరసన

సుంకాల నేపథ్యంలో భారత్ యోచన
తుది దశలో ఉన్న ఒప్పందాలపైనా చర్చలు ఆపేయాలని నిర్ణయం
అందుకే రాజ్‌నాథ్ పర్యటన రద్దు
రాయిటర్స్ కథనం
కొనుగోళ్ల నిలిపివేత అవాస్తవమన్న రక్షణ శాఖ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అమెరికా అడ్డగోలుగా సుంకాలు విధించడంపై భారత్ ఆగ్రహంగా ఉందా? అమెరికా నుంచి రక్షణ రంగ ఉత్పత్తుల కొనుగోళ్లను నిలిపివేయాలని భావిస్తోందా? అందుకే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తలపెట్టిన అమెరికా పర్యటన రద్దయిందా?.. ముగ్గురు

మిగతా 2వ పేజీలో...

భారత్‌తో వాణిజ్య చర్చలుండవు!

టారిఫ్‌ల వ్యవహారం తేలేవరకు ఇదే పరిస్థితి అన్న ట్రంప్
రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేసేలా తీవ్ర ఒత్తిడికి యత్నం
ఆర్థిక మాంద్యం పొంచి ఉంది
సుంకాల అంశంలో జోక్యం వద్దు
అమెరికా కోర్టులకు ట్రంప్ హెచ్చరిక
పుతిన్‌తో ఫోన్లో మాట్లాడిన మోదీ
ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా: నెతన్యాహూ

రష్యా ఆయిల్ కొనుగోళ్లను ఆపేస్తే చమురు దిగుమతులు భారమే!
ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ బిల్లు రూ.78 వేల కోట్లు
వచ్చే ఏడాది రూ.1.05 లక్షల కోట్లు
ఎస్‌బీఐ నివేదిక అంచనా
2



బెంగళూరులో జరిగిన ర్యాలీలో ఖర్గే, రాహుల్, సిద్దరామయ్య, శివకుమార్, వేణుగోపాల్

అధికారంలోకి వచ్చాక..
మిమ్మల్ని వదలం
ఓటర్ల జాబితాల్లో మోసాలెందుకు?
జవాబులివ్వకుండా మాకు బెదిరింపులా?
బీజేపీ ఏజెంట్లుగా ఎందుకు పనిచేస్తున్నారు?
ఎన్నికల అధికారులపై రాహుల్‌గాంధీ ఆగ్రహం
బెంగళూరులో 'ఓటు అధికార ర్యాలీ'

ఓట్ చోరీపై దేశవ్యాప్త ఉద్యమం

జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' స్థాయిలో నిర్మాణానికి 'ఇండియా' యోచన
దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన.. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్
బీజేపీకి నష్టమే అంటున్న రాజకీయ వర్గాలు
ఓటరుకార్డు-ఆధార్ అనుసంధానంతో బోగస్ ఓట్లకు చెక్‌పడుతుంది: ఈసీ వర్గాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయిందన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం, దాని పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితా ఆధారంగా ఆయన ఇచ్చిన 'ఓట్ చోరీ' ప్రజెంటేషన్‌కు మంచి స్పందన వచ్చిందని ఇండి కూటమి భావిస్తోంది. దీనిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి, బీజేపీని ఎండగట్టేందుకు సిద్ధమైంది. గతంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ నిర్మించిన 'సంపూర్ణ విప్లవం' ఉద్యమం

మిగతా 2వ పేజీలో...



రూ.562 కోట్లు

రాష్ట్రంలో తోషిబా పెట్టుబడులు
యువతకు 250కి పైగా ఉద్యోగాలు
అంతర్జాతీయ తయారీ కేంద్రంగా తెలంగాణ.. ఈ దిశగా ప్రభుత్వం కృషి
ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
కోర్ ప్రాసెసింగ్, సర్జ్ అరెస్టర్ లైన్ సెంటర్‌లను ప్రారంభించిన మంత్రి
13



ప్రయాణికులతో కిక్కిరిసిన జేబీఎస్
14

ఆర్టీసీకి భారీ గిరాకీ

రాఖీ పండుగ, వరుస సెలవులతో సొంతూళ్లకు..
ఇదే అదనుగా 41-50% చార్జీలు పెంచిన ఆర్టీసీ
ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై భారం
అడ్డగోలుగా దోచేస్తున్నారంటూ జనం ఆగ్రహం

తమిళనాట ద్విభాషా విద్యా విధానమే!

కేంద్ర విద్యావిధానానికి ప్రత్యామ్నాయంగా..
14

'ఉజ్వల'కు రూ.12 వేల కోట్లు

2025-26 సంవత్సరానికి కేటాయింపు
సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి ఎంఈఆర్ఐటీఈ.. రూ.4,200 కోట్లు
ప్రభుత్వరంగ చమురు సంస్థలకు 30వేల కోట్లు.. కేంద్ర కేబినెట్ నిర్ణయాలు
10

త్వరలోనే బీఆర్ఎస్ ఖాళీ

పలువురు గులాబీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాతో టచ్‌లో ఉన్నారు
రేపు బీజేపీలోకి గువ్వల బాలరాజు
అసంతృప్తిగా ఉన్న కాంగ్రెస్ నేతలు సమయం కోసం ఎదురుచూస్తున్నారు
బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్/నాగర్‌కర్నూల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆదివారం బీజేపీలో చేరబోతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ప్రకటించారు. గులాబీ పార్టీ త్వరలోనే ఖాళీ కాబోతోందని, బాలరాజు చేరికనే అందుకు సంకేతమని తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వంపై ఆ పార్టీ నేతలు నమ్మకం కోల్పోయారని చెప్పారు. శుక్రవారం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిలో వారికి బీజేపీయే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోందని వివరించారు. కాంగ్రెస్‌లో కొంత మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారంతా సమయం కోసం చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన కొందరు రాజకీయ ప్రముఖులకు బీజేపీ వేదిక కాబోతోందని వెల్లడించారు. వీరితో పాటు

మిగతా 12వ పేజీలో...



సింగూరు డ్యామ్ రక్షణకు
చర్యలు తీసుకోండి

అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు
సింగూరు ప్రాజెక్టుకు ఇప్పటికిప్పుడే ప్రమాదమేమీ లేదు
చిన్న చిన్న లీకేజీలను సరిచేస్తాం
ఈఎన్‌సీ మహ్మద్ అంజద్‌హుస్సేన్
14

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్
3

జబల్‌పూర్‌లో పసిడి కొండ!
100 హెక్టార్లలో లక్షల టన్నుల బంగారం నిల్వలు.. మధ్యప్రదేశ్‌లో గుర్తించిన జీఎస్ఐ
14

ప్రతీ చుక్క వరద
మూసీకి చేరాలి

చెరువులు, నాలాల్ని మూసీకి అనుసంధానించాలి
రాజధాని వరదకు మూసీ పునరుజ్జీవనమే పరిష్కారం
అప్పుడే నగరంలో కాలనీలన్నీ సురక్షితం
భారీ వర్షాలు పడినా తట్టుకునేలా ప్రణాళికలుండాలి
హైదరాబాద్ వర్షాలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనమే మనకున్న చక్కటి పరిష్కార మార్గమని చెప్పారు. వరద నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా ఉండేందుకు, జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను

మిగతా 3వ పేజీలో...

నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో
భారీ వర్షం
చౌటుప్పల్‌లో ప్రవాహంలో చిక్కుకున్న కారు.. వాహనంలో ఏడుగురు
తాడు సాయంతో అందర్నీ బయటకు తీసిన స్థానికులు
3

రష్యా ఆయిల్ కొనుగోళ్లను ఆపేస్తే
చమురు దిగుమతులు భారమే!

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రష్యా నుంచి భారత్ భారీగా ముడిచమురును కొనుగోలు చేస్తుండటం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ నుంచి తమ దేశానికి వచ్చే ఉత్పత్తులపై సుంకాల మోత మోగిస్తున్నారు. అయినా భారత్ మాత్రం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్న సంకేతాలు ఇస్తోంది. అయితే అమెరికా సుంకాలను క్రమంగా పెంచుతున్న తరుణంలో రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేస్తే ఏమవుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. మన దేశానికి రష్యా డిస్కౌంట్ ధరలకు ముడిచమురును విక్రయిస్తోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసినట్టయితే దేశ చమురు దిగుమతి బిల్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మిగిలిన కాలానికి దాదాపు 900 కోట్ల డాలర్లు (దాదాపు రూ.78,822 కోట్లు) పెరగడానికి అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది. ఈ బిల్లు 2026-27 సంవత్సరంలో 1,200 కోట్ల డాలర్ల వరకు కూడా పెరగవచ్చని చెబుతోంది. ఇది భారత్‌కు పెనుభారంగానే చెప్పవచ్చు. రష్యా ఆయిల్ లేనిపక్షంలో భారత్ ఇంధన కొనుగోళ్లు మరింత ఖరీదుగా మారే అవకాశం ఉందని నివేదిక చెబుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఆ దేశంపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దీని తర్వాత 2022 నుంచి రష్యా చవకగా ముడిచమురును ఆఫర్ చేయడంతో భారత్ తన అవసరాల కోసం దానిని కొనుగోలు చేస్తోంది. బ్యారల్ రష్యన్ ఆయిల్ ధరను 60 డాలర్లకు పరిమితం చేయడం, తక్కువ ధరకు విక్రయించడం వల్ల భారత్ తన ఇంధన బిల్లును భారీగా ఆదా చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ప్రధాన ఆయిల్ సరఫరాదారుగా రష్యా మారింది. 2019-2020 ఆర్థిక సంవత్సరంలో భారత్ ముడిచమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 1.7 శాతం ఉండగా.. 2024-25 సంవత్సరంలో ఏకంగా 35.1శాతానికి ఎగబాకింది. పరిమాణం పరంగా చూస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ 245 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) ముడిచమురును దిగుమతి చేసుకోగా.. ఇందులో 88 ఎంఎంటీ ముడిచమురు ఒక్క రష్యా నుంచే రావడం గమనార్హం. కానీ పెరుగుతున్న ముడిచమురు ధరల కారణంగా భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రష్యా నుంచి కొనుగోళ్లను నిలిపివేసినట్టయితే దేశ ముడిచమురు దిగుమతి బిల్లు 900 కోట్ల డాలర్లు, వచ్చే సంవత్సరంలో దాదాపు 1170 కోట్ల డాలర్లు పెరగవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది.



ధరలు ఎందుకు పెరుగుతాయంటే?

ప్రపంచ ముడిచమురు సరఫరాలో రష్యా వాటా ప్రస్తుతం 10 శాతంగా ఉంది. రష్యా నుంచి పలు దేశాలు ఒక్కసారిగా చమురు కొనుగోళ్లను నిలిపివేసి.. ఇతర దేశాలు తమ ఉత్పత్తిని పెంచని పక్షంలో ముడిచమురు ధరలు దాదాపు 10 శాతం పెరగవచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేస్తోంది. పెరిగే ధరల వల్ల ఒక్క భారత్‌పైనే కాకుండా ప్రతి ఒక్క దేశంపైనా ప్రభావం పడటానికి అవకాశం ఉందంటున్నారు.

భారత్ ఏం చేయవచ్చంటే?

ఇంధన అవసరాల కోసం భారత్ 85% దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ సహా దాదాపు 40 దేశాల నుంచి ముడిచమురును సమకూర్చుకుంటోంది. గయానా, బ్రెజిల్, కెనడా వంటి దేశాలు కొత్తగా చేరడంతో భారత్ ఇంధన భద్రత మరింత మెరుగుపడింది. రష్యా ఆయిల్ లేకున్నా భారత్ ఇతర దేశాలతో ఉన్న సంబంధాలతో తన డిమాండ్‌కు సరిపడా ముడిచమురును సమకూర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగితే దేశ దిగుమతుల వ్యయాలు పెరగడానికి ఆస్కారం ఉంటుంది.

అమెరికా ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేత!

(మొదటిపేజీ తరువాయి)

కీలక అధికారులను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా సంస్థ రాయిటర్స్ ప్రచురించిన కథనం ఈ ప్రశ్నలకు అవుననే జవాబు చెబుతోంది. దాని ప్రకారం.. అమెరికా నుంచి స్ట్రైకర్ కాంబాట్ వెహికల్స్, ట్యాంక్ విధ్వంసక జావెలిన్ క్షిపణులు, నౌకాదళం కోసం ఆరు బోయింగ్ పీ8ఐ విమానాలు, కొన్ని ఇతర రక్షణ ఉత్పత్తుల కొనుగోలు కోసం భారత్ చర్చలు జరుపుతోందని ఇద్దరు కీలక అధికారులు తెలిపారు.



ఈ కొనుగోళ్లను అధికారికంగా ఖరారు చేసి, ప్రకటించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలో వాషింగ్టన్‌లో పర్యటించాల్సి ఉందని వెల్లడించారు. అయితే ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఈ కొనుగోళ్లను ప్రస్తుతానికి నిలిపివేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు మరో ఉన్నతాధికారి తెలిపారు. సుంకాలను ట్రంప్ ఏ క్షణమైనా వెనక్కి తీసుకోవచ్చని.. ద్వైపాక్షిక సంబంధాలు, సుంకాలపై స్పందన వస్తే రక్షణ కొనుగోళ్లపై యథాతథంగా ముందుకెళ్లవచ్చని వెల్లడించారు. ప్రస్తుతమైతే ఈ పరిస్థితి కనిపించడం లేదన్నారు. వాస్తవానికి ట్రంప్ డిమాండ్ చేస్తున్నట్టుగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించేందుకు భారత్ సిద్ధంగానే ఉందని.. రష్యా తరహాలో తక్కువ ధరకు చమురు ఇచ్చే దేశాల కోసం చూస్తోందని ఒక అధికారి చెప్పారు. ట్రంప్ హెచ్చరికలు, సుంకాలతో భారత్‌లో అమెరికా పట్ల వ్యతిరేకత పెరిగిందని.. ఇలాంటి సమయంలో రష్యాను దూరంపెట్టి, అమెరికా వైపు మొగ్గుచూపడం ప్రధాని మోదీకి కత్తిమీద సామేనని పేర్కొన్నారు.

కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతోంది!

ట్రంప్ యంత్రాంగం విధించిన సుంకాల నేపథ్యంలో అమెరికా నుంచి ఆయుధ, రక్షణ కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్ భావిస్తోందన్నది తప్పుడు ప్రచారమని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు సరికాదని పేర్కొన్నాయి. యూ ఎస్‌ఏ నుంచి వివిధ రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపాయి. కాగా, వాణిజ్య అంశాలకు సంబంధించి ఎవరి ఒత్తిడులకూ భారత్ తలవంచదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. భారత్ ఇప్పుడు బలమైన దేశమని, ఏటా 6.5శాతానికిపైగా వృద్ధి రేటుతో దూసుకుపోతోందని పేర్కొన్నారు. శుక్రవారం బిజినెస్ టుడే ఇండియా సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ఆర్థిక మూలాలు, కరెన్సీ, డాలర్ నిల్వలు, స్టాక్ మార్కెట్లు బలంగా ఉన్నాయని చెప్పారు.

లోకం తీరు



భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవు!

టారిఫ్‌ల వ్యవహారం తేలేవరకు ఇదే పరిస్థితి అన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

- రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసేలా మరింత ఒత్తిడికి యత్నం
- భారీ ఆర్థిక మాంద్యం పొంచి ఉంది.. సుంకాల అంశంలో జోక్యం వద్దు..
- అమెరికా కోర్టులకు ట్రంప్ హెచ్చరిక



న్యూయార్క్/వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఆగస్టు 8: రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా భారత్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వాణిజ్య ఒప్పందం దిశగా జరుగుతున్న చర్చలనూ మధ్యలోకి తెచ్చారు. వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌తో వాణిజ్య చర్చల అంశాన్ని ప్రస్తావించగా.. "టారిఫ్‌ల అంశం తేలేదాకా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ఉండవు" అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపేయాలని ఎంత ఒత్తిడి తెస్తున్నా.. భారత్ వెనక్కి తగ్గకపోవడంపై ట్రంప్ ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అన్ని దేశాలకన్నా అధికంగా భారత్‌పై 50శాతం సుంకాలు విధించారు. భారత్‌ను ముందుపెట్టి రష్యాపై ఒత్తిడి తేవాలని ప్రయత్నిస్తున్నారు.

ఆర్థిక మాంద్యం పొంచి ఉంది.. జోక్యం వద్దు..

అంతటా భారీ ఆర్థిక మాంద్యం పొంచి ఉందని.. వాణిజ్య సుంకాల అంశంలో జోక్యం చేసుకుని అమెరికా ఆదాయానికి గండికొట్టవద్దని అమెరికా కోర్టులను ట్రంప్ హెచ్చరించారు. దీనిపై తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. "వివిధ దేశాలపై సుంకాలతో అమెరికా ఖజానాకు వేల కోట్ల డాలర్లు సమకూరుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోంది. మరోవైపు అంతటా 1929 నాటి తరహాలో భారీ ఆర్థిక మాంద్యం పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సుంకాలను అడ్డుకునేలా కోర్టులు జోక్యం చేసుకుంటే.. అమెరికా తిరిగి కోలుకోవడం చాలా కష్టం" అని పేర్కొన్నారు. వివిధ దేశాలపై సుంకాలు విధించేందుకు ట్రంప్ 'అమెరికా అంతర్జాతీయ అత్యవసర ఆర్థికాధికారాల చట్టం (ఐఈఈపీఏ)'ను అడ్డుపెట్టుకున్నారు. అధ్యక్షుడికి ఈ అధికారాలు లేవని, సెనేట్ (శాసనసభ)కే అధికారాలు ఉన్నాయని.. సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీచేసిన ఆదేశాలను రద్దు చేయాలని అమెరికా కోర్టుల్లో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

పుతిన్‌తో ప్రధాని మోదీ చర్చలు..

రష్యా చమురు కొనొద్దంటూ భారత్‌పై అమెరికా ఒత్తిళ్లు, సుంకాల విధింపు నేపథ్యంలో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. దీనికి సంబంధించి ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాను. ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిణామాలను ఆయన వివరించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక అంశాలపైనా చర్చించాం. భారత్-రష్యా మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. ఈ ఏడాది చివరిలో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు" అని మోదీ పేర్కొన్నారు.

ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా: నెతన్యాహూ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎలా డీల్ చేయాలో భారత ప్రధాని మోదీకి చెబుతానని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ పేర్కొన్నారు. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు విధించడంపై స్పందిస్తూ.. "ఈ విషయంలో భారత్, యూఎస్ ఒక అవగాహనకు రావాలి. మోదీ, ట్రంప్ ఇద్దరూ నాకు మంచి మిత్రులు. ట్రంప్‌తో ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా. కాకపోతే వ్యక్తిగతంగా కలిసినప్పుడు.." అని నెతన్యాహూ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఇజ్రాయెల్ ఆయుధాలను భారత్ ప్రయోగించిందని.. అవన్నీ చాలా బాగా పనిచేశాయని పేర్కొన్నారు. భారత్‌కు గగనతల నిఘా వ్యవస్థలు అందించేందుకు సిద్ధమని తెలిపారు.

మోదీ పర్యటనను స్వాగతించిన చైనా

బీజింగ్, ఆగస్టు 8: భారత ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చేపట్టనున్న చైనా పర్యటనను ఆ దేశం స్వాగతించింది. టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఏడేళ్ల విరామం అనంతరం ఆయన చైనా పర్యటనకు వెళ్లనుండడం విశేషం. ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తున్నట్టు శుక్రవారం చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు.

విద్యార్థుల అడ్మిషన్ల డేటాను ఇవ్వాల్సిందే..

యూనివర్సిటీలకు ట్రంప్ ఆదేశాలు

అమెరికాలో ఉన్నత విద్యావ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకునే దిశగా దేశాధ్యక్షుడు ట్రంప్ పావులు కదుపుతున్నారు. విశ్వ విద్యాలయాలు తమ విద్యార్థులకు సంబంధించిన అడ్మిషన్ల డేటాను ప్రభుత్వానికి వెల్లడించాలంటూ గురువారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. తమ విద్యార్థుల జాతి, లింగ, టెస్ట్ స్కోర్, గ్రేడింగ్ పాయింట్ల సగటు వివరాలను విద్యాశాఖకు ఇక నుంచి ఇవ్వాల్సిందేనంటూ పేర్కొన్నారు. కాలేజీలు జాతి ఆధారంగా కల్పించే ప్రవేశాలపై నియంత్రణ తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. జాతి సమానత్వాన్ని పెంపొందించడానికి, మైనారిటీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించడానికి గతంలో జో బైడెన్ సర్కారు ఇచ్చిన ఆదేశాలను తాజా ఉత్తర్వుతో ట్రంప్ రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయంపై న్యాయ నిపుణులు మండిపడుతున్నారు. అమెరికా విద్యా సంస్థల్లో నలుపు, గోధుమ వర్ణ విద్యార్థులు చేరకుండా అణచేయాలని చూస్తున్నారని విమర్శిస్తున్నారు.

మేం ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నాం

- భారత్-పాక్‌ల మధ్య యుద్ధం ఆపాం
- ఆపరేషన్ సిందూర్ కాల్పుల విరమణపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో

వాషింగ్టన్, ఆగస్టు 8: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట విరుచుకుపడిన విషయం తెలిసిందే. అయితే..పాకిస్థాన్ వేడుకోలు మేరకు కాల్పులు నిలిపివేశామని భారత్ చెబుతుంటే, కాదు.. మా జోక్యంతోనే ఇరు దేశాలు యుద్ధాన్ని ఆపేశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పారు. తాజాగా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మరోసారి ట్రంప్ మాటనే వల్లెవేశారు. "మేం ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నాం. అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్య యుద్ధాన్ని నిలువరించాం. శాంతిని నెలకొల్పే విషయంలో ట్రంప్ కీలకపాత్ర పోషించారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ఆపేస్తే.. భారీస్థాయిలో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటామని హామీ కూడా ఇచ్చారు. అందుకే ఇరు దేశాలు కాల్పులు విరమించాయి."అని రుబియో వ్యాఖ్యానించారు. గురువారం 'ఈడబ్ల్యూటీఎన్' నెట్‌వర్క్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణలో తమ జోక్యం ప్రత్యక్షంగా ఉందన్నారు. అధ్యక్షుడు ట్రంప్‌ను.. శాంతికి ప్రతిరూపమని అభివర్ణించారు. 'ప్రెసిడెంట్ ఆఫ్ పీస్' (శాంతి అధ్యక్షుడు)గా పేర్కొన్నారు. "ట్రంప్ పాలనంతా శాంతిమయం. ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘర్షణ ఏర్పడినా ఆయన శాంతికాముకుడిలా వ్యవహరిస్తున్నారు. కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని నిలువరించేందుకు ప్రయత్నిస్తున్నాం." అని వ్యాఖ్యానించారు.

ఎందుకు ఖండించరు?: కాంగ్రెస్

ఆపరేషన్ సిందూర్‌పై గతంలో ట్రంప్, తాజాగా రుబియో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. వారి వ్యాఖ్యలను నిర్దిష్టంగా ఎందుకు ఖండించడంలేదని ప్రశ్నించింది. అమెరికా వ్యాఖ్యలను ఖండించేందుకు ప్రధాని భయపడుతున్నారని ఎద్దేవా చేసింది. ఈమేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "మే 10న సాయంత్రం 5.35గంటలకు రుబియో స్పందిస్తూ.. భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయి. దీనికి కారణం అమెరికా జోక్యం చేసుకోవడమేనని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రంప్ 34సార్లు ఇదే మాట చెప్పారు. ఇప్పుడు మరోసారి రుబియో ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నామని, శాంతిని స్థాపించామని చెప్పారు. ఇంత జరుగుతున్నా మోదీ ఎందుకు బహిరంగంగా ఖండించలేకపోతున్నారు? అమెరికాఅంటే ఆయన భయపడుతున్నారా?"అని ఎద్దేవా చేశారు.

మేం వచ్చాక మిమ్మల్ని వదలం

- ఎన్నికల అధికారులకు రాహుల్‌గాంధీ హెచ్చరిక
- బెంగళూరులో 'ఓటు అధికార ర్యాలీ'

బెంగళూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మోసాలతో ప్రమేయం ఉన్న ప్రతి ఎన్నికల అధికారీ.. పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టంచేశారు. ఏదో ఒక రోజు తాము అధికారంలోకి వస్తామని.. అప్పుడు మిమ్మల్ని ఏం చేస్తామో చూడండని హెచ్చరించారు. ప్రతి ఎన్నికల కమిషనర్, అధికారి దీనిని గుర్తుంచుకోవాలన్నారు. ఎవరెంత సీనియర్ అధికారి అయినా.. జూనియర్ అయినా లెక్కచేసేది లేదని చెప్పారు. శుక్రవారం బెంగళూరులో ఆయన ఓటు అధికార ర్యాలీలో ప్రసంగించారు. గురువారం ఢిల్లీలో విలేకరుల భేటీలో తాను చూపిన డాక్యుమెంట్లపై సంతకం చేసి.. తమకు ప్రమాణ పత్రం సమర్పించాలని, అప్పుడు ఆయన ఆరోపణలపై విచారణ చేపడతామని ఈసీ చేసిన ప్రకటనపై రాహుల్ తీవ్ర స్థాయిలో స్పందించారు. తాను రాజ్యాంగాన్ని కాపాడతానని పార్లమెంటులో ప్రమాణం చేశానని గుర్తుచేశారు. ఓట్ల చోరీ ఆరోపణను పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికలను దొంగిలించేందుకు ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయన్నారు. 'నేను గురువారం విడుదల చేసిన డేటాను చూసి ప్రజలు ప్రశ్నించడం మొదలుపెట్టేసరికి.. ఈసీ తన వెబ్‌సైట్‌ను మూసివేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్‌లలోని ఈసీ వెబ్‌సైట్లను మూసివేశారు. ప్రజలు నిలదీస్తే తమ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని వారికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. తనను బెదిరించడానికి బదులు వీటికి బదులివ్వాలని స్పష్టంచేశారు. 'డిజిటల్ మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఓటర్ల జాబితాలను మీరెందుకు ఇవ్వడం లేదు? వీడియో ఆధారాలను మీరెందుకు ధ్వంసం చేస్తున్నారు? ఓటర్ల జాబితాల్లో భారీగా ఎందుకు మోసాలకు పాల్పడుతున్నారు? మా ప్రశ్నలకు జవాబులివ్వకుండా మమ్మల్ని ఎందుకు బెదిరిస్తున్నారు? ఈసీ బీజేపీ ఏజెంటులా ఎందుకు పనిచేస్తోంది' అని అడిగారు. ఎన్నికల చోరీపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కర్ణాటకలోని తమ పార్టీ ప్రభుత్వాన్ని రాహుల్ కోరారు. మోదీని 25 సీట్ల మార్జిన్‌తో ఎన్నికైన ప్రధానిగా పేర్కొన్నారు. 'దేశవ్యాప్తంగా మేం కోరిన ఎలక్ట్రానిక్ ఓటర్ డేటా గనుక మాకిస్తే.. భారత ప్రధాని దొంగతనం ద్వారా ఆ పదవిని అంటిపెట్టుకుని ఉన్నారని రుజువుచేస్తాం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మా కూటమి గెలిచింది. అయితే 4 నెలలకే అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయం సాధించింది. ఏం జరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నించినప్పుడు.. కోటి మంది కొత్త ఓటర్లు ఓటేశారని వెల్లడైంది. ఆ కొత్త ఓట్లన్నీ బీజేపీకి పడ్డాయి. కొత్త ఓటర్లు ఓటేసిన చోటల్లా ఆ పార్టీ గెలిచింది. కానీ మా కూటమి ఓట్లు తగ్గలేదు. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వచ్చాయి. నిజాలు తవ్వేందుకు మాకు 6నెలలు పట్టాయి. చిందరవందరగా పడేసిన ఎన్నో కాగితాల నుంచి మేం వెలికితీసిన డేటా.. ఓట్ల చౌర్యమనే నేరానికి ఆధారం'అని చెప్పారు. ఓటర్ల జాబితా సాఫ్ట్‌కాపీ ఇవ్వాలని ఈసీని అడిగితే తిరస్కరిస్తోందన్నారు. రాహుల్ రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకుని.. ఇందులో వేల శతాబ్దాల చరిత్ర గలిగిన సిద్ధాంతం ఉందని సభలో చెప్పారు. 'బీజేపీ సిద్ధాంతం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనది. డబ్బులిచ్చి కర్ణాటకలో మా ప్రభుత్వాన్ని తస్కరించింది' అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలనూ దొంగిలించిందని పూర్తి నమ్మకంతో, ఆధారాలతో చెబుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాల కారణంగా గుల్బర్గాలో తాను ఓడిపోయానన్నారు.



బెంగళూరు సభలో అభివాదం చేస్తున్న రాహుల్, ఖర్గే, సిద్దరామయ్య, డీకే శివకుమార్

మీ ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేయండి.. లేదంటే క్షమాపణ చెప్పండి: ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రాహుల్‌గాంధీ ఆరోపణలను ఈసీ మరోసారి ఖండించింది. ఆయన ఆరోపణలు నిజమైతే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఓటర్ల జాబితాల్లో తప్పుగా వేసిన ఎంట్రీలు, తొలగింపుల వివరాలను తమతో పంచుకోవాలని పేర్కొంది. 'మీ విశ్లేషణపై మీకు నమ్మకముంటే.. మీ ఆరోపణలు నిజమని భావిస్తే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి.. తప్పుగా చేర్చిన, తొలగించిన ఓటర్ల వివరాలివ్వడానికి ఇబ్బంది ఉండకూడదు. డిక్లరేషన్‌పై సంతకం చేయలేదంటే.. ఆయన అనాలిసిస్‌పై ఆయనకే నమ్మకంలేనట్లు లెక్క. చేసిన నిరాధార ఆరోపణలకు ఆయన జాతికి క్షమాపణ చెప్పాలి'అని ఈసీ వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. తమ వెబ్‌సైట్లను మూసివేశామన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. అన్ని భేషుగ్గా పనిచేస్తున్నాయని పేర్కొంది.

ఓట్ చోరీపై
దేశవ్యాప్త ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

తరహాలో దేశవ్యాప్తంగా ప్రజా ఆందోళనను లేవనెత్తాలని ఇండి కూటమి నేతలు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని, ఎన్నికలు జరగనున్న బిహార్‌లో దూకుడుగా వ్యవహరించాలని భావిస్తున్నట్టు సమాచారం. గురువారం సాయంత్రం రాహుల్ నివాసంలో విందు భేటీలో పాల్గొన్న కూటమి నేతలంతా.. ఎన్నికల సంఘంపై రాహుల్ దాడి తీరును ప్రశంసించినట్టు తెలిసింది.

ప్రజల్లోకి వెళ్తే బీజేపీకి నష్టమే?

రాహుల్ చేసిన ఆరోపణలు విపరీతంగా ప్రజల్లోకి వెళ్లడం, సాధారణ ప్రజలు దీనిపై మాట్లాడుకోవడం, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం లభించడంపై అన్ని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ ఆరోపణలు ప్రజల్లో ఏమాత్రం ప్రభావం చూపినా.. బీజేపీ పట్ల వ్యతిరేకతగా మారే అవకాశం ఉందని నేతలు అంటున్నారు. 2జీ కుంభకోణంతో నష్టం కేవలం ఊహాత్మకమేనని అప్పట్లో కాంగ్రెస్ నేతలు వాదించినా... కాంగ్రెస్ వేలకోట్ల అవినీతికి పాల్పడినట్టు ప్రజల్లోకి వెళ్లిందని, అది బీజేపీకి అనుకూలంగా మారిందని చెబుతున్నారు. ఇప్పుడు బీజేపీ ఓట్ల చోరీ చేయకపోయినా.. ప్రజల్లో ఆ అభిప్రాయం కలిగించడంలో కాంగ్రెస్ సఫలమైతే బీజేపీ దాని పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

లోపాలు సాధారణమే.. చర్చే అసాధారణం..

రాహుల్ ఆరోపణలు, ప్రజెంటేషన్‌పై ప్రభుత్వవర్గాల్లో, మంత్రిత్వ కార్యాలయాల్లో విస్తృతంగా చర్చలు జరుగుతున్నట్టు ఓ అధికారి తెలిపారు. నిజానికి రాహుల్ లేవనెత్తిన అంశాలు.. దేశవ్యాప్తంగా స్థానికంగా జరుగుతున్నవేనని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంటి నంబర్లు సరిగా ఉండవని, అధికారులు ఏదో ఒకటి రాసుకుంటారని, దాన్ని బట్టి బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైనట్లు భావించలేమని స్పష్టంచేశారు. కానీ ఈ అంశాన్ని సరైన సమయంలో లేవనెత్తడం, బాగా ప్రజెంటేషన్ చేయడంతో ఎన్నికల సంఘం, బీజేపీ విశ్వసనీయతపై సందేహాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. రాహుల్ చెప్పినట్టు బోగస్ ఓట్లు పడ్డాయా అనేది ఎన్నికల్లో పార్టీ ఏజెంట్లు టిక్ చేసిన ఓటర్ల జాబితాలను చూస్తే వెల్లడవుతుందని, కానీ అదంతా జరిగి ఉండే అవకాశం లేదని చెప్పారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలి

రాహుల్ ఆరోపణలతో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే.. ప్రధాన మంత్రి ముందుకొచ్చి అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని ఓ సీనియర్ రాజకీయ నాయకుడు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే కమిషనర్ల నియామకం పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు మోదీ ముందుకు రావాలన్నారు.


ఓటరుకార్డు-ఆధార్ అనుసంధానంతో పరిష్కారం!

ఓటరుకార్డును ఆధార్‌తో అనుసంధానం చేస్తే బోగస్, డూప్లికేట్ ఓట్ల సమస్యకు చెక్ పడుతుందని ఎన్నికల కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ నుంచి పంచాయతీల వరకు ఒకే ఓటర్ల జాబితాను అనుసరించడంతోనూ ప్రయోజనం ఉంటుందని అంటున్నాయి. ఇక దేశంలో పౌరులకు అన్ని అవసరాలకు ఉపయోగపడేలా ఒకే కార్డును జారీ చేయాలనే ప్రతిపాదనపై చాలా రోజులుగా చర్చ జరుగుతోందని.. అది అమల్లోకి వస్తే ఓట్ల సమస్య తీరుతుందని స్పష్టం చేస్తున్నాయి.

వెనక్కి తగ్గిన సుప్రీంకోర్టు!

(మొదటిపేజీ తరువాయి)

పదవీ విరమణ చేసే వరకు ఎలాంటి క్రిమినల్ కేసులు విచారించకుండా చూడాలని ఆదేశించింది. ఒక సివిల్ వ్యవహారంలో క్రిమినల్ చర్యలు చేపట్టాలని కింద కోర్టు తీసుకున్న నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ నిరాకరించారు. సివిల్ కేసుగా చేపడితే బాధితుడికి ఎప్పటికీ న్యాయం జరగదని తీర్పులో అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో అప్పీలుకు రాగా జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం తీవ్ర నిర్ణయాన్ని ప్రకటించింది. దాన్ని పునస్సమీక్షించాలని స్వయంగా ప్రధాన న్యాయమూర్తి విజ్ఞప్తి చేయడంతో జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం తన తీర్పులోని వివాదాస్పద వ్యాఖ్యలను తొలగించడంతో పాటు మిగతా తీర్పు అమలు కూడా పక్కనబెట్టింది. కేసును తాజాగా మళ్లీ విచారించాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పరిపాలన అధికారాల్లో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని చెప్పింది. జడ్జిలకు విధులు కేటాయించే అధికారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిదేనని అంగీకరించింది. కేసుకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ బన్సాలీని కోరింది. ఈ నెల 4న ఇచ్చిన తీర్పులో జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ తీర్పును అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటిగా అభివర్ణించింది. తాజాగా ఆ వ్యాఖ్యలపై వివరణ ఇస్తూ, ఎవరినీ ఇబ్బంది పెట్టే, జడ్జికి ఎలాంటి ఉద్దేశాలు ఆపాదించే ఉద్దేశం తనకు లేదని పేర్కొంది. గొప్ప తీర్పులు వచ్చినపుడు హైకోర్టు జడ్జిలను కొనియాడుతున్నామని గుర్తుచేసింది. హైకోర్టులు స్వతంత్ర వ్యవస్థలు కావని, భారత న్యాయ వ్యవస్థకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం కుదరదని చెప్పింది. న్యాయవ్యవస్థ తలెత్తుకొనే విధంగా ఉండాలనే ఉద్దేశంతోనే తాము తీర్పులో వ్యాఖ్యలు చేశామని తెలిపింది. హైకోర్టు తీర్పులోని వ్యవహారం న్యాయప్రక్రియలో జరిగిన పొరపాటు కాదని, న్యాయ వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను ప్రభావితం చేసేదిగా ఉందని పేర్కొంది. వాటిని కాపాడేందుకే తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది.



ముగిసిన వివాదం

ఆగస్టు 4 తీర్పులోని 25, 26 పేరాలను సుప్రీంకోర్టు తొలగించింది. జస్టిస్ కుమార్‌కు పదవీ విరమణ వరకు క్రిమినల్ కేసులు వినే అవకాశం ఇవ్వరాదని, ధర్మాసనంలో సీనియర్ న్యాయమూర్తి పక్కన రెండో న్యాయమూర్తిగా ఆయన్ను కూర్చోబెట్టాలని ఇచ్చిన రెండు ఆదేశాలను రద్దు చేసింది. న్యాయస్థానాల్లోనే చట్టబద్ధపాలన లేకుంటే న్యాయాన్ని అందించే వ్యవస్థ అంతరించినట్లేనని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు సమర్థంగా పనిచేస్తారని, విధులను శ్రద్ధగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ కేసును ముగించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవ్యవస్థ ఇబ్బందికర పరిస్థితి నుంచి బయట పడింది. హైకోర్టు జడ్జిని విధుల నుంచి తప్పించడమంటే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విధుల్లో జోక్యం చేసుకోవడమేనంటూ అలహాబాద్ హైకోర్టు నుంచి 13 మంది జడ్జిలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. జస్టిస్ పార్దీవాలా తీర్పును పక్కనబెట్టాలని కోరారు. కాగా, సుప్రీం తాజా ఆదేశాల పట్ల అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. సుప్రీం తీర్పులో తన తప్పు దిద్దుకోవడం గొప్ప విషయమని అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ కొనియాడారు. హైకోర్టులు సుప్రీంకోర్టుకు కింది స్థాయి వ్యవస్థలు కాదు, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలు అన్నారు.

గల్ఫ్‌లో 45 వేల మంది తెలంగాణ కార్మికులు

▸ వారి భద్రతకు ప్రత్యేక విభాగాలు.. లోక్‌సభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాల్లో 45 వేలకు పైగా తెలంగాణ కార్మికులు ఉన్నారని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. విదేశాల్లోని వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి భద్రతకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ ఆర్ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గల్ఫ్ సహా అన్ని దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు తెలంగాణ కార్మికుల రక్షణ కోసం పనిచేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. అత్యవసర సమయాల్లో సంప్రదించడానికి ఈ మెయిల్, ఫోన్ నంబర్లు, వాట్సాప్, సోషల్ మీడియా వంటి మార్గాలున్నాయని, తక్షణ స్పందన కోసం ప్రత్యేక విభాగాలూ పనిచేస్తున్నాయని తెలిపారు.

తెలంగాణకు కేంద్రం నిధులు

2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాల కింద నిధులు కేటాయించింది. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రూ.67.16 కోట్లు, ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ. 208.82 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో తెలిపారు. శుక్రవారం ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ, దూర ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రత్యేక భత్యాలు, నిపుణులకు గౌరవ వేతనాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్

▸ ఎన్‌జీఆర్‌ఐ ఆధ్వర్యంలో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే

▸ సమ్మక్కసాగర్ అనుమతులు సాధించాలి

▸ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. టన్నెల్ తవ్వకాన్ని బ్లాస్టింగ్ విధానంలో చేయాలని నిర్ణయం తీసుకున్నందునా.. సవరించిన ప్రతిపాదనలకు పరిపాలనపరమైన అనుమతులతో పాటు నిధుల కోసం త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నట్లు ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం అనంతరం ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ సూచనలను అనుగుణంగా పునరుద్ధరణ ప్రక్రియ మొదలు పెట్టబోతున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రూట్‌పై అధ్యయనం కోసం డెన్మార్క్‌కు చెందిన కంపెనీతో జియో ఫిజికల్ సర్వే చేయించాలని మంత్రి ఆదేశించారు. రూ.2.36 కోట్లతో వ్యయంతో ఈ సర్వే చేయనున్నారు. ఈ పనులను జాతీయ భూభౌతిక పరిశోధన కేంద్రానికి(ఎన్‌జీఆర్ఐ) అప్పగించారు. ఇక, సమ్మక్క సాగర్(తుపాకులగూడెం) ప్రాజెక్టుకు వరద కారణంగా ఛత్తీస్‌గడ్‌లో 100 ఎకరాలు ముంపునకు గురవుతుందని ఐఐటీ-ఖరగ్‌పూర్ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా.. ఆ 100 ఎకరాల భూమిని సేకరించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ పొందాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ తెస్తేనే డీపీఆర్‌కు అనుమతులిస్తామని సీడబ్ల్యూసీ తేల్చిచెప్పడంతో వెంటనే ఎన్‌వోసీ పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ప్రతీ చుక్క వరద మూసీకి చేరాలి

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్ నగరంలో వర్షాలు, వరదలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మరో వందేళ్ల అవసరాలను అంచనా వేసుకొని అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి ముందురోజు రాత్రి నగరంలో కురిసిన వర్షం, తలెత్తిన ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి ఏకంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ట్రాఫిక్ స్తంభించింది. లోతట్టు ప్రాంతాలకు వరద ముంపు పరిస్థితి ఏర్పడింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం పడటంతో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. మూడు నాలుగు నెలల వర్షం మొత్తం ఒకే రోజున కుమ్మరించటంతో ఇబ్బందులు వచ్చాయనే అంశం చర్చకు వచ్చింది. వాతావరణ మార్పులే అందుకు ప్రధాన కారణమని, అందుకు తగినట్లుగా నగరంలో అన్ని వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదని, ఒక్కోసారి కొన్నిచోట్ల 20 సెంటీమీటర్ల వర్షం నమోదవుతోందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం 4 గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, జీహెచ్ఎంసీ పరిధిలో 16 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎంత వర్షం పడినా నగరంలో ఎక్కడా నీరు నిలబడకుండా, వరద నీటితో ముంపునకు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించటం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలన్నీ సురక్షితంగా ఉంటాయని చెప్పారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే నగరంలో ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని అధికారులు అన్నారు.

వరద నీరు మూసీకి చేరేలా...

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లోని వరదనీరు అన్ని వైపుల నుంచి మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హుస్సేన్ సాగర్, దుర్గం చెర్వు, మీర్ అలంతో పాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీ (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేయాలని, మూసీలో స్వచ్ఛమైన నీరు మాత్రమే ఉండేలా చూడాలని చెప్పారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటు నుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలని స్పష్టం చేశారు. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్‌లో నీటి కష్టాలు తీరతాయని చెప్పారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని చెప్పారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. పాతనగరంలో పాదచారుల జోన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలన్నారు. చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో బహుళ అంతస్తుల పార్కింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

కాళ్లపారాణి ఆరకముందే కబళించిన మృత్యువు

▸ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

▸ నవ వధువు మృతి.. భర్తకు గాయాలు

▸ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ వద్ద ప్రమాదం



అఖిల (ఫైల్)

తిమ్మాపూర్/ చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లయి కాళ్ల పారాణి కూడా ఆరని నవ వధువును లారీ రూపంలో వచ్చిన మృత్యువు బలిగొంది. నవ దంపతులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఆ వధువు దుర్మరణం చెందగా.. ఆమె భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన ముద్దసాని అఖిల(22)కు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లొత్తునూర్‌కు చెందిన రాజుతో ఆగస్టు6న వివాహం జరిగింది. పీజీ ప్రవేశపరీక్ష రాయడానికి అఖిల, భర్త రాజుతో కలిసి శుక్రవారం ఉదయం లొత్తునూర్ నుంచి ద్విచక్రవాహనంపై తిమ్మాపూర్‌లోని పరీక్ష కేంద్రానికి వచ్చింది. పరీక్ష అనంతరం వారు రుక్మాపూర్‌లోని అఖిల ఇంటికి బయలుదేరారు. శుక్రవారం అఖిల ఇంట్లో నల్లపూసలు కుచ్చుకునే కార్యక్రమం ఉండగా, శనివారం అఖిల.. తమ్ముడికి రాఖీ కట్టాలని అనుకుంది. అయితే, ఈ నవదంపతుల ద్విచక్రవాహనాన్ని తిమ్మాపూర్‌వద్ద వెనకనుంచి వేగంగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. వారిద్దరూ కింద పడిపోగా.. లారీ అఖిల తలపై నుంచి దూసుకెళ్లింది. దీంతో అఖిల అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కిర్గిజిస్థాన్‌లో బందీ అయిన కుమారుడు.. విడిపించేందుకు పుస్తెలు తాకట్టుపెట్టిన తల్లి

▸ రేపు భారత్‌కు రానున్న రజనీకాంత్

దుబ్బాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏజెంట్ మోసం చేయడంతో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం బల్వంతపూర్ గ్రామానికి చెందిన రజనీకాంత్‌ను కిర్గిజిస్థాన్‌లో ఓ కంపెనీ అధికారులు బంధించారు. రూ.లక్ష చెల్లిస్తేనే విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. దీంతో తన కుమారుడిని విడిపించేందుకు రజనీకాంత్ తల్లి వరవ్వ తన పుస్తెల తాడును తాకట్టు పెట్టి ఆ మొత్తాన్ని చెల్లించింది. దీంతో బందీగా ఉన్న రజనీకాంత్‌ను అక్కడివారు శుక్రవారం విడిచిపెట్టి అతడి పాస్‌పోర్టును తిరిగి ఇచ్చేశారు. భారత్‌లో ఉన్న ఏజెంట్ మహబూబ్, అతని కుమారుడు అన్వర్ తమను మోసం చేయడం వల్లే తమ డబ్బులు రాబట్టుకోవడానికి రజనీకాంత్‌ను బంధించినట్లు కంపెనీ ఏజెంట్ చెప్పారు. పాస్‌పోర్టు తిరిగి ఇచ్చేసినట్లు తెలియడంతో తల్లి.. కుమారుడు తిరిగి వచ్చేందుకు మరో రూ.22 వేలతో విమాన టికెట్ బుక్ చేసింది. ఖర్చుల కోసం రూ.10 వేలను కూడా పంపించింది. రజనీకాంత్ శనివారం సాయంత్రం బయలుదేరి ఆదివారం భారత్‌కు చేరుకోనున్నాడు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, మోసం చేసిన ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

78 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి

▸ ఆదిలాబాద్ పట్టణంలో దారుణ ఘటన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. రహదారి పక్కన నిద్రిస్తున్న ఓ 78 ఏళ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను ఎత్తుకెళ్లి నోటిలో గుడ్డలు కుక్కి ఆపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. ఆదిలాబాద్‌లో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్, శివాజీచౌక్ రోడ్డు పక్కన నిద్రిస్తున్న వృద్ధురాలిని ఓ దుండగుడు గురువారం అర్ధరాత్రి తర్వాత బలవంతంగా పక్క సందులోకి ఎత్తుకెళ్లాడు. ఓ దుకాణం వద్ద వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా శక్తి ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలి

▸ ప్రభుత్వానికి మానవ హక్కుల కమిషన్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్‌సీ) ఆదేశించింది. ఈ మేరకు టీజీహెచ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ పేరిట ఓ ప్రకటన విడుదలైంది. వెంటనే జీతాలు చెల్లించి, రెండు నెలల్లోపు నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

చెన్నమనేని కేసును మళ్లీ విచారించలేం

▸ ఆయన పదవీ కాలం ముగిసింది.. సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నమనేని రమేష్ పదవీ కాలం ముగిసినందున ఆయన ఎన్నికకు సంబంధించిన కేసుపై మళ్లీ విచారించలేమని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వేములవాడ మాజీ శాసన సభ్యుడయిన రమేష్‌పై ప్రస్తుత ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. చెన్నమనేని రమేష్ భారత పౌరుడు కాదంటూ గత 15 ఏళ్లుగా ఆది శ్రీనివాస్ న్యాయ పోరాటం చేస్తున్నారు. ఇటీవలే కేంద్రం రమేష్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. ఆయన పౌరసత్వాన్ని రద్దు చేసినా, తనను వేములవాడ ఎమ్మెల్యేగా అధికారికంగా ప్రకటించడం లేదంటూ గత నెల 19న ఆది శ్రీనివాస్ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై ధర్మాసనం విచారణ జరిపింది. అయితే పిటిషనర్ అయిన శ్రీనివాస్ ప్రస్తుతం ఎమ్మెల్యేగానే ఉన్నారని, ప్రతివాది పదవీకాలమే ముగిసినందున ఈ కేసులో విచారణను జరపలేమని ధర్మాసనం తెలిపింది. ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

నీలగిరి, పాలమూరులో భారీ వర్షం

భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో 15.95 సెం.మీ.. శాలిగౌరారం, అడ్డగూడూరు, జడ్చర్లలోనూ భారీ వర్షపాతం

▸ చౌటుప్పల్‌లో ప్రవాహంలో చిక్కుకున్న కారు.. వాహనంలో ఏడుగురు

▸ తాడు సాయంతో అందర్నీ బయటకు తీసిన స్థానికులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



భువనగిరి జిల్లాలో భీమలింగం వద్ద రోడ్డుపై మూసీ ఉధృత ప్రవాహం, చౌటుప్పల్ మండలం నేలపట్లలోని వాగులో కారుతో సహా చిక్కుకున్న వారిని తాడు సాయంతో ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

రాష్ట్రంలో శుక్రవారం కొన్నిచోట్ల వర్షం పడింది. మహబూబ్‌నగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో భారీగా వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో 15.95 సెం.మీ వర్షపాతం నమోదైంది. నల్లగొండ శాలిగౌరారంలో 13.99, అడ్డగూడూరు మండలంలో 13.25, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 12.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం గ్రామ పరిధిలో సంగెం-బొల్లెపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో ముందస్తుగా రాకపోకలు నిలిపివేసి గస్తీ ఏర్పాటు చేశారు. ఈ మార్గం నుంచి చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ పరిసర ప్రాంత ప్రజలు భువనగిరి వెళ్లలేకపోతున్నారు. బీబీనగర్ మండలం రుద్రవెల్లి లోలెవల్ బ్రిడ్జి వద్ద మూసీ ప్రవాహాన్ని కలెక్టర్ హనుమంతరావు పరిశీలించి మూసీ ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల వద్ద ఓ కారు ప్రవాహంలో చిక్కుకుపోయింది. ఆరు, మూడేళ్ల వయసున్న చిన్నారులు సహా ఏడుగురు కారులోంచే డయల్100కు కాల్ చేశారు. కొద్దిసేపటికే స్థానికులొచ్చి తాడు సాయంతో కారులోంచి అందర్నీ ఒడ్డుకు చేర్చారు.

శ్రీశైలంలోకి స్వల్పంగా పెరిగిన వరద

ఎగువన కురుస్తున్న వర్షాలు, ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి నీరు వదలడంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 83వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 182.21 టీఎంసీలకు చేరింది. ఆల్మటికి 33 వేలు, నారాయణపూర్ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. జూరాల ప్రాజెక్టుకు 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుదుత్పత్తి ద్వారా 37,358 క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. సుంకేసులలోకి 39 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. నాగార్జున సాగర్‌లోకి 43,999 క్యూసెక్కులు చేరుతోంది. అంతేనీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ నీటిమట్టం 589.10 అడుగులకు చేరుకోవడంతో కుడికాల్వ ద్వారా 5,598, ఎడమ కాల్వ ద్వారా 7,353 క్యూసెక్కులు వదులుతున్నారు. ఇక గోదావరి పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 7,593క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రధాన కాలువలైన కాకతీయ, లక్ష్మి, సరస్వతీలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 40 టీఎంసీల నీరు ఉంది.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల దుర్మరణం

▸ వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో ఘటనలు



పాలేపల్లి రమేశ్, అస్లాం (ఫైల్)

యాలాల, ఊట్కూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పంట పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లిన ఇద్దరు రైతులు బోరు మోటారు వద్ద వైర్లను సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలం ముద్దాయిపేట్‌కి చెందిన పాలేపల్లి రమేశ్ (38) పొలంలో నారుకు నీరు పెట్టేందుకు శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లాడు. పొలంలో ఉన్న బోరు మోటారును ఆన్ చేయగా అది పనిచేయలేదు. దీంతో తెగి కిందపడిపోయిన సర్వీస్ వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అలాగే, నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమారినికి చెందిన అస్లాం (33) తన పొలంలో పత్తి పంటను సాగు చేసుకున్నాడు. గురువారం సాయంత్రం పంటకు నీరు పెట్టేందుకు పొలంలోని బోరు మోటారును ఆన్ చేయడానికి వెళ్లి విద్యుత్ వైర్లు తెగిపడటాన్ని గమనించాడు. వాటిని సరిచేస్తుండగా షాక్‌తో చనిపోయాడు.

నమ్రత లిస్టులో 200 మంది దంపతులు!

▸ సరగసీ కోసం 'సృష్టి'లో భారీగా రిజిస్ట్రేషన్లు

▸ కొనసాగుతున్న పోలీసు విచారణ.. 30కి చేరిన అరెస్టుల సంఖ్య

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, విశాఖపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. సరగసీ పేరిట 'సృష్టి' నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత చేసిన మోసాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. డాక్టర్ నమ్రత సహా 26 మందిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు నమ్రతకు ఏజెంట్లుగా వ్యవహరించిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఇందులో విజయ్, సరోజ, రత్న అనే ముగ్గురిని విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 30కి చేరింది. అరెస్టయిన వారిలో వైద్యులు, టెక్నీషియన్లు, ఏజెంట్లు, శిశు అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడిన దళారులు ఉన్నారు. ఈ కేసులో విశాఖలోని కేజీహెచ్‌లో పని చేస్తున్న మరో ముగ్గురు వైద్యుల పాత్రను కూడా గుర్తించిన పోలీసులు వారినీ అదుపులోకి తీసుకునే అవకాశముంది. కాగా, నమ్రత మాటలు నమ్మి సరగసీ ద్వారా సంతానం పొందేందుకు తెలుగు రాష్ట్రాల్లోని సృష్టి ఫర్టిలిటీ సెంటర్లలో 200 మంది దంపతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. ఆ జాబితా పోలీసుల చేతికి చిక్కినట్టు తెలిసింది. కాగా, ఈ కేసులో అరెస్టయిన వైజాగ్, కేజీహెచ్ ఆస్పత్రి అనస్థీషియా విభాగం వైద్యుడు డాక్టర్ వాసుపల్లి రవి వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కు సోదరుడని తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఏది నిజం?

తాను చెబుతున్నది నిజమని రాహుల్‌గాంధీ నమ్ముతున్న పక్షంలో అఫిడవిట్‌మీద సంతకంతో లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని, లేదంటే దేశప్రజలను తప్పుదోవపట్టించినందుకు క్షమాపణలు కోరాలని భారత ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. బెంగుళూరులో గురువారం సుదీర్ఘమీడియా సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు తీవ్రమైనవి. దాదాపు గంటన్నర వీడియో ప్రెజెంటేషన్‌లో ఈసీ–బీజేపీ కలసి ఓట్ల చౌర్యానికి పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. ఓటర్ల డిజిటల్ డేటానూ, సీసీటీవీ ఫుటేజ్‌లనూ కాంగ్రెస్‌కు ఇవ్వడానికి ఎన్నికల సంఘం ఎంతోకాలంగా నిరాకరిస్తున్న నేపథ్యంలో, బెంగుళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవ్‌పురాను ఈమారు ఆయుధంగా ప్రయోగించారు రాహుల్. ఈ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్ల గోల్‌మాల్ జరిగిందని విశ్లేషించడం ద్వారా కాంగ్రెస్ వెనుకంజకూ, నరేంద్రమోదీ విజయాలకూ ఈ ఓట్ల చౌర్యమే దేశవ్యాప్తంగా పనిచేసిందని ఆయన నిర్ధారించారు. మెషీన్ రీడబుల్ డేటాను ఈసీ ఇవ్వనందున, ఒక్క మహదేవ్‌పుర మాయను వెలుగులోకి తేవడానికే తమకు ఆరునెలలు పట్టిందంటున్నారు ఆయన. ఈ సమావేశంలో తెర మీద ప్రదర్శించిన సమాచారం, దానిపై రాహుల్ చేసిన విశ్లేషణ చూసినవారికి ఆ ఓట్లచౌర్యం ఆరోపణలో అసత్యమేమీలేదన్న భావన కలగడం సహజం. దేశప్రజలంతా రాహుల్ వాదనను నమ్మి నిజమనుకొనే ప్రమాదం ఉన్నందున, ప్రమాణపత్రంతో ఫిర్యాదుచేస్తేనే పరిశీలిస్తానని ఎన్నికల సంఘం చెప్పడం సరికాదు. తాను చెబుతున్నది నిజమని రాహుల్ నమ్ముతున్నారా లేదా అన్నది కాదు, అందులో నిజం ఉన్నదా లేదా నిగ్గుతేలడం దేశ ప్రయోజనాల రీత్యా ముఖ్యం. రాహుల్ చేసిన విశ్లేషణలోనూ, ఆర్నెల్ల పాటు సేకరించిన సమాచారంలోనూ వీసమెత్తు నిజం కానీ, నిజాయితీ కానీ లేదని ఎన్నికల సంఘం నమ్మినపక్షంలో అది కేవలం రాజకీయ కుట్రేనని నిగ్గుతేల్చే కర్తవ్యాన్ని నెత్తినెత్తుకోవాల్సిన కీలకమైన అంశమిది.

నకిలీ ఓటర్లు, తప్పుడు చిరునామాలు, ఒకే చిరునామాలో బల్క్ ఓటర్లు, నకిలీ ఫోటోలు, కొత్త ఓటర్ల నమోదుకు వాడే ఫార్మ్ 6 దుర్వినియోగం వంటి ఐదురకాల విధానాల్లో మహదేవ్‌పురాలో లక్షకుపైగా ఓట్లమోసం జరిగిందని కాంగ్రెస్ అంటోంది. బెంగుళూరు సెంట్రల్ లోక్‌సభస్థానంలోని మిగతా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ ఓడినప్పటికీ, ఆరున్నర లక్షల ఓటర్లున్న మహదేవ్‌పురాలో లక్షా పద్నాలుగువేల ఆధిక్యం సంపాదించడంతో, సదరు పార్లమెంటరీ స్థానాన్ని బీజేపీ 33వేల ఓట్ల మెజారిటీతో గెలవగలిగింది. పాతిక లోక్‌సభ స్థానాలు ఎక్కువ వచ్చినందుకు నరేంద్రమోదీ ప్రధాని అయ్యారని, ముప్పై ఐదువేల ఓట్లకంటే తక్కువ తేడాతో బీజేపీ గెలుచుకున్న లోక్‌సభ స్థానాలు పాతికకుపైనే ఉన్నాయనీ, ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్, వీడియో రికార్డులను ఇచ్చిన పక్షంలో, దేశవ్యాప్తంగా ఎన్ని మహదేవ్‌పురాలున్నాయో రుజువు చేస్తామని రాహుల్ సవాల్ చేస్తున్నారు.

నిందలు వేయడం తప్ప, విధానాలను పాటించడం మీద రాహుల్‌కు శ్రద్ధలేదని ఈసీ ఆరోపిస్తోంది. చర్చకు రమ్మన్నా రావడం లేదని ఎన్నికల సంఘం అంటూంటే, మేం అడిగినదానిని ఇవ్వకుండా మాటలతో ప్రయోజనం ఏమిటని కాంగ్రెస్ అంటోంది. డిజిటల్ ఓటర్ల జాబితా, సీసీ ఫుటేజ్ ధ్వంసం ఇత్యాది అంశాలతో రాహుల్ నిరవధికంగా దాడికొనసాగించేందుకు ఎన్నికల సంఘమే అవకాశం ఇస్తోంది. భారత ప్రజాస్వామ్యం అమూల్యమైనది అంటూ హితోపదేశాలు చేసేందుకూ, ఈసీని బీజేపీ తొత్తుగా ఆరోపించేందుకు వీలుకలుగుతోంది. తన విమర్శకు పునాదిగా రాహుల్ వాడిన సమాచారం ఎక్కడినుంచో తెచ్చింది కాదు. ఈసీ అధికారిక డేటానే ఆయన వాడుకున్నారు. లక్షకుపైగా ఓట్లకు సంబంధించిన ఆ డేటా అబద్ధమైన పక్షంలో అదేమాటచెప్పవచ్చు. లేదా పాక్షిక నిజాన్ని పక్షపాతంతో తనకు అనుకూలంగా విశ్లేషించుకున్నారనీ వివరించవచ్చు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికల సంఘాన్ని ఇలా బహిరంగంగా నిందిస్తూ, కుట్రలను ఆపాదిస్తూ, ఎన్నికల ప్రక్రియ మీదే ప్రజల్లో అనుమానాలు పెంచుతున్న రాహుల్‌గాంధీ, తన ఆరోపణలమీద ఫిర్యాదుచేస్తేకానీ పరిష్కారాలు ఉండవని ఈసీ అనడం భావ్యంకాదు.

ట్రంప్ ‘వృషభ’ వీరంగాలు!

భారత్ ఒకప్పుడు విదేశీ వాణిజ్యానికి సుముఖంగా ఉండేది కాదు. ముఖ్యంగా దిగుమతులను వ్యతిరేకించేది. సహచర అలీనోద్యమ దేశాలతోనైనా, తోటి వర్ధమాన దేశాలతోనైనా అదే వైఖరితో వ్యవహరించేది. వాణిజ్యం, విదేశీ పెట్టుబడుల విషయంలో అన్య దేశాలతో వ్యవహరించడంలో అత్యంత అప్రమత్తంగా ఉండేది. వాణిజ్య భారతావని తలుపులు పూర్తిగా మూసివేశాం. నాలుగు దశాబ్దాల పాటు వాటిని తిరిగి తెరువనే లేదు. పైగా ఎగుమతి దిగుమతులకు భయంకరమైన నిబంధనలు నిర్దేశించాం. అవును, ప్రతి ఎగుమతికీ, ప్రతి దిగుమతికీ లైసెన్స్‌లు, పర్మిట్‌లు తప్పనిసరి. మన దిగుమతులలో అత్యధికం, ఎగుమతులలో కొన్ని ప్రభుత్వ యాజమాన్యంలోని కార్పొరేషన్ల ద్వారా విధిగా జరుగుతుండేవి. ‘చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్’ అనే అధికారి ఒకరు మనకు ఉండేవారు. ఆయన



■ పి. చిదంబరం

‘పళని’ పలుకు

కింద ఒక విస్తృత అధికార గణం ఉండేది. వారు దేశ వ్యాప్తంగా ఉండేవారు. ఈ అధికార గణం చేసే ఏకైక పని దిగుమతులు, ఎగుమతులకు లైసెన్స్‌లు జారీ చేయడమే! అదొక లాభసాటి వ్యవహారం. ఎవరూ ఎప్పుడూ ఒక ప్రశ్న అడిగిన పాపానికి పోలేదు: ‘మంచిదే, దిగుమతులను నియంత్రించే అధికారి ఒకరు ఉండడాన్ని అర్థం చేసుకుంటున్నాం, అయితే ఎగుమతులను నియంత్రించే అధికారి ఎందుకు ఉన్నారు?’. ప్రశ్న స్పష్టమే. సమాధానమే లేదు.

ఈ విధానం ఎగుమతులను పెంపొందించలేదు. ఎగుమతుల ఆధారిత తయారీ పరిశ్రమల రంగాన్ని అభివృద్ధిపరచలేదు. విదేశీ మారకద్రవ్య నిల్వలను సమృద్ధం చేయలేదు. ఇదిలా ఉండగా భారత్‌తో సమస్థాయి ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయ్యే బహిరంగ ఆర్థిక వ్యవస్థ (ఓపెన్ ఎకానమీ)ను అభివృద్ధిపరచుకోవడానికి సంకల్పించాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించి సుసంపన్నమయ్యాయి.

అనేక కారణాల వల్ల భారత ఆర్థిక వ్యవస్థ 1990–91లో సంక్షోభం అంచుకు చేరింది. ఆర్థిక సంస్కరణలను అమలుపరచడం భారత ప్రభుత్వానికి అనివార్యమయింది. వాణిజ్య, పారిశ్రామిక విధానాలలో మౌలిక మార్పులతో ఆర్థిక క్రమశిక్షణకు అగ్ర ప్రాధాన్యమివ్వడం ద్వారా భారత్ ఆ సంక్షోభం నుంచి గట్టెక్కింది. అభివృద్ధిపథంలోకి ప్రవేశించి వడివడిగా ముందుకు సాగింది. సుంకాలు తగ్గించాం (సగటు సుంకాన్ని 2013లో 12 శాతానికి తీసుకు వచ్చాం), సుంకాలేతర అవరోధాలను తొలగించాం. ‘సుంకాలు, వాణిజ్య సాధారణ ఒప్పందం’ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్)పై సంతకం చేసి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ)లో సభ్య దేశంగా చేరాం. వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఆర్థిక వ్యవస్థ అనేది ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉండే బహిరంగ ఆర్థిక వ్యవస్థగా ఉండాలనే యథార్థాన్ని భారతీయులు అంగీకరించారని ఆత్మవిశ్వాసంతో చెప్పగలం.



ఏ దేశమైనా మరొక దేశానికి లోబడినా, మోకరిల్లినా, అనుగ్రహానికి ప్రాకులాడినా ఆ దేశం అనివార్యంగా మట్టికరుస్తుంది, సందేహం లేదు. విదేశీ సంబంధాలలో మొదటి పాఠమిది. డోనాల్డ్ ట్రంప్‌తో దోస్తీ చేయడంలో నరేంద్ర మోదీ ఈ కఠోర రాజనీతిని మరచిపోయారు. అదృష్టవశాత్తు ట్రంప్ తెంపరితనాన్ని మోదీ ప్రతిఘటిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇది నాకూ, ప్రతి భారతీయునికీ చాలా సంతోషకరమైన పరిణామం.

దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే అభివృద్ధి చెందుతున్న దేశాలు బహిరంగ ఆర్థిక వ్యవస్థలుగా మార్పు చెందుతుండగా స్వేచ్ఛా వాణిజ్యానికి ఆద్యులు అయిన అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థల ‘సంరక్షణ’ విధానాలకు మళ్లాయి. ఈ విషయంలో అమెరికా పథ నిర్దేశం చేసింది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో ఆ దేశం ఈ విషయంలో మరింత ముందంజ వేసింది. తాత్కాలిక సంక్షోభాన్ని నివారించేందుకు ‘సంరక్షణ’ చర్యలు చేపట్టడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే ‘సంరక్షణవాదం’ను అధికారిక ఆర్థిక విధానంగా మార్చుకోవడాన్ని ఎలా చూడాలి? భారీ సుంకాలు విధించడమే ట్రంప్ అభిమతం. అందుకు ఆయన ఎవరికీ ఎటువంటి సంజాయిషీ ఇవ్వరు. అపార దర్శక టారిఫేతర చర్యలకు పూర్తిగా అనుకూలుడు. అంతేనా? దిగుమతులను ఆయనెంతగానో నిరుత్సాహపరుస్తున్నారు, పనిగట్టుకుని ప్రతి దేశంతో వాణిజ్య సమతౌల్యతను సాధించేందుకు ఆరాటపడుతున్నారు. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను అమెరికాలోనే నెలకొల్పుకోవాలి, అమెరికాయేతర దేశాలలో వాటిని నిర్వహించకూడదని ఆంక్షలు విధిస్తున్నారు. తన ఆకాంక్షలను తాను విధించే సుంకాలు నెరవేరుస్తాయని ట్రంప్ విశ్వసిస్తున్నారు.

అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను మళ్లీ స్వదేశానికి తీసుకురావాల్సిందేనని ట్రంప్ గట్టిగా వాదిస్తున్నారు. అలా ‘దేశభక్తి’ చూపని కంపెనీలు అనేక ఆంక్షల నెదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ‘ఇది చేయడం కంటే చెప్పడం తేలిక ’అని హార్వర్డ్ బిజినెస్ రివ్యూ వ్యాఖ్యానించింది, లేదు, నిరసించింది. ‘ఒక వస్తువును ఉత్పత్తి చేయడంలో అనేక ప్రక్రియలు ఉంటాయని, వాటన్నిటినీ ఒకే కంపెనీ చేయగలగడం సాంకేతికతలు సంక్లిష్టమై పోయిన ప్రస్తుత కాలంలో అసాధ్యమని, అందుకు అవసరమైన నైపుణ్యాలను ఒకే ఒక్క ప్రదేశంలో సమీకరించడం అంతకంటే అసాధ్యమని’ ఆ పత్రిక నిష్కర్షగా చెప్పింది. 21వ శతాబ్ది వస్తూత్పత్తి కార్యకలాపాల సంక్లిష్టతలపై ట్రంప్‌కు ప్రాథమిక అవగాహన కూడా లేదని, ఆయన కాలానికి అనుగుణమైన అధునాతన ఆలోచనలు ఉన్న వ్యక్తి కానేకాదని’ అర్థశాస్త్ర విజ్ఞుడు ఒకరు విమర్శించారు.

తన లక్ష్యాల సాధనకు సుంకాలను ఆయుధాలుగా ట్రంప్ ఉపయోగించుకుంటున్నారు. తనతో ఏకీభవించి తన షరతులకు అంగీకరించిన ఆస్ట్రేలియా, ఇండోనేసియా, జపాన్, దక్షిణ కొరియా ప్రయోజనాలకు అనుకూలంగాను, తనతో విభేదించిన కెనడా, ఫ్రాన్స్, బ్రిటన్, బ్రెజిల్ ప్రయోజనాలకు ప్రతికూలంగాను ఆయన నిర్ణయాలు తీసుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు జరిమానాతో సహా భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ట్రంప్ సుంకాలపై ఆవశ్యక చర్యలు చేపడతామని న్యూఢిల్లీ ప్రతిస్పందించింది.

భారత్ లోబడదు, మోకరిల్లదు అనేది స్పష్టం. ధిక్కరించాల్సిన అవసరం కూడా భారత్‌కు లేదు చర్చల ప్రక్రియ ఎంత సుదీర్ఘమూ, బాధాకరమైనా సుంకాలపై సంప్రతింపులకు మనం మన సుముఖతను స్పష్టంగా ప్రకటించాలి. ట్రంప్ తన సుంకాల విధానంపై పునరాలోచన చేసేలా ఆర్థిక సూత్రాలు ఆయనను బలవంతం చేస్తాయి, సందేహం లేదు. అమెరికా ప్రజలు నిత్యం వినియోగించుకునే వందలాది వస్తువులు, సేవలపై అధిక సుంకాలతో ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. అమెరికన్ కంపెనీలు తమ ఫ్యాక్టరీలను స్వదేశానికి తీసుకురావడంలో తాత్సారం చేస్తాయి. అమెరికాలో ఉద్యోగాలు పెరగవు. అనివార్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు మందగిస్తుంది. 2026లో కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికలు ట్రంప్ దురహంకారానికి మంగళం పాడే అవకాశం ఎంతైనా ఉన్నది.

ఏ దేశమైనా మరొక దేశానికి లోబడినా, మోకరిల్లినా, అనుగ్రహానికి ప్రాకులాడినా ఆ దేశం అనివార్యంగా మట్టికరుస్తుంది, సందేహం లేదు. విదేశీ సంబంధాలలో మొదటి పాఠమిది. డోనాల్డ్ ట్రంప్‌తో దోస్తీ చేయడంలో నరేంద్ర మోదీ ఈ కఠోర రాజనీతిని మరచిపోయారు. అదృష్టవశాత్తు ట్రంప్ తెంపరితనాన్ని మోదీ ప్రతిఘటిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇది నాకూ, ప్రతి భారతీయునికీ చాలా సంతోషకరమైన పరిణామం. భారత్ కొండలా నిలబడుతుంది, తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని వాషింగ్టన్‌కు ఎటువంటి శషభిషలకు తావు లేకుండా న్యూఢిల్లీ స్పష్టం చేయాలి. భారత్ అన్నిటా న్యాయబద్ధంగా ఉంటుంది, న్యాయమైన వాణిజ్యాన్నే చేస్తుంది. పరస్పర లాభదాయకమైన వాణిజ్యానికై సంప్రదింపులు జరిపేందుకు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు సంసిద్ధంగా ఉన్నామని అమెరికాకు తెలియజేయాలి. ఎన్ని కష్టనష్టాలు ఎదుర్కోవలసివచ్చినా భారత్ సదా సదరు బాటలోనే సుస్థిరంగా ముందుకు సాగుతుంది. ఇది ప్రతి భారతీయుని మాట, ప్రధాని మోదీ అనుసరించే బాట.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చరితార్థుడైన చరిత్రకారుడు


మహాత్మాగాంధీకి నలుగురు కుమారులు ఉన్నారు. ప్రథమ, ద్వితీయ పుత్రులు హరిలాల్, మణిలాల్‌ను ఆయన వేధించారు. మూడో తనయుడు రామ్‌దాస్ పట్ల ఆదరభావంతో ఉండేవారు. కనిష్ఠ కుమారుడు దేవదాస్ జన్మించే నాటికి బిడ్డల పట్ల మరింతగా ఆప్యాయతానురాగాలు చూపే తండ్రిగా పరిణతి పొందారు. చిన్నారి దేవో తల్లి కస్తూరిబాకు బాగా ప్రేమాస్పదుడైన బిడ్డ. మృదుస్వభావి అయిన దేవదాస్ ఆశ్రమ జీవితంలో బాగా ఒదిగిపోయారు. పెద్దవాడవుతున్న కొద్దీ తండ్రి చెప్పిన పనులన్నీ మారు మాట్లాడకుండా నిర్వర్తించేవారు. నూలు వడికేవారు, దక్షిణ భారతీయులకు హిందీ బోధించేవారు.

ఒక సందర్భంలో మాత్రం తండ్రిని దేవదాస్ ధిక్కరించారు. గాంధీ సన్నిహిత సహచరుడు, రాజాజీగా సుప్రసిద్ధుడైన సి.రాజగోపాలాచారి కుమార్తె లక్ష్మితో దేవదాస్ ప్రేమలో పడ్డారు. వారి ప్రేమను గాంధీ, రాజాజీ ఇరువురూ వ్యతిరేకించారు. బిడ్డల ప్రేమను పరీక్షించేందుకు ఐదు సంవత్సరాల పాటు పరస్పరం మాట్లాడుకోకూడదని, ఉత్తరాలు సైతం రాసుకోకూడదని దేవదాస్, లక్ష్మిలను వారి తండ్రులు ఆదేశించారు. యువ ప్రేమికులు ఐదేళ్ల పాటు తమ తండ్రుల ఆదేశాన్ని ఓర్పుతో పాటించారు. నిషిద్ధ కాలం పూర్తయిన తరువాత వివాహం చేసుకున్నారు. హిందుస్థాన్ టైమ్స్‌లో పాత్రికేయుడుగా దేవదాస్ చేరారు. ఢిల్లీలో దేవదాస్, లక్ష్మి కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఈ నగరంలోనే వారి నలుగురు బిడ్డలు జన్మించారు. 1934లో తార, 1935లో రాజ్ మోహన్, 1937లో రామచంద్ర, 1945లో గోపాల్ కృష్ణ పుట్టారు.

గాంధీ కుమారుడు రాజాజీ కుమార్తెను వివాహం చేసుకున్న వైనం నా మనసులో చిన్ననాటి నుంచీ నిలిచిపోయింది. దేవదాస్–లక్ష్మి ప్రేమ గాథ భారత దేశ మధ్యతరగతి ప్రజలలో విస్తృతంగా ప్రసిద్ధి పొందింది. వారి ప్రేమాయణం నా తల్లిదండ్రులకు కూడా స్ఫూర్తినిచ్చింది. నా తల్లిదండ్రులు సైతం తమ వివాహానికి ఇరువురి కుటుంబాల అనుమతికై ఐదేళ్లు వేచివున్నారు.

దేవదాస్, లక్ష్మీ గాంధీల సంతానం నలుగురితోను పరిచయం కలగడం, స్నేహ బంధం ఏర్పడడం, నా మేధో వ్యాసంగాలను వారు ప్రభావితం చేయడం నా జీవిత మహద్భాగ్యంగా భావిస్తున్నాను. వీరిలో నాకు తొలుత పరిచయమయింది తాత్త్వికుడు రామచంద్ర గాంధీ. నా మేనమామలు చదివిన సెయింట్ స్టీఫెన్ కళాశాలలోనే ఆయన విద్యాభ్యాసం జరిగింది. అయితే నాకు బాగా పరిచితుడు, సన్నిహితుడు ఆ నలుగురిలో కడగొట్టు వాడయిన గోపాల్‌కృష్ణ. 1980ల్లో మేమిరువురమూ ఢిల్లీలో పనిచేస్తుండగా మా స్నేహం ప్రారంభమయింది. గోపాల్ గృహంలోనే ఆయన అక్క తారతో నేను మొదట సమావేశమయ్యాను. ఖాదీ వ్యవహారాలపై ఆమె సాధికారిక పరిశోధనలు నిర్వహించారు. తల్లిదండ్రుల మాతృభాషలతో పాటు హిందీ, బెంగాలీ, ఇటాలియన్, ఇంగ్లీష్ మొదలైన భాషలలో కూడా ఆమెకు అద్వితీయ పాండిత్యమున్నది. గోపాల్‌కృష్ణే తన పెద్ద సోదరుడు రాజ్‌మోహన్‌ను నాకు పరిచయం చేశారు. ఈ ఆగస్టు 7న రాజ్ 90వ వసంతంలోకి ప్రవేశించారు. ఈ ప్రశంసా వ్యాసానికి ఆయన పుట్టినరోజు ఒక సంతోషకరమైన సాకు.

1990లో నేను మొట్టమొదటిసారి రాజ్‌మోహన్‌ను కలుసుకున్నప్పుడు ఆయన ఒక పార్లమెంటరీ ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయారు. 1989లో అమేథీ లోక్‌సభా నియోజకవర్గంలో ప్రధానమంత్రి రాజీవ్ గాంధీపై ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా రాజ్‌మోహన్ పోటీ చేశారు. ఆ ఎన్నిక అస్లీ గాంధీ, నక్లీ గాంధీ మధ్య పోటీగా దేశవ్యాప్తంగా సుప్రసిద్ధమయింది. రాజ్‌మోహన్ మహాత్ముడికి స్వయాన మనవడు. రాజీవ్‌కు గాంధీ పేరు యాదృచ్ఛికంగా వచ్చింది (పార్సీ మతస్థుడు అయిన రాజీవ్ తండ్రి ఫిరోజ్‌గాంధీ పేరును వాస్తవంగా ‘ఘాండీ’ అని ఉచ్చరిస్తారు). సమున్నత నైతిక, మేధో వ్యక్తి వ్యక్తిత్వమున్న రాజ్‌మోహన్‌కు సిరిసంపదలు లేవు. సహజంగానే నెహ్రూ కుటుంబానికి కంచుకోట అయిన అమేథీలో ఆయన పరాజయం పాలయ్యారు. అయితే ఆ సార్వత్రిక ఎన్నికల్లో రాజీవ్ పార్టీ ఓడిపోయింది. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రధానమంత్రి అయ్యారు. రాజీవ్‌కు గట్టి పోటీనిచ్చినందుకుగాను రాజ్‌మోహన్‌కు రాజ్యసభ సభ్యత్వం లభించింది.



రాజ్, రామచంద్ర ఇరువురూ మహాత్ముడికి మనవళ్లే కాకుండా గాంధీ విద్వజ్జులు. ముఖాముఖి సంభాషణల్లోను, సభల్లో శ్రోతగాను రాము మాటలు వినడం ఒక మేధో నిమగ్న అనుభవం. ఋషితుల్యుడైన భారతీయ దార్శనికుడులా మౌఖిక సంప్రదాయంలో ఆయన వాణి వివేకవంతమైన ఆలోచనలను పురిగొల్పుతుంది. రాజ్‌మోహన్ రచనల్లో అనుభావిక వివరాలు పుష్కలంగా ఉంటాయి. నిశితమైన అభిప్రాయాలు ఉంటాయి. విడివిడిగా, సంయుక్తంగా ఈ సోదరులిరువురూ గాంధీ గురించి, భారతదేశం గురించీ నాకు చాలా విలువైన విషయాలు బోధించారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

చూపరులను ఇట్టే ఆకట్టుకునే వ్యక్తి రాజ్‌మోహన్. చాలా నెమ్మదిగా, మృదువుగా జాగ్రత్తగా మాట్లాడతారు. అయితే సోదరుడు రామచంద్రకు ఉన్న వాగ్ధాటి ఆయనకు లేదు. తమ్ముడిలోని కొంటె హాస్యమూ అన్నలో తక్కువే. రాజ్‌మోహన్‌తో పరిచయమైన వెంటనే ఆయనలో అపారమైన ప్రభావశీలత ఉన్నదని నాకు అర్థమయింది. అప్పటికే నేను ఆయన రాసిన రాజాజీ, పటేల్‌ల జీవిత చరిత్రలు చదివాను. వాటి మేధో నైశిత్యం, నిష్పాక్షికత నన్ను ప్రగాఢంగా ప్రభావితం చేశాయి. రాజ్‌మోహన్ తొలుత ‘హిమ్మత్’ అనే మ్యాగజైన్‌కు ఎడిటర్‌గా ఉండేవారు. ఉదారవాద విలువలను నిర్భయంగా సమర్థించేవారు. ఎమర్జెన్సీలో అనేక ఒత్తిళ్లకు తట్టుకుని నిలబడిన ఆ పత్రిక ఆ తరవాత ఆర్థికవనరుల కొరతతో మూతపడింది. తదనంతర కాలంలో ప్రధానస్రవంతి మీడియాలో సుప్రసిద్ధులు అయిన పాత్రికేయులు, రచయితలు తొలుత రాజ్‌మోహన్ మార్గదర్శకత్వంలోనే శిక్షణ పొందారు.

రాజ్‌మోహన్‌కు నన్ను గోపాల్ పరిచయం చేసిన తరువాత నేను నేరుగా ఆయనను కలిసి మాటామంతీ జరపడం ప్రారంభించాను. రాజ్‌తో ప్రతి సమావేశమూ మన దేశ చరిత్రపై నాకు కొత్త అంతర్‌దృష్టులను సమకూర్చింది. ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమంపై నా పరిజ్ఞానాన్ని ప్రగాఢమూ విస్తృతమూ చేసింది. భారత్ ప్రజాస్వామ్య, బహుళత్వ భవిష్యత్తు గురించి మేము కలతచెందేవాళ్లం. అనేక సంవత్సరాలుగా నేను ఆయనతో ఢిల్లీ, బెంగళూరు, పంచగని, ఈస్ట్ లాన్సింగ్ (మిషిగాన్)లో వివిధ విషయాలపై విస్తృతంగా సంభాషణలు జరుపుతున్నాను. రాజ్ పుస్తకాలు, వ్యాసాలు శద్ధగా చదువుతున్నాను. అవి నాలో కొత్త ఆలోచనలను పురిగొల్పాయి. ఇన్ని సంవత్సరాల మా స్నేహంలో నేను ఆయనతో ఒకే ఒక్కసారి విభేదించాను. ఇప్పుడు దాని గురించి ప్రస్తావించనవసరంలేని చాలా చిన్న విషయమది.

మహాత్మాగాంధీ కంటే జవహర్‌లాల్ నెహ్రూను అమితంగా అభిమానించే కుటుంబంలో నేను పెరిగాను. భారతీయ పర్యావరణవాదంపై యువ పరిశోధకుడుగా నెహ్రూ పట్ల ఒక నిర్దిష్ట విమర్శనాత్మక దృక్పథం నాలో ఏర్పడింది. ఆయన ప్రభుత్వం అనుసరించిన ఆర్థికాభివృద్ధి నమూనా దేశ పర్యావరణ సుస్థిరతకు హానికరంగా పరిణమించడమే నెహ్రూపై నా వైఖరిని ప్రభావితం చేసింది. పర్యావరణవాదులు అయిన ఆ నాటి నా స్నేహితులు పలువురు మన మొదటి ప్రధానమంత్రిని తీవ్రంగా విమర్శిస్తుండేవారు. రాజ్‌మోహన్ ప్రభావం లేకపోతే నేనూ వారితో ఏకీభవించి ఉండేవాడినేమో? ఆర్థిక విధానం విషయమై గాంధీతో నెహ్రూ మౌలికంగా విభేదించినప్పటికీ మహాత్ముడికి న్యాయసమ్మతమైన వారసుడు నెహ్రూనే అని రాజ్‌మోహన్ తన పుస్తకం ‘The Good Boatman’లో సహేతుకంగా వాదించారు. మహాత్ముని అనుయాయులు అందరిలోనూ నెహ్రూ మాత్రమే గాంధీ సమ్మిళిత దృక్పథాన్ని బాగా అర్థం చేసుకుని అమలుపరిచారని రాజ్ పేర్కొన్నారు. మహాత్ముడి వలే నెహ్రూ కూడా ముస్లింల విశ్వాసం పొందిన హిందువు, స్త్రీలకు సమానహక్కుల కోసం పోరాడిన నాయకుడు, దక్షిణ భారతావనిలో సమస్త ప్రజల గౌరవాదరాలను పొందిన ఉత్తర భారతావని నాయకుడు. నెహ్రూకు ఉన్న ఇటువంటి విశిష్టత మహాత్ముని ఇతర ఆంతరంగికుల– రాజాజీ, మౌలానా ఆజాద్, రాజేంద్ర ప్రసాద్, కృపలానీ, సర్దార్ పటేల్ –లో ఎవరికీ లేదు. అరుదైన నైతిక, రాజకీయ లక్షణాలు మూర్తీభవించిన నేత నెహ్రూ మాత్రమే. గాంధీ హత్యతో హతాశులైన నెహ్రూ, పటేల్‌లు తమ వ్యక్తిగత, తాత్త్విక దృక్పథాలలో విభేదాలను విస్మరించి భారత్ ఏకీకరణకు, భారతీయుల సమైక్యతకు ఎలా కృషిచేశారో రాజ్‌మోహన్ తన పుస్తకంలో విపులంగా వివరించారు.

రాజ్‌మోహన్, రామచంద్రగాంధీ ఇరువురూ మహాత్ముడికి మనవళ్లే కాకుండా గాంధీ విద్వజ్జులు. ముఖాముఖి సంభాషణల్లోను, సభల్లో శ్రోతగాను రాము మాటలు వినడం ఒక మేధో నిమగ్న అనుభవం. ఋషితుల్యుడైన భారతీయ దార్శనికుడులా మౌఖిక సంప్రదాయంలో ఆయన వాణి వివేకవంతమైన ఆలోచనలను పురిగొల్పుతుంది. ఆయన సోదరుడు రాజ్‌మోహన్ రచనల్లో ఎటువంటి హాస్యోక్తులూ ఉండవు. అయితే అనుభావిక వివరాలు పుష్కలంగా ఉంటాయి. నిశితమైన అభిప్రాయాలు ఉంటాయి. విడివిడిగాను, సంయుక్తంగానూ ఈ సోదరులిరువురూ గాంధీ గురించి, భారతదేశం గురించీ నాకు చాలా విలువైన విషయాలు బోధించారు.

చివరగా రాజ్‌మోహన్‌కు సంబంధించిన, బహుశా, ఆయనకూ తెలియని ఒక చిన్న విలువైన విషయంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. భారతదేశ ఆదివాసులపై సాధికారిక పరిశోధనలు జరిపిన మానవ శాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ వ్యక్తిగత పత్రాల నుంచి నేను ఆ విషయాన్ని తెలుసుకున్నాను. భారతీయ పౌరసత్వం స్వీకరించిన ఈ ఆంగ్లేయ విద్వజ్జుడు గాంధీ, నెహ్రూలకు కూడా బాగా సుపరిచితుడు. నేను తొలుతనే పేర్కొన్నట్టు రాజ్‌మోహన్ తల్లిదండ్రులు వివాహం చేసుకునేందుకు తమ పెద్దల అనుమతికి సుదీర్ఘ కాలం వేచి ఉన్నారు. దేవదాస్, లక్ష్మిల వివాహం జూన్ 1933లో పూణేలో జరిగింది. అప్పట్లో గాంధీ, కాంగ్రెస్‌లు మరో దేశవ్యాప్త సత్యాగ్రహోద్యమానికి సమాయత్తమవుతున్నారన్న విషయమై వార్తలు వెలువడుతుండేవి. ఆ సందర్భంలో పూణేలో గాంధీ అనుయాయుల బృందం నొకదానితో సమావేశమైన ఎల్విన్, వారెవరూ మరొకసారి జైలుకు వెళ్లేందుకు సంసిద్ధంగా లేరన్న విషయాన్ని గ్రహించాడు. ‘ఆ బృందంలో చాలా సంతోషంగా ఉన్నది దేవదాస్, సౌందర్యవతి అయిన ఆయన భార్య లక్ష్మి మాత్రమే. ఆనందోత్సాహాలలో ఉన్న ఆ దంపతులు జైలుకు వెళ్లకూడదనే దృఢ నిశ్చయంతో ఉన్నారు’ అని తన స్నేహితుడు ఒకరికి రాసిన లేఖలో ఎల్విన్ పేర్కొన్నాడు. అంతిమంగా ప్రతిపాదిత సత్యాగ్రహం ప్రారంభమవలేదు. జైలుకు వెళ్లాలని దేవదాస్‌ను ఆయన తండ్రి ఆదేశించలేదు. దేవదాస్, లక్ష్మి ఢిల్లీకి వెళ్లి తమ సంసార జీవితాన్ని ప్రారంభించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అనేక విధాలుగా ప్రశస్త ప్రతిభావంతులు అయిన నలుగురు బిడ్డలకు జన్మనిచ్చి, వారిని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

పదోన్నతుల్లో ‘మల్టీ’ సమస్య

తెలంగాణ ఏర్పాటు అనంతరం ఏర్పడ్డ కొత్త జిల్లాల వల్ల స్థానికులకే ఉద్యోగాలు దక్కుతాయన్న ఆశలు నిరుద్యోగుల్లో రేకెత్తాయి. పదోన్నతులు స్థానిక జిల్లా వారికే దక్కుతాయని ఉద్యోగులూ ఆశపడ్డారు. కానీ 317, 3 జీవోలు ఉపాధ్యాయుల ఆశలను అడియాసలు చేశాయి. 317 జీవో కారణంగా ఉమ్మడి జిల్లాల నుంచి కొత్త జిల్లాలకు ఉపాధ్యాయుల కేటాయింపు ఒక ప్రహసనంగా మారింది. స్థానికతకు ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా సీనియారిటీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం వల్ల సొంత జిల్లాకు ఎందరో దూరమయ్యారు. ఈ పరిస్థితిని దూరం చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కొంత కృషి చేసింది. కానీ ‘చేతులు కాలాక ఆకులు పట్టుకున్న’ చందంగా ఆ కృషి ఫలితం అంతంత మాత్రంగానే ఉంది. జీవో నెం.3 కూడా ఉపాధ్యాయులకు పదోన్నతుల పట్ల నిర్లిప్తతను కలిగించింది. జిల్లా స్థాయిలోని ప్రధానోపాధ్యాయ పోస్టును ఒకేసారి మల్టీజోన్ స్థాయికి మార్చడంతో ఖమ్మం జిల్లా నుంచి మెదక్ జిల్లాకు, మెదక్ నుంచి ఆదిలాబాద్‌కు పదోన్నతిలోనో, బదిలీలోనో వెళ్లక తప్పని పరిస్థితి. హెచ్‌ఎం పోస్టుల భర్తీలో మల్టీ జోన్ల వ్యవస్థ ఉపాధ్యాయుల పదోన్నతి ఆశలకు నీళ్లొదిలేలా చేస్తోంది.

కొత్తగా ఏర్పాటైన జిల్లాల ప్రాతిపదికన 95 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకే అందాలని గత ప్రభుత్వం సంకల్పించింది. తొలిదశలో 31 జిల్లాలతో కొత్త జోనల్ వ్యవస్థను రూపొందించారు. ఈ ప్రతిపాదనకు 2018 ఆగస్టు 29న నాటి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత నారాయణపేట, ములుగు జిల్లాలు ఏర్పాటయ్యాయి. జోగుళాంబ జోన్‌లో ఉన్న వికారాబాద్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపడంతో పాటు, కొత్తగా ఏర్పడిన ఆ రెండు జిల్లాలను పరిగణనలోకి తీసుకుంటూ నాటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతికి సవరణలు పంపింది. ‘371–డి’లోని 1, 2 క్లాజుల కింద తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఆర్డర్–2018 ప్రకారం వీటికి రాష్ట్రపతి ఆమోదముద్ర లభించింది.

తర్వాత కేంద్ర హోం మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం మల్టీ జోన్–1 కింద కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జోన్లు వస్తాయి. మల్టీజోన్–2 కింద యాదాద్రి, చార్మినార్, జోగుళాంబ జోన్లు వస్తాయి. ఈ వ్యవస్థకు అనుగుణంగా విద్యాశాఖ కూడా కొన్ని మార్పులు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో 2009 జనవరి 23న వెలువడ్డ నెం. 10 జీవో ప్రకారం గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టుకు భర్తీ యూనిట్‌ను జిల్లాగా పేర్కొన్నారు. ఆ తర్వాత సరిగ్గా 14 ఏళ్ల తర్వాత 2023 జనవరి 23న ఈ జీవోకు సవరణ చేస్తూ తెచ్చిన జీవో నెం. 3 ఉపాధ్యాయ వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఈ సవరణ గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులను మల్టీజోనల్ పరిధిలోకి తెచ్చింది. నియామకాలు, సీనియారిటీ, బదిలీలు మొదలైన వాటన్నింటికీ ఈ జీవో వర్తిస్తుంది. ఈ జీవో ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని రెండు మల్టీ జోన్లుగా విభజించారు. పై విధంగానే మల్టీ జోన్–1 కిందికి కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జోన్లను; మల్టీజోన్–2 కిందికి యాదాద్రి, చార్మినార్, జోగుళాంబ జోన్లను తెచ్చారు. ఈ విధంగా విభజించడం వల్ల



ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు ప్రతికూల ప్రభావాన్ని కలిగించే మల్టీ జోనల్ వ్యవస్థ వల్ల ఏర్పడుతున్న సమస్యల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. 317, 3 జీవోల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంలకు, పదోన్నతుల ఆశావహులకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

హెచ్‌ఎం పోస్టు మల్టీజోన్ స్థాయికి రావడంతో మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు కూడా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సొంత జిల్లాలో ఖాళీలు లేకపోవడంతో బదిలీ అయిన జిల్లాలోనే బతుకీడుస్తున్న ఉపాధ్యాయులెందరో!

వివిధ జిల్లాల సెలక్షన్ కమిటీల ద్వారా ఉద్యోగాలు పొంది, తర్వాత పదోన్నతుల్లో జోన్, మల్టీ జోన్ స్థాయిలో కామన్ సీనియారిటీ ఉండడం వల్ల కొన్ని జిల్లాల వారు తీవ్రంగా నష్టపోతారు. భర్తీ ప్రక్రియ వివిధ జిల్లాల్లో ఏకకాలంలో జరగకపోవడం, ఒకే డీఎస్సీ వారు నెలలు, సంవత్సరాల తేడాతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు పొందడం వల్ల కొన్ని జిల్లాల ఉద్యోగులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. రెండు దశాబ్దాలు ఒకే క్యాడర్‌లో పని చేసినా పదోన్నతి దక్కని పరిస్థితులు ఇప్పుడు విద్యా వ్యవస్థలో ఉన్నాయి. ఇప్పటికే పదోన్నతుల కారణంగా వివిధ జిల్లాల్లోని పోస్టులను స్థానికేతరులైనవారు పొందారు. వారి జిల్లాలో అవకాశం లేకపోవడంతో ఇతర జిల్లాలకు వెళ్లడం వల్ల అక్కడున్న వారి పదోన్నతి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఉదాహరణకు ఖమ్మం, కొత్తగూడెం, కరీంనగర్, హనుమకొండ, వరంగల్ తదితర జిల్లాల్లో పదోన్నతి పొందినవారు– ఖాళీలు తక్కువ ఉండడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్ వంటి జిల్లాల్లోని ఖాళీలు అధిక శాతం ఇతర జిల్లాల ప్రధానోపాధ్యాయులతో నిండిపోయాయి. తత్ఫలితంగా తాము తమ జిల్లాకు వెళ్లడానికి అనువుగా ముందుగా బదిలీలు నిర్వహించాలన్న డిమాండ్ ఆయా ఉపాధ్యాయుల నుంచి వస్తోంది.

ఇలా హెచ్‌ఎం పోస్టులు ఇతర జిల్లాల వారితో నిండిపోవడం వల్ల భవిష్యత్తులో ఆయా జిల్లాల్లో కింది క్యాడర్లలో పనిచేస్తున్న వారి పదోన్నతి ఆశలు అడుగంటుతాయి. నిరుద్యోగులకు తర్వాతి డీఎస్సీల్లో పోస్టులు భారీగా తగ్గిపోవడమో, అసలే లేకుండా పోవడమో జరుగుతుంది. ఉపాధ్యాయులకు, నిరుద్యోగులకు ప్రతికూల ప్రభావాన్ని కలిగించే మల్టీ జోనల్ వ్యవస్థ వల్ల ఏర్పడుతున్న సమస్యల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. హెచ్‌ఎం పోస్టులకు భర్తీ యూనిట్‌ను ఉమ్మడి జిల్లా స్థాయికి మార్చాలి. పదోన్నతి, బదిలీ కారణంగా గతంలో ఇతర జిల్లాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులకు మొదట సొంత ఉమ్మడి జిల్లాకు బదిలీ సౌకర్యం కల్పించాలి. తర్వాత ఉమ్మడి జిల్లా స్థాయిలోనే పదోన్నతి కౌన్సిలింగ్ నిర్వహించాలి. 317, 3 జీవోల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంలకు, పదోన్నతుల ఆశావహులకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

■ డా. రాయారావు సూర్యప్రకాశ్‌రావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శనివారం 9 ఆగస్టు 2025



దొడ్డు బియ్యం బుక్కిందెవ్వరు..?

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

గోదాముల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం మాయం

- గత ఏప్రిల్ నెలలో 25వేల మెట్రిక్ టన్నుల నిల్వల గుర్తింపు
- ప్రస్తుతం 9వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్లుగా నివేదికలు
- రూ.42కోట్ల విలువ చేసే మిగతా 14వేల టన్నుల బియ్యం ఏమైనట్టో?
- పందికొక్కులు తిన్నాయా..? అక్రమార్కులు మాయం చేశారా..?
- దొడ్డు బియ్యం నిల్వలపై ఐదు నెలలుగా ఎటూ తేల్చని ప్రభుత్వం
- మిగిలిన బియ్యాన్నైనా వేలం వేస్తే సర్కారుకు అదాయం

గోదాముల్లో నిల్వచేసిన దొడ్డు బియ్యం అక్రమాలకు ఆహారంగా మారుతున్నాయి. నిల్వ చేసిన బియ్యంపై అధికారుల లెక్కలు అనేక అనుమానాలకు దారితీస్తున్నాయి. గత ఏప్రిల్ నెల నుంచి ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. అయితే అప్పటికే ఏప్రిల్ నెల కోటా కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు విడుదలైన దొడ్డు బియ్యం గోదాముల్లో, స్టాక్ పాయింట్లల్లో, డీలర్ల వద్ద నిల్వ ఉన్నాయి. ప్రాథమిక అంచనాల మేరకు 25వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నట్లుగా అధికారులు ప్రభుత్వానికి మౌఖికంగా సమాచారం ఇచ్చారు. అయితే ప్రభుత్వం తాజాగా దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలనే ఆలోచనతో మరోసారి నిల్వలపై పరిశీలన చేయిస్తే.. 9వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలే లెక్కలోకి వస్తున్నాయి. దీంతో మిగతా సుమారు 14వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఏమయ్యాయనే చర్చ జరుగుతోంది. పందికొక్కులు తిన్నాయా? లేక అక్రమార్కులు బుక్కారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

ప్రతీ నెల 21,184 మెట్రిక్ టన్నుల బియ్యం

పేదలకు రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేసే దొడ్డు బియ్యానికి ప్రభుత్వం బ్రేక్ వేసింది. గత ఏప్రిల్ నెల నుంచి పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో రేషన్ షాపుల్లో సన్నబియ్యానికి భారీగా డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 4,315 రేషన్ షాపులు ఉండగా, ప్రతీ నెల 11,32,178 రేషన్‌కార్డులపై 21,184 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. వానాకాలం కావటంతో ప్రకృతి విపత్తులు ఏర్పడే అవకాశం ఉండటంతో పంపిణీకి ఇబ్బందులు ఎదురు కావద్దని ప్రభుత్వం జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల బియ్యాన్ని ఒకేసారి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. సన్న బియ్యం కావటంతో

జిల్లా	రేషన్ షాపులు	కార్డులు	నెల బియ్యం కోటా	దొడ్డుబియ్యం నిల్వ
వరంగల్	509	2,66,674	4,977ఎం.టీ	1,020ఎం.టీ
హనుమకొండ	414	2,31,518	4,419ఎం.టీ	1,696ఎం.టీ
జనగామ	335	1,63,282	3,221ఎం.టీ	1,914ఎం.టీ
మానుకోట	558	2,40,543	4,602ఎం.టీ	1,234ఎం.టీ
భూపాలపల్లి	277	1,32,733	2,250ఎం.టీ	1,281ఎం.టీ
ములుగు	222	97,427	1,715ఎం.టీ	1,809ఎం.టీ
మొత్తం	4,315	11,32,178	21,184ఎం.టీ	8,954ఎం.టీ

(మిగతా 7వ పేజీలో)

పేదల కళ్లల్లో ఆనందమే లక్ష్యం

- కమీషన్లు రావనే గత ప్రభుత్వం ఇళ్లు పంపిణీ చేయలేదు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బాలసముద్రంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ పట్టాల పంపిణీ
- పేదలకు ఇచ్చిన ఒక్కో ఇంటి విలువ రూ.60 లక్షలు : ఎమెల్యే నాయిని

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం..



లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పేదోడి కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ధృవపత్రాలను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వమని,సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం గత ప్రభుత్వంలో ప్రజాధనాన్ని ఖర్చు చేసి పేదల కల, ఆశలను నెరవేర్చలేదన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇళ్ల పంపిణీ గురించి ప్రస్తావించారన్నారు. పేదవారి కలలను ప్రజా ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. గత పాలకులు ఇళ్లు పంపిణీ చేయలేదని విమర్శించారు.ఇళ్ల పంపిణీ చేస్తే ఓట్లు రావని, రాజకీయ లబ్ధికోసం ఇళ్ల పంపిణీ చేయలేదని విమర్శించారు. రానున్న మూడేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో పభ్రుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగు పర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు (మిగతా 8వ పేజీలో)

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు..



వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఉదయం నుంచే ఇళ్లను అలంకరించుకొని ప్రత్యేక పూజలు జరిపి, మహిళలు బంధుమిత్రులను పిలిచి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. నగరంలోని రాజరాజేశ్వరి, సంతోషిమాత ఆలయాల్లో సామూహిక వ్రతాలను జరుపుకున్నారు. శుభాలనిచ్చే శుభలక్ష్మి, సంపదలిచ్చే ధనలక్ష్మి, వరాలిచ్చే వరలక్ష్మి అంటూ అమ్మవారిని కొలిచారు. - ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్



నగరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వెల్లివిరియనున్న ఆత్మీయత

- నేడు అనుబంధాల పండుగ రక్షా బంధన్
- రాఖీలు, స్వీట్ల కొనుగోళ్లతో నగరంలో సందడి

6

కాకతీయ వైద్య కళాశాలకు రూ.9.62 కోట్లు విడుదల

- కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి అనుప్రియ
- ఎంపీ కావ్య ప్రశ్నకు సమాధానంగా వెల్లడి

హనుమకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీకి 92 సీట్లకు గాను మొదటి దశలో 89 సీట్లకు రూ.7.87కోట్లు, రెండో దశలో 3సీట్లకు గాను రూ2.15కోట్లను విడుదల చేసినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య క్యాంపు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.208.02కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దూరప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక భత్యాలు, నిపుణులకు గౌరవ వేతనాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కేంద్ర పథకం కింద తెలంగాణలోని 9మెడికల్ కళాశాలలకు 511 పీజీ సీట్లు మంజూరయ్యాయని తెలిపారు.

తెలంగాణ గ్రామీణ మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల వివరాలపై కావ్య ప్రశ్నించారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య విద్య, ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని కోరారు. ప్రధానంగా గ్రామీణ మెడికల్ కళాశాలల్లో డాక్టర్లు, సిబ్బంది, అధ్యాపకుల నియామకాలు, ల్యాబ్స్ లైబ్రరీలు, హాస్టళ్లు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ టూల్స్ గ్రామీణ సేవలకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై ఎంపీ వివరణ కోరారు. కేంద్ర మంత్రి అనుప్రియా ఇందుకు సమాధానం ఇస్తూ కొత్త మెడికల్ కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు 2023 నిబంధనల ప్రకారం తప్పనిసరి చేస్తూ అధ్యాపకుల హాజరు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. 2024-25లో ఎన్‌హెచ్‌ఎం కింద తెలంగాణకు రూ.67.16కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ మెడికల్ కళాశాలల్లో సదుపాయాలను కల్పించాలని కోరారు.

దుండగులా? బంధువులా??

- తమ్మడపల్లి(ఐ)లో తల్లీకూతుళ్ల దారుణ హత్య
- ఇంట్లో ఒంటరిగా ఉంటూ జీవనం
- ఆస్తి కోసమే హత్య చేసి ఉండొచ్చని అనుమానం
- అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘటన
- తెల్లవారిన తర్వాత వెలుగు చూసిన దారుణం




తల్లి తుమ్మ అన్నమ్మ, కూతురు గాలి రాణి (ఫైల్)

జఫర్‌గడ్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది.. తెల్లవారేసరికి తల్లి, కూతురు దారుణ హత్యకు గురికావడం జిల్లాలో కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి వేళ దండగులు ఇంట్లోకి చొరబడి అమానుషంగా కొట్టి చంపడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అయితే ఆస్తి కోసమే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన తుమ్మ ఇజాత్‌రెడ్డి-అన్నమ్మ(90) దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. ఇజాత్‌రెడ్డి గతంలోనే చనిపోయాడు. అన్నమ్మ రెండో కూతురు సుందరిని జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(ఐ)కి చెందిన గాలి జార్జిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలానికి సుందరి అనారోగ్యంతో మరణించడంతో చిన్న కూతురు రాణి(60) ఇచ్చి పెళ్లి చేశారు. రాణి, జార్జిరెడ్డిలకు కూతురు కవిత ఉండగా, ఆమెకు వివాహమై భర్తతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని కంచికచర్లలో ఉంటోంది. భర్త జార్జిరెడ్డి 30ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోవడంతో తమ్మడపల్లి(ఐ)లోనే రాణి తనకున్న ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. ఇదిలాఉండగా, నీర్మాలలో ఉంటున్న రాణి తల్లి అన్నమ్మ.. కొడుకులతో ఉండలేక ఐదేళ్ల క్రితం తమ్మడపల్లి(ఐ)లోని తన కూతురు ఇంటికి వచ్చి ఉంటోంది. అప్పటి నుంచి ఇంట్లో తల్లి, కూతురు మాత్రమే ఉంటున్నారు. అన్నమ్మ కుమారులు పెళ్లిళ్లు అయి బతకుదెరువు కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు. అలాగే, జార్జిరెడ్డి మొదటి భార్య సుందరితో కలిగిన కుమారుడు, కుమార్తెలు వివాహమై హైదరాబాద్‌లో ఉంటున్నారు.

అర్ధరాత్రి దారుణం..

అన్నమ్మ, రాణి రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి వచ్చి అన్నమ్మను మంచంపైనే కొట్టి చంపారు. అలాగే, ఆమె కూతురు రాణిని బయటకు తీసుకువచ్చి ఇంటిముందు వేపచెట్టు కిందకు తీసుకొచ్చి, తలపై రాడ్లలో బాది హత్య చేశారు. తర్వాత మృతదేహంపై పరదా కప్పి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం పనిమనిషి వచ్చి చూడగా ఇంట్లో అన్నమ్మ మంచంపై (మిగతా 8వ పేజీలో)

ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీగా ప్రశాంత్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అండర్-14, 17 సెక్రటరీగా హసన్‌పర్తి మండలకేంద్రానికి చెందిన వెలిశెట్టి ప్రశాంత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో వాసంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రశాంత్‌ను జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్‌కుమార్ కాజీపేట మండలం తరాలపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2025 విద్యాసంవత్సరం నుంచి రెండేళ్లపాటు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీగా ఆయన బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ... తనకు జిల్లా సెక్రటరీగా అవకాశం కల్పించిన డీఈవో వాసంతి, జిల్లాకు చెందిన వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 'టీజీ పేట' హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శీలం పార్థసారథి, కె.మల్లారెడ్డి, పీడీలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్టారెడ్డి, కళాశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేనలు గడువును ఆగస్టు 12 వరకు పొడిగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల విడుదల చేసిన డిగ్రీ కళాశాలల్లో స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల గడువు ఆగస్టు 6 నుంచి 12 వరకు పొడగించినట్లు వెల్లడించారు. 12వరకు ఆన్‌లైన్ సీట్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఆగస్టు 14 వరకు ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు దోస్త్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

నాలుగు జిల్లాల్లో భారీ వర్షం

హనుమకొండలో అత్యధికంగా 108 మి.మీ. వర్షపాతం నమోదు

హనుమకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ములుగు, జయశంకర్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో 108 మి.మీ., వరంగల్ జిల్లాలో 94.7 మి.మీ., మహబూబాబాద్ జిల్లాలో 70.7 మి.మీ., జనగామ జిల్లాలో 94.7 మి.మీ., ములుగు జిల్లాలో 53.1 మి.మీ., జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 15.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. హనుమకొండ, హసన్‌పర్తి, దామెర, కాజీపేట, ధర్మసాగర్, వేలేరు మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. కాజీపేట మండలంలో రికార్డు స్థాయిలో వర్షం పడింది. భారీ వర్షానికి వరంగల్ నగరం పూర్తిగా జలమయమైంది. కాజీపేట, హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరదనీరు పెద్ద ఎత్తున ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఖో-ఖో క్రీడాకారుడు సారంగపాణి కన్నుమూత



ఖిలావరంగల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఖో-ఖో అంతర్జాతీయ క్రీడాకారుడు నాగవెళ్ళి సారంగపాణి (52) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఖిలావరంగల్ మధ్యకోట ప్రాంతానికి చెందిన ఆయన 30 సంవత్సరాల క్రితం అంతర్జాతీయ స్థాయిలో ఆడి దేశానికి గుర్తింపు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన క్షౌరవృత్తి చేస్తూ జీవిస్తున్నాడు. అవివాహితుడు అయినందున సోదరుడి కుమార్తెను దత్తత తీసుకున్నారు. సారంగపాణి మరణ వార్త తెలుసుకున్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఖో-ఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సారంగపాణి పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. ఆయనతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి తోట శ్యాం ప్రసాద్, తెలంగాణ జూడో సంఘం అధ్యక్షుడు బైరబోయిన కైలాష్‌యాదవ్, 38వ డివిజన్ కార్పొరేటర్ బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్, ఖో-ఖో సంఘం జిల్లా బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు సంతాపం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ఢిల్లీ ధర్నాలో రాహుల్‌గాంధీని గద్దెనెక్కిస్తామనడం సిగ్గుచేటు

42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీలంతా ఏకం కావాలి

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో, దేశంలో ఎక్కువ కాలం పరిపాలించి రిజర్వేషన్లు అమలు చేయని కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతుందని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీల అంశంపై ఢిల్లీలో భూకంపం సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి.. తన అసమర్థతను చాటుకున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో జరిగిన బీసీల ధర్నాలో రాహుల్‌గాంధీని గద్దెనెక్కిస్తామనడం సిగ్గుచేటని అన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్లు సాధించుకునేందుకు బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ బీసీ రిజర్వేషన్ ధర్నాలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే పాల్గొనకపోవడంపై సీఎం సమాధానం చెప్పాలని అన్నారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకలేదని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 20 నెలల పాలన అధ్వానంగా ఉందని, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని మధుసూదనాచారి విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందన్నారు. ఆర్డినెన్స్, జీవోల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో వేల కోట్ల కాంట్రాక్టులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెగా కృష్ణారెడ్డి, అగ్రవర్ణాలకు ఇస్తున్నారని.. కానీ బీసీ కాంట్రాక్టర్లకు ఇవ్వలేదని ఆరోపించారు. అతి త్వరలో వరంగల్ వేదికగా అన్నివర్గాలతో బీసీ హక్కుల కోసం పోరాటాలకు శ్రీకారం చుడుతామన్నారు. ఈ నెల 14న కరీంనగర్ వేదికగా బీసీల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ మార్కెట్‌చైర్మన్ చింతం సదానందం, పశ్చిమ నియోజక కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, మేడిపల్లి శోభన్‌బాబు, పులి రజినీకాంత్, నయీముద్దీన్, జానకీ రాములు, విజయ్‌రెడ్డి, ఖలీల్, రాజు యాదవ్, వినిల్‌రావు, రాజ్‌కుమార్, శ్రీధర్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరియనున్న ఆత్మీయత

నేడు రక్షా బంధన్ పండుగ

రాఖీలు, స్వీట్ల కొనుగోళ్లతో నగరంలో సందడి



నగరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదరీ సోదరుల అనురాగానికి ప్రతీక రక్షా బంధన్. ఈ వేడుకలను శ్రావణ మాసం పౌర్ణమి రోజున ఆచరిస్తారు. ఈ పౌర్ణమిని జంజిరాల పున్నమి అని కూడా పిలుస్తారు. రాఖీ పౌర్ణమి వచ్చిందంటే దూర ప్రాంతాల్లో ఉన్న సోదరసోదరీమణులు కలుసుకొని రక్త సంబంధానికి గుర్తుగా రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకుంటారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాఖీల విక్రయాలు ఊపందుకున్నాయి. పలు రకాల ఆకర్షణీయమైన రాఖీలు మార్కెట్‌లోకి వచ్చాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. వీటితోపాటు స్వీటు షాపులు రద్దీగా కనిపించాయి. ఈ రోజున తమ గాయత్రి (జంజిరాన్ని) తొలగించి కొత్త జంజిరాన్ని ధరిస్తారు. ఈ సందర్భంగా పద్మశాలీ పరపతి సంఘంలో సామూహికంగా గాయత్రి ధారణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంటింటా గాయత్రిధారణను నిర్వహించుకుంటారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం దేవాలయాల్లో ప్రత్యేక హోమాలు, పూజలు, అన్నదానాలు ఏర్పాటు చేశారు.

పొంగుతున్న కంఠాత్మకూర్ వాగు

పరకాల - హనుమకొండ రాకపోకలు బంద్

నడికూడ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరకాల నుంచి కంఠాత్మకూర్ మీదుగా హనుమకొండకి వెళ్లే వాహనాల రాకపోకలు కంఠాత్మకూర్ వద్ద శుక్రవారం సాయంత్రం నుంచి నిలిచిపోయాయి. కొన్ని నెలలుగా అక్కడ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా, ప్రయాణికుల సౌకర్యార్థం పక్కనే తాత్కాలికంగా సీసీ రోడ్డు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అటుగా వెళ్లే వాహనాలు తాత్కాలిక రోడ్డుపై నుంచే రాకపోకలను కొనసాగిస్తున్నాయి. వర్షాలకు వరద నీరు పెరగడంతో కంఠాత్మకూర్‌లో వేసిన తాత్కాలిక రోడ్డు మునిగిపోయింది. రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రయాణికులు పరకాల నుంచి శనిగరం- గూనిపర్తి మీదుగా హనుమకొండకు రాకపోకలను కొనసాగించాలని స్థానికులు చెబుతున్నారు.

సీనియర్ న్యాయవాది ప్రభంజన్‌రావు ఆకస్మిక మృతి



వరంగల్ లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న కొమ్మినేని ప్రభంజన్ రావు(65) ఆకస్మికంగా మరణించారు. గురువారం రాత్రి ఛాతి నొప్పి రావడంతో ఆరోగ్యం విషమించి గిర్మాజీపేటలోని తన స్వగృహంలో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభంజన్‌రావు న్యాయవాదిగా 1999లో వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన జీవితకాల కోరిక మేరకు ఆయన పార్థీవదేహాన్ని కాకతీయ వైద్య కళాశాలకు దానం చేశారు. న్యాయవాద వృత్తిలో నిబద్ధతత నైతిక విలువలతో జీవితాన్ని కొనసాగించారని న్యాయవాదులు గుర్తు చేసుకున్నారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్ధన్, సంయుక్త కార్యదర్శి మునిపట్ల శ్రీధర్ గౌడ్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి

పాఠశాల ఆర్‌జేడీకి హడుప్సా విజ్ఞప్తి



ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ రంగయ్య నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న హడుప్సా ప్రతినిధులు

హనుమకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న స్కూళ్లు, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అనుమతి లేకుండా మార్చుతున్న స్కూళ్లు, ఒక పేరుతో అనుమతి పొంది మరొక పేరుపై నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌జేడీ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ రంగయ్య నాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. హనుమకొండ జిల్లాలో కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని అందులో పేర్కొన్నారు.

పలు కాలనీల్లో ఎలాంటి వసరులు, నైపుణ్యం గల టీచర్లు లేకుండా.. విద్యాశాఖ అనుమతి లేకుండా పూర్వ ప్రాథమిక విద్యాసంస్థలు వివిధ పేర్లతో నిర్వహిస్తున్నారని, ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వం నిర్వహిస్తున్న గణాంకాలలో నమోదు కావడం లేదని, ఫలితంగా ఈ విద్యార్థులకు పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్) లభించడం లేదని తెలిపారు. దీని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై పడుతోందని అన్నారు. తెలంగాణ ప్రాంతేతరులు కొందరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్పొరేట్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారని, స్థానికంగా మూతపడిన స్కూల్స్ అనుమతి పత్రాలు కొని ఆ పాఠశాలల పేరుతో కాకుండా తమ పేర్లతో స్కూల్స్ నిర్వహిస్తున్నారన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సీబీఎస్ఈ అనుమతితో ఒక ప్రాంతంలో నిర్వహిస్తూ అదేపేరుతో విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటు వంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హడుప్సా అధ్యక్షుడు తక్కళ్లపల్లి బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శి మాడుగుల సంతోష్ రెడ్డి, కోశాధికారి దామెరడుగు శంకర్, చీఫ్ అడ్వయిజర్ వర్ధమాన్ జనార్ధన్ ఉపాధ్యక్షుడు టి.రాజేశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వి.మధుకర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఆర్.నవీన్‌రెడ్డి, అకడమిక్ కన్వీనర్ వీసీ రామారావు, కార్యవర్గ సభ్యుడు కె.వాసుదేవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత పరిశోధన కోసం ఎంవోయూ

వరంగల్ నిట్‌కు, మిస్టోటెక్స్ మధ్య ఈ ఒప్పందం



ఎంవోయు పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకుంటున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి, మిస్టోటెక్స్ ప్రతినిధి శ్రీచేతన్ కుమార్

హనుమకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల భద్రత, రవాణా, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉద్దేశించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ) ఆధారిత పరిశోధనల కోసం వరంగల్ నిట్, నోయిడాలోని మిస్టోటెక్స్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ మధ్య శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. రెండు సంస్థల ప్రతినిధులు ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. నిట్ పక్షాన డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనిని ఒక మార్గదర్శక ప్రణాళికగా అభివర్ణించారు. నిట్ తన సాంకేతిక నైపుణ్యంతో పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ ఒప్పందం ద్వారా సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆలోచనలు పంచుకోవడం, సంయుక్తంగా పరిశోధనలు చేయడం వంటి అంశాలు ప్రధానంగా చేపడతాయన్నారు. ఈ ఎంవోయూ ద్వారా జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సహకారంతో రహదారి నిర్వహణలో డాష్‌కామ్ ఫుటేజీని సేకరించి ఏఐ సాంకేతికతతో రహదారి పరిస్థితులను విశ్లేషించనున్నారు.

డేటా ప్రాసెసింగ్ కోసం ఏఐ, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన మిస్టోటెక్స్ టెక్నాలజీ డిజిటల్ విశ్లేషణలో తన అనుభవాలను అందించనున్నది. వరంగల్ నిట్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం ట్రాఫిక్ విశ్లేషణ, పేవ్‌మెంట్ ఇంజనీరింగ్, డేటా అన్వయ శాస్త్ర రంగాల్లో తమ నైపుణ్యంతో భాగస్వామ్యం అవుతుంది. ఈ కార్యక్రమంలో వరంగల్ నిట్ పక్షాన రిజిస్ట్రార్ సునిల్ కుమార్ మెహతా, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ శంకర్, ప్రొఫెసర్ అర్పణ్ మెహర్, ఇతర సివిల్ ఇంజనీరింగ్ సభ్యులు, మిస్టోటెక్స్ పక్షాన శ్రీచేతన్ కుమార్, మాజీ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ స్వర్ణ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో ఆదివాసీ దినోత్సవ సదస్సు

కేయూ క్యాంపస్ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న శనివారం ఆదివాసీ దినోత్సవ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) బాధ్యులు, స్కాలర్ వాసం ఆనంద్‌కుమార్, బండారు రాహుల్‌లు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు కేయూ మొదటి గేటు నుంచి జంతుశాస్త్ర విభాగం వరకు ఆదివాసీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కేయూ జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో సదస్సు ఉంటుందని తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అతిథులుగా ములుగు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అలం భిక్షపతిరావు, వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలు బోదెబోయిన సాంబశివరావు, అల్లెం అప్పయ్య, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రిటైర్డు ప్రొఫెసర్ ఈసం సారయ్య దొరలు హాజరై మాట్లాడుతారని వెల్లడించారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రధానంగా తెలంగాణలో ఆదివాసీలు జీవన స్థితిగతులు మారలేదని తెలిపారు. 1/70 చట్టాన్ని కాలరాసి తెలంగాణలో ధరణి పేరుతో ఆదివాసీల హక్కులను కొల్లగొట్టరని, పేసా చట్టాన్ని ఉల్లంఘించారని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ విద్యకు ఆదివాసీలు నోచుకోలేదన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగానే మిగిలాయని ఆరోపించారు. ఆదివాసీల హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కొత్తగూడ ఏజెన్సీలో పెద్దపులి

● ఆవును చంపినట్టు ఆనవాళ్ల గుర్తింపు ● ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఎఫ్ఆర్వో



అడవిలో ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి, అటవీశాఖ అధికారులు

కొత్తగూడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలం ఏజెన్సీలోని రాంపురం అడవుల్లో పెద్దపులి సంచరిస్తోందని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో వజహత్ శుక్రవారం హెచ్చరించారు. కొత్తగూడ మండలంలోని రాంపురం అడవిలో ఆవు కళేబరాన్ని గుర్తించిన గ్రామస్థులు భయాందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు.. ఆవు కళేబరం వద్దకు పశువైద్యాధికారి శ్రీకాంత్‌ను తీసుకువెళ్లి పంచనామా నిర్వహించారు.

ఆపై ఆవు మృతి గల కారణాలను తెలుసుకునేందుకు చుట్టుపక్కల పరిశీలించారు. పెద్దపులి ఆవుపై దాడిచేసి చంపినట్లు ఆనవాళ్లు ఉన్నాయని అటవీశాఖ అధికారులకు పశువైద్యాధికారి తెలిపారు. ఆ ప్రదేశంలో పులి అడుగులు అటవీశాఖ అధికారులు గుర్తించారు. రాంపురం అడవిలో పెదపులి సంచరిస్తోందని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళల్లో బయటకు రావొద్దని, అడవుల్లో తిరగవద్దని ఆయన హెచ్చరించారు.

మున్నూరు కాపు రాష్ట్ర న్యాయ విభాగం ఉపాధ్యక్షుడిగా సురేందర్



వరంగల్ లీగల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర న్యాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది నల్లెల్ల సురేందర్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ బిల్లు ఇస్తామంటూ ఫోన్

ఫోన్ పే ద్వారా డబ్బుల పంపాలని డిమాండ్

మాజీ సర్పంచ్ అప్రమత్తతో తోకముడుచుకున్న సైబర్ నేరస్తుడు

వరంగల్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): 'సెక్రటేరియట్ నుంచి మాట్లాడుతున్నాను.. గ్రామపంచాయితీ పెండింగ్ బిల్లును పర్సనల్ అకౌంట్‌కు జమ చేస్తాను..' అని ఓ గుర్తు తెలియని వ్యక్తి మాజీ సర్పంచ్‌ను నమ్మబలికి డబ్బులు లాగేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన శుక్రవారం హనుమకొండ జిల్లాలోని దామెర మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ బింగి రాజేందర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి 'సెక్రటేరియట్ నుంచి వెంకట్‌రెడ్డి అనే వ్యక్తిని మాట్లాడుతున్నాను.. సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను అకౌంట్‌లో జమ చేస్తోంది. జీపీ అకౌంట్‌లోకి అయితే ఇంకో 7 నెలల సమయం పడుతుంది. పర్సనల్ అకౌంట్‌లోకి అయితే సెకండ్స్‌లో ట్రాన్స్‌ఫర్ చేస్తాను' అని చెప్పాడు.

పర్సనల్ అకౌంట్‌లోకి జమ చేయాలని రాజేందర్ బదులి వ్వడంతో 'పర్సనల్ అకౌంట్ నంబర్ మా దగ్గర లేదు.. ఫోన్‌పే ద్వారా రూ.4,000 పంపిస్తే బ్యాంక్ అకౌంట్ మాకు లింక్ అవుతుంది. తిరిగి రూ.4,000తో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లు అమౌంట్ పంపిస్తా..' అని సైబర్ నేరగాడు ఓ ఫోన్ నెంబర్ ఇచ్చాడు. అనుమానించిన రాజేందర్.. డబ్బులు లేవని చెప్పడంతో చివరికి రూ.2000 ఇవ్వమని చెప్పాడు. ఈ క్రమంలో రేపు సెక్రటేరియట్ వస్తా అని రాజేందర్ చెప్పడంతో.. వస్తే రా.. సెకండ్ ఫ్లోర్ 202 నెంబర్‌లోని బీసెక్షన్‌లో ఉంటానని చెప్పి వెంటనే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ కట్ చేసి స్విచ్ఛాఫ్ చేశాడు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2281	1521
పల్లికాయ (సూక)	5500	3450
పల్లికాయ (పచ్చిది)	4050	1575
కందులు	5600	3022
పెసళ్లు	7022	3022
పత్తి	7620	5300
పసుపు (కాడి)	11111	9534
పసుపు (గోల)	10159	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	13800	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14200	11500
యూఎస్341ఏసీ	14000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

కన్నెపల్లి పంప్‌హౌస్ తలుపులు తెరిచేదెన్నడు?



కన్నెపల్లి పంప్‌హౌస్

మహదేవపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లిజిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ తలుపులను ఎప్పుడు తెరుస్తారని ఎదురు చూస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోవడంతో మోటార్లు, పంపులు దెబ్బతిన్నాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంప్‌హౌస్‌లో పేరుకుపోయిన బురద, వరద నీటిని తొలగించి పంపులు, మోటార్లను మరమ్మతు చేయించింది. ఈ నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు ప్రజలను, ప్రతిపక్ష నేతలను, మీడియాను అనుమతించకుండా నిషేధం విధించింది. కన్నెపల్లి పంప్‌హౌస్ పరిస్థితిని సైతం బయటకు తెలియకుండా రహస్యంగా దాచిపెట్టింది. అంతలోనే ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కన్నెపల్లి సందర్శన నిషేధాజ్ఞలు తొలగిపోతాయని భావించగా ఇప్పటికీ పంప్‌హౌస్ తలుపులు తెరుచుకోవడం లేదు. ఎప్పుడు తెరుస్తారోనని పలువురు ప్రశ్నిస్తున్నారు.

21న మేడారంలో పొట్ట పండుగ

- తేదీ ఖరారు చేసిన పూజారులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో వీరస్వామి

తాడ్వాయి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు పూజారులు మగ కార్తెలో జరుపుకునే పొట్ట పండుగకు తేదీని శుక్రవారం ఖరారు చేశారు. దేవస్థానంలోని సమావేశ మందిరంలో కార్యనిర్వహణ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎండోమెంట్ అధికారులు, పూజారుల సంఘం నాయకులు, పూజారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడుతూ మొదటిగా జరిగే ఈ పండుగ పొట్టపండుగ అని అన్నారు. పూజారులు పండించిన పంటల పొట్టలను అమ్మవార్లకు సమర్పించి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకుంటామని అన్నారు. ఈవో వీరస్వామి మాట్లాడుతూ మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గద్దెల విస్తరణ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల స్థలం మార్పుపై పూజారులతో చర్చించారు. దేవస్థానం అభివృద్ధికి పూజారుల సంఘం ఆధ్వర్యంలో ఇరు దేవతల పూజారులు సుముఖత చూపారు. త్వరలో ఉన్నతాధికారులతో చర్చించి పనులు ప్రారంభించడం జరుగుతుందని ఈవో తెలిపారు. ఈ సమావేశంలో పూజారుల సంఘం ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, కాక వెంకటేశ్వర్లు, చంద బాబురావు, దబ్బకట్ల గోవర్ధన్, పెనుక బుచ్చిరాములు, కాక కిరణ్, సిద్దబోయిన మహేష్, దేవస్థానం అధికారులు క్రాంతికుమార్, వీరయ్య, జగదీష్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల అరణ్యరోదన

- హక్కులు, చట్టాల కోసం నిరంతరం పోరాటం
- జీవన విధానం, పండుగలు అంతా ప్రత్యేకమే
- ఐటీడీఏల మనుగడకు ముప్పు..?
- నేడు ప్రపంచ అడవిబిడ్డల దినోత్సవం



గూడెంలో చేతివృత్తి పనిచేస్తున్న ఆదివాసీలు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అడవితో అల్లుకున్న బంధం.. వైవిధ్యభరిత జీవన శైలి... కట్టు, బొట్టు, భాష, యాస ప్రత్యేకం.. చెట్టుపుట్టలే దేవతామూర్తులు.. ప్రకృతితో మమేకమైన శ్రమైక జీవనం. ప్రకృతి ఆరాధకులు ఆదివాసీలు.. ప్రపంచ పోకడల్లో పెను మార్పులు ఉద్భవించిన వారి సంస్కృతి సంప్రదాయాలు చెక్కు చెదరనివి.. సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తి.. కొమురంభీం పోరాట తెగువ వారి సొంతం. ఆధునిక సమాజం పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొట్టుకుపోతున్నా వీరు మాత్రం వందల ఏళ్ల నాటి పండుగలు, ఆచారవ్యవహారాలను నేటికి కొనసాగిస్తున్నారు. తమఅస్థిత్వాన్ని, మనుగడను చెక్కు చెదరనివ్వడం లేదు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన చట్టాలు, హక్కులు వారి సొంతం కాగా, వాటి సాధనకోసం ప్రభుత్వాలు, పాలకులతో అలుపెరగని పోరును ఆదివాసీలు నేటికి కొనసాగిస్తూనే ఉన్నారు. జల్.. జంగల్.. జమీన్ నినాదంతో న్యాయమైన హక్కుల సాధన కోసం నడుం బిగిస్తున్నారు. నేడు (ఆగస్టు 9) ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

హక్కుల కోసం నిరంతరం పోరాటమే..

భారత ప్రభుత్వం ఆదివాసీలకు ప్రత్యేకమైన హక్కులు, చట్టాలను రాజ్యాంగంలో పొందుపర్చింది. ఆదివాసీలకు పటిష్ఠమైన చట్టాలున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు 1/70 చట్టం రక్షణ కవచం. కానీ, ఆ చట్టం అమలు ఆశాజనకంగా లేదంటూ ఆదివాసీల ఆవేదన. 1959 సంవత్సరంలో భారత ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజనుల భూములు, ఆస్తులను గిరిజనేతరులు కొనకూడదని చట్టాన్ని తీసుకువచ్చి దీన్ని 1963 సంవత్సరం నుంచి అమలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూములను గిరిజనేతరులు కొనడానికి వీలు లేదు. ఇటు అమ్మడానికి వీలు లేదని ఈ చట్టంలో పొందుపర్చారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా చట్టానికి పూర్తి అధికారాలున్నాయి. 5, 6వ షెడ్యూల్‌లో పెసా గ్రామసభ ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు జరగాలి. పెసా గ్రామసభ తీర్మానం లేనిదే ఎలాంటి పనులు చేయడానికి వీలు లేదు. పూర్తి స్థాయిలో ఈ చట్టం అమలు కావడం లేదని ఆదివాసీ సంఘాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

ఐటీడీఏల భవిష్యత్ ప్రశ్నార్థకమేనా?



ఇప్పపూలను ఆరబోస్తున్న యువకుడు

గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు ఐటీడీఏల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చాయని ఆదివాసీ సంఘాలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఐటీడీఏలు 32 సెక్టార్లతో రూ.100 కోట్ల బడ్జెట్‌తో కళకళలాడగా నేడు కనీసం రూ.5 కోట్లు కూడా దిక్కులేని పరిస్థితులు. అభివృద్ధికి నోచుకొని పల్లెలకు వెలుగు నింపేలా ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాట్లకు ప్రభుత్వం స్వీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలయికతో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏర్పడింది. ఐటీడీఏలకు స్వయం ప్రతిపత్తి అధికారాలు, ప్రత్యేక నిధులు, విధి విధానాలతో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో జీవో 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలులో ఉంటుంది. ప్రభుత్వాల జనరల్ చట్టాలు, జీవోలు ఈ ప్రాంతాల్లో చెల్లవు. ఐటీడీఏ పరిధి ప్రత్యేకంగా పరిపాలించాల్సిన ప్రాంతమే కానీ, చిన్న జిల్లాల ఏర్పాటుతో ఇప్పుడా పరిస్థితులు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో 13 ఏజెన్సీ మండలాలు, 177 ఏజెన్సీ గ్రామాల్లో సుమారు 1,86,607 గిరిజన జనాభా కలిగి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా 6 జిల్లాలుగా విడిపోయి ఐటీడీఏ 6 చిన్న జిల్లాల పరిధిలోకి వెళ్లింది. చిన్న జిల్లాల ఏర్పాటుతో ఐటీడీఏ పాలన పూర్తిగా కలెక్టర్ల పరిధిలోకి వెళ్లిపోయింది. ఐటీడీఏలోని ప్రాంతాలు 6 జిల్లాలుగా విడిపోవడంతో ఐటీడీఏ పరిధిలో ఏమైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఆయా కలెక్టర్ల అనుమతి అవసరమై ఐటీడీఏ పరిపాలన విధానమే పూర్తిగా మారిపోయింది.

షెడ్యూల్ 5(1) ప్రకారం ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలన్నీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం భర్తీ చేయాలి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసి ఐటీడీఏనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలి. అంతేకాకుండా ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా విద్యాశాఖలో ఉపాధ్యాయులను భర్తీచేయాలి. కానీ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా నోటిఫికేషన్ అప్పజెప్పడంతో పాటు మిగతా ఇంకొన్ని శాఖలు స్వయంగా ఉద్యోగాల నోటిఫికేషన్‌ను విడుదల చేసుకునే అవకాశం కల్పించడంతో షెడ్యూల్డ్ ప్రాంతాల జీవోలను అవి పరిగణనలోకి తీసుకోకపోవడంతో షెడ్యూల్డ్ ప్రాంతాలు జనరల్ నోటిఫికేషన్ పరిధిలోకి వెళ్తున్నాయి. దీంతో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఐటీడీఏ ద్వారా చేపట్టవల్సిన ఉద్యోగాలు జనరల్ నోటిఫికేషన్ ద్వారా చేపడుతుండడంతో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. అంతేకాకుండా ఐటీడీఏలోని పలు శాఖలు నిధుల లేమితో మనుగడను కోల్పోతున్నాయి.

జీవన విధానం, పండుగలు అంతా వైవిధ్యమే

ఆదివాసీల జీవన విధానం, పండుగలు వైవిధ్యంగా ఉంటాయి. రాష్ట్రంలో మొత్తం 9 ఆదివాసీ తెగలున్నాయి. ఆంధ్, భీల్, చెంచుతో చెంచువారు, గొండ్(నాయక్‌పోడ్, రాజ్ గొండ్, కొండరెడ్లు, కొలామ్(మన్నెవార్లు), కోయ(బినే కోయ, రాజ్ కోయ, పర్థాన్, తోటి) వంటి తెగలు కలవు. గొండ్ ఆదివాసీ తెగ నాగోబా జాతర, జంగుబాయి పండుగను ప్రధానంగా జరుపుకుంటారు. అంధ్ తెగ వారు పూలాజీ బాబా జయంతి, సిరాల్ పండుగను జరుపుకుంటారు. కొలామ్ తెగ వారు భీమా నాయక్ జాతర, నాయక్‌పోడ్ గాంధారి మైసమ్మ జాతర, లక్ష్మీదేవర పండుగను జరుపుకుంటారు. చెంచులు భౌరాపూర్ జాతర, సలేశ్వరం జాతర, లొద్ది జాతర, కోయలు సమ్మక్క-సారలమ్మ జాతరలను జరుపుకొంటారు. దీంతో పాటు ఆదివాసీలు పెద్దల పండుగ, భూమి పండుగ, ఇప్పపూల పండుగ, చిక్కుడు కాయ, గోంగూర, మొక్కజొన్న పండుగలే కాక కోయ తెగలలో ఇంటి పేరుతో గల ఇలవేల్పుల పండుగలు జరుపుకుంటారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీ యువతులు (ఫైల్)

ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు ప్రపంచ దేశాలు నడుం కట్టి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9వ తేదీన 26 మందితో స్వతంత్ర మానవ హక్కుల నిపుణులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. తదనంతరం 1994లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీ కమిటీ సమావేశమైన రోజునే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లపై అన్ని పార్టీల డ్రామా

- రాబోయే ఎన్నికల్లో రాజకీయంగా ఎదుర్కొంటాం
- అడుక్కునే దుస్థితి మాకెందుకు..?
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బాలసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల ఓట్లు మాకొద్దు.. బీసీల ఓట్లు వారికి వేయొద్దు.. అనే కట్టుబాటుతో బీసీ రిజర్వేషన్లను తాము రాజకీయంగా ఎన్నికల్లో ఎదుర్కొంటామని, పార్టీలను అడుక్కునే దుస్థితి తమకెందుకని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయనమాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు బీసీ జేఏసీ పోటీ చేయబోతుందని మల్లన్న అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను చేయాల్సిందంతా చేసేశాను.. ఇక బీజేపీ, బీఆర్ఎస్‌లపైనే రిజర్వేషన్ ఆధారపడి ఉందని చెబుతున్నారని అన్నారు. ఆ రెండు పార్టీలు బీసీలకు ద్రోహుల పార్టీలని సీఎం అంటున్నారని, దానితో తాను కూడా ఏకీభవిస్తున్నానని మల్లన్న అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేనని, సాధ్యం కాదని సీఎం చెప్పకనే చెప్పారన్నారు. శాసన మండలిలో రిజర్వేషన్ బిల్లుకుఎవరూ అడ్డు చెప్పకుండా ఆమోదించారని అన్నారు. అన్ని పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని, తాను ఆనాడే శాసన మండలిలో చెప్పానని రాజకీయ పార్టీలతో రిజర్వేషన్లు సాధ్యమేనాననిమండలి చైర్మన్‌నుప్రశ్నించానని‌పేర్కొన్నారు.

కులగణనలో ఓసీలు 15 శాతం ఉన్నారని తేల్చారని, చట్టసభలో ఆ 15 సీట్లు తీసుకొని మిగతా సీట్లు బీసీ,ఎస్సీ, మైనారిటీలకు ఇస్తే వాటిని తామే పంచుకుంటామని ఎమ్మెల్సీ అన్నారు. ఈ అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల స్టాండ్ ఏమిటో స్పష్టం చేయాలని మల్లన్న డిమాండ్ చేశారు. అన్ని పార్టీలు బీసీల ఓట్లకోసమే తప్ప వారి మీద ప్రేమతో రిజర్వేషన్లను సమర్థించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చినప్పుడు అందరూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారని, ఆ వ్యక్తులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని మల్లన్న ప్రశ్నించారు. అన్ని పార్టీలు మూకుమ్మడి కుట్రలు చేస్తూ బీసీల ఆశలను జీవసమాధి చేశాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ జేఏసీగా ప్రజాక్షేత్రంలో అన్ని పార్టీలను ఎండగడుతామన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రిజర్వేషన్ల అమలుకు ముస్లింల అంశం తీసుకొస్తున్నారని, రిజర్వేషన్లు కులం ప్రాతిపదికనే రూపొందించారే తప్ప మతం ప్రాతిపదికన కాదుకదా అన్నారు. బీసీల కోసం అగ్రవర్ణాలు ఢిల్లీలో ధర్నా చేయడం ఆలోచించాల్సిన విషయమన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో మోసం జరుగుతున్నప్పటికీ చట్ట సభల్లో రిజర్వేషన్ కావాలని కోరుతున్నామని అన్నారు. బీసీల ఆత్మగౌరవం, అధికారం కోసం ఎన్నికల్లో తమ ఓట్లను బీసీ అభ్యర్థులకే వేయాలని తీన్మార్ మల్లన్న విజ్ఞప్తి చేశారు.

ఈ మీడియా సమావేశంలో తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్, సమన్వయ కర్తలు వట్టె జానయ్య యాదవ్, బందారపు నర్సయ్య, నాయకులు రజనీ కుమార్ యాదవ్, తిరుమని నాగరాజు, సింగారం రవీందర్, పొట్ల వాసుదేవ్, బయ్య వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి చంద్రశేఖర్, పెండ్యాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రంలో దగ్ధమైన రైల్వే క్యాంపింగ్ కోచ్

- అప్రమత్తతతో నలుగురు సిబ్బందికి తప్పిన ప్రాణాపాయం
- అగ్నిప్రమాదంలో మూడుసార్లు స్వల్ప పేలుళ్లు
- కోచ్‌లో నిల్వ ఉన్న ఎనిమిది ఆయిల్ డ్రమ్ములు
- ప్రమాదంపై త్రిసభ్య కమిటీ



కేసముద్రంలో కొత్త ట్రాక్‌పై దగ్ధమవుతున్న క్యాంపింగ్ కోచ్

కేసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న ట్రాక్‌పై నిలిపి ఉంచిన రైల్వేశాఖకు చెందిన క్యాంపింగ్ కోచ్(రెస్ట్‌వ్యాన్) గురువారంఅర్ధరాత్రి దాటిన తర్వాత అగ్ని ప్రమాదానికి గురైంది. కేసముద్రం సమీపంలో 2008, జూలై 31న రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్ దగ్ధమై 32 మంది సజీవ దహనమైన ఘటనను గుర్తుచేసిన ఈ ప్రమాదంతో స్థానికంగా ఒక్కసారిగా కలకలం రేపింది. రైల్వే అధికారులు, సిబ్బంది, స్థానికులు తెలిపిన ప్రకారం... ఈ ప్రాంతంలో మూడో రైల్వేలైను నిర్మించేందుకు కొద్దిరోజులుగా కంకరను ప్యాకింగ్ చేసే ట్యాంపింగ్ యంత్రం ఇక్కడ పనులు నిర్వహిస్తోంది. ఈయంత్రంలో పనిచేసే టెక్నీషియన్లు, సిబ్బంది ఉండేందుకు అనుబంధంగా క్యాంపింగ్ కోచ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కోచ్‌లో సిబ్బంది వంట చేసుకుని, ఉండేందుకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా ఈ క్యాంపింగ్ కోచ్ మహబూబాబాద్-కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య తిరుగుతుండగా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న ట్రాక్‌పై నిలిపి ఉంచారు. రాత్రి 8.30 గంటలకు భోజనం చేసి సిబ్బంది నిద్రిస్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పుచెలరేగి దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో అందులో ఉన్న టెక్నీషియన్స్ తాతారావు, సొప్పి, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై బోగీలోంచి దిగి ప్రాణాలను కాపాడుకున్నారు.

మూడుసార్లు పేలుళ్లు..

ఆయిల్ డ్రమ్ములతో ఉత్కంఠ

ఈ ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి నీళ్ల పిచికారి చేసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.అయితే అప్పటికే కోచ్ లోపలి భాగాలన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. బోగీలోఉన్న గ్యాస్ సిలిండర్, ఇతర పరికరాలు మూడుసార్లు పేలినట్లు గ్రామస్థులు తెలిపారు. నిల్వ ఉంచిన 8 ఆయిల్ డ్రమ్ములు వ్యాకోచం చెంది ఏ క్షణాన్నైనా పేలిపోయేస్థితికి చేరుకోవడంతో ఉత్కంఠత నెలకొంది. అప్పటికే నీళ్ల చల్లడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ బోగీలో మంటలను ఆర్పివేసే 'ఫైర్ బాల్స్' ఉండడంతో ఒక వైపు మంటలు కొద్దిసేపు తగ్గాయని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. అగ్నిమాపక యంత్రం ద్వారా మంటలను పూర్తిగాఆర్పివేశారు. అయితే నిప్పురవ్వలు చెలరేగడానికి కారణ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అని పలువురు సిబ్బంది తెలిపారు. నలుగురు సిబ్బంది ప్రాణాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో సుమారు కోటికి పైగా ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ప్రమాదంపై త్రిసభ్య కమిటీ

ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ ఈ ఘటనను రైల్వేశాఖ తీవ్రంగా పరిగణిస్తూ విచారణకోసం సెక్యూరిటీ, ఇంజనీరింగ్, ఆపరేటింగ్ శాఖలతో సంయుక్తంగా త్రిసభ్య కమిటీని వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఘటన స్థలాన్ని రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ ఆంజనేయులురెడ్డి, పీసీఎంఈ ధర్మేందర్ కుమార్, సికింద్రాబాద్ ఎస్పీ కె.నవీన్‌కుమార్, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) గోపాలకృష్ణ, ఇతర అధికారులు పరిశీలించారు.



రైల్వేస్టేషన్ నూతన ట్రాక్‌పై అగ్ని ప్రమాదానికి గురైన రైల్వే క్యాంపింగ్ కోచ్

దొడ్డు బియ్యం బుక్కిందెవ్వరు..?

(5వ పేజీ తరువాయి)

అన్ని వర్గాల వారు రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లుతున్నారు.

ఏ మాయ జరిగిందో..

సన్న బియ్యం పంపిణీతో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం దారి తప్పాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతీనెల 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా బియ్యం పంపిణీ చేసేవారు. అయితే ఏప్రిల్ కోటా 21వేల మెట్రిక్ టన్ను దొడ్డు బియ్యం గోదాముల నుంచి స్టాక్ పాయింట్లకు మార్చి నెలలోనే చేరుకుంది. ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించటంతో అప్పటికే కొన్ని రేషన్ షాపులకు చేరుకున్న దొడ్డు బియ్యాన్ని అక్కడే నిల్వ చేశారు. అలాగే స్టాక్ పాయింట్లు, గోదాముల్లో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకపోయాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ నెలలో ఇవ్వాల్సిన బియ్యంతో పాటు అంతకు ముందు నెల మిగులు బియ్యం కలిపి సుమారు 25వేల మెట్రిక్ టన్నుల బియ్యం గోదాములు, స్టాక్ పాయింట్లు, రేషన్ డీలర్లవద్ద నిల్వ చేసినట్లుగా తొలుత ప్రాథమిక నివేదిక అందించారు. ఆ తరువాత ప్రభుత్వం కూడా దొడ్డు బియ్యం నిల్వలపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తాజాగా దొడ్డు బియ్యంపై కెబినేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. దొడ్డు బియ్యాన్ని వేలం వేయటమా..? లేక ఇతర రాష్ట్రాలకు విక్రయించటమా..? అనే దానిపై చర్చించారు. అయితే ముందుకు అధికారులు ఇచ్చిన కాగితాలపై లెక్కలు కాకుండా వాస్తవంగా బియ్యం ఎన్ని మెట్రిక్ టన్నులు ఉన్నాయో గుర్తించాలని ఆదేశించారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా సివిల్ సప్లయి అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా స్టాక్ పాయింట్లు, గోదాములు, డీలర్ల వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని లెక్కించారు.

వరంగల్ జిల్లాల్లో 1,020 మెట్రిక్‌టన్నులు దొడ్డు బియ్యం స్టాక్ ఉండగా, హనుమకొండ జిల్లాలో 1,696 మెట్రిక్ టన్నులు, జనగామ జిల్లాలో 1,914 మెట్రిక్‌టన్నులు, మహబూబాబాద్ జిల్లాలో 1,234 మెట్రిక్ టన్నులు, భూపాలపల్లి జిల్లాలో 1,281 మెట్రిక్ టన్నులు, ములుగు జిల్లాలో 1,809 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8,954 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. అయితే తొలుత 25వేల మెట్రిక్ టన్నులుగా కాగితాలపై లెక్కలు చూపించిన అధికారులు.. ఇప్పుడేమో కేవలం 9వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లెక్కలు చూపిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాలుగు నెలలుగా గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని పంది కొక్కులు, ఎలుకలు, పురుగులు తింటున్నాయని అధికారులుపేర్కొంటున్నారు. అయితే ఎంత తిన్నా 14వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని బుక్కాయా అనేది చర్చనీయాంశంగా మారింది.

నొక్కారా..? లెక్క తప్పారా..?

దొడ్డు బియ్యం నిల్వల లెక్కలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నాలుగైదు నెలల్లోనే సుమారు 14వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాయం ఎలా అవుతాయనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు పేదలకంటే ఎక్కువగా అక్రమార్కులకే చేరేవి. దొడ్డు బియ్యాన్ని పేదల నుంచి కిలోకు రూ.10ల చొప్పున కొనుగోలు చేసి.. బయట మార్కెట్‌లో రూ.40 వరకు విక్రయించే ముఠాలు ఉమ్మడి జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. వీరికి కొంతమంది పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖలో కీలక అధికారుల సహకారం ఉందనే ప్రచారం కూడా ఉంది.

సాధారణంగా రైస్ మిల్లుల నుంచి స్టేజ్-1 గోదాముల్లోకి.. అక్కడి నుంచి స్టేజ్ -2 (ఎంఎస్ స్టాక్ పాయింట్లు) గోదాముల్లోకి బియ్యం సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచే రేషన్ షాపులకు కోటా వారిగా బియ్యాన్ని అందిస్తారు. ఈ క్రమంలో ఎక్కడిక్కడ నిల్వలు ఉండటంతో అక్రమార్కులు, అధికారులు కుమ్మక్కై స్టాక్ పాయింట్లు, మిల్లులు, గోదాముల నుంచే దొడ్డు బియ్యం పక్కదారి పట్టించారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు 14వేల మెట్రిక్ టన్నుల బియ్యం అంటే కిలోకు రూ.30 చొప్పున సుమారు రూ.42కోట్ల విలువైన బియ్యం మాయం అయినట్లుగా లెక్కలు వేస్తున్నారు. గత ఏప్రిల్‌లో ఇచ్చిన దొడ్డు బియ్యం నిల్వలపై ఇచ్చిన ప్రాథమిక నివేదికలో అధికారులు లెక్క తప్పారా..? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. దీంతో ప్రస్తుతం దొడ్డు బియ్యం నిల్వలతో పాటు ఏప్రిల్ నివేదిక అధారంగా విజిలెన్స్ విచారణ చేపడితే, వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇకనైనా వేలం వేసేనా..?

ప్రభుత్వం దొడ్డు బియ్యం నిల్వలపై సరైన నిర్ణయం తీసుకోకపోవటంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే ప్రచారం ఉంది. గత ఏప్రిల్ నుంచి గోదాముల్లో బియ్యం నిల్వలు ఉండటంతో పందికొక్కులతో పాటు అక్రమార్కుల కన్ను కూడా వాటిపై పడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎలుకలతో పాటు పురుగులుపట్టి బియ్యం దేనికి పనికిరాకుండా పోతున్నాయి. అక్రమార్కులు, పంది కొక్కులు మింగగా మిగిలిన 8,954 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని వేలం వేస్తే ప్రభుత్వానికి అదాయం వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, తమిళనాడులో దొడ్డు బియ్యం కిలో రూ.40 వరకు డిమాండ్ ఉంది. ఆ రాష్ట్రాలకు విక్రయించిన ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.35.81 కోట్ల అదాయం దొడ్డు బియ్యంతో రానున్నాయి. ఎక్కువరోజులు నిల్వ ఉండటంతో వాటిని కాపాడటం అధికారులకు తలనొప్పిగా మారింది. దొడ్డు బియ్యంలో కలిపిన ఫోర్టిఫైడ్ రైస్ కారణంగా పురు గు పట్టి వేగంగా వ్యాపిస్తున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. వీటిని కాపాడటం కూడా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మిగిలిన దొడ్డు బియ్యాన్నైనా తరలించి పందికొక్కుల నుంచి కాపాడేలా ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రకాళి శరణం మమః

- పండుగ వేళ పోటెత్తిన భక్త జనం
- సుమారు 30వేల మంది దర్శనం



వరంగల్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం పండుగ శోభతో చారిత్రక భద్రకాళి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 4గంటలకు నిత్య పూజ నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శనానికి అనుమతి ఇచ్చారు. రాత్రి వరకు కూడా భక్తులు తరలివస్తూనే ఉన్నారు. దాదాపు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. గతంలో కంటే శుక్రవారం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా దర్శనం కొనసాగింది. దేవాలయంలో ఎటు చూసినా భక్తజనమే కనిపించింది. పండుగ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో రామల సునీత, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు.



భద్రకాళి అమ్మవారి ఆలయంలో అన్నదానం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

జూలైవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి తూపురాణి సీతారాం అన్నారు. శుక్రవారం 59వ డివిజన్ టీచర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పెన్షనర్ల సమస్యల సాధన కోసం ఈనెల 11న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఉదయం 11 గంటలకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ప్రభుత్వ పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి కాయిత వీరయ్య, సముద్రాల లక్ష్మీనారాయణ, వీరన్న, వెంకటరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాం

మడికొండలో పోచమ్మ తల్లికి తొలి బోనం



పోచమ్మకు మొదటి బోనం సమర్పించి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ

మడికొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా మడికొండలోని పాత పోలీస్‌స్టేషన్ వద్దగల పోచమ్మ తల్లికి శుక్రవారం కుమ్మరి వంశస్థులతో మొదటి బోనం సమర్పించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లా పాపలు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా కరుణించాలని వేడుకున్నారు. పూజల్లో ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, కొలిపాక వెంకటస్వామి, నర్మెట భిక్షపతి గాండ్ల, బొల్లికొండ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాలక్ష్మికి కుంకుమ పూజలు

మడికొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై మెట్టు రామలింగేశ్వరస్వామి, సీతారామ చంద్రస్వామి క్షేత్రంలో శుక్రవారం మహాలక్ష్మీ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, మహిళా భక్తులతో కలిసి వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన, చతుషష్టి పూజలు నిర్వహించారు. శిలయం ఈవో ఆర్.సునీత, రామాలయం ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. మలేరియా, డెంగీ నివారణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం లష్కర్ సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. దోమలు వృద్ధి చెందకుండా టైర్లు, కొబ్బరిబోండాలు, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, పూలకుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు. గోపాల్‌పూల్ ప్రాంతంలోని వెంకటేశ్వరకాలనీలో ఆరోగ్య సిబ్బంది డ్రై డేతోపాటు ఇంటింటి జ్వర సర్వే ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, వైద్యాధికారి డాక్టర్ హైదర్, అశోక్‌రెడ్డి, బాబు, విప్లవ్‌కుమార్, థామస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 లక్షల పాత కార్డులు ఉండగా, ఆరు లక్షల కొత్తగా రేషన్ కార్డులు అందించామన్నారు. మేనిఫెస్టోలో పెట్టని ధాన్యానికి రూ.500 బోనస్, రైతుల ఖాతాల్లో రైతు భరోసా, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రావణ శుక్రవారం రోజు మహిళలకు 592 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపుగా రూ.60లక్షల విలువచేసే ఇంటిని పేద ప్రజలకు అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇంకెవ్వరైనా అర్హులు ఉంటే న్యూశాయంపేటలో కేటాయిస్తామన్నారు. నగరంలో ప్రభుత్వ భూములు గుర్తించి అక్కడ కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేలా అవసరమైన ఇళ్లను మంజూరు ఇవ్వాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు ఇస్తూ అర్హుల జాబితా తయారు చేస్తే వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ఆర్‌పీలు శ్రద్ధ వహించాలి

» వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

» కమిషనర్‌తో కలిసి ఆర్‌పీలకు మొక్కలు అందించిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటేందుకు ఆర్‌పీ(రిసోర్స్ పర్సన్స్)లు శ్రద్ధ వహించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఆర్‌పీలకు మేయర్‌తోపాటు కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వన మహోత్సవంలో భాగంగా మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటడమే కాకుండా ఇళ్ల ఆవరణలో కూడా ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారన్నారు. ఆర్‌పీలు, స్వయం సహాయక బృందాలు పంపిణీ చేసిన ప్రతీ మొక్కను నాటేందుకు కృషి చేయాలని, తీసుకున్న మొక్కలను నాటని వారిపై చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో కుండీలలో కూడా మొక్కలను నాటవచ్చని అన్నారు. ప్రజల కోరిక మేరకు ఔషధ, పండ్ల మొక్కలను అందించాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలలో మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. కొద్ది రోజుల్లో డోర్ టూ డోర్ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. ఆర్‌పీలు వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని ఇళ్లకు కొద్దిరోజుల్లో మొక్కల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. వచ్చే సోమవారం నుంచి ప్రతీ డివిజన్‌లో మొక్కల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీఎంసీ రమేష్‌తో పాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయండి

నాస్కి పథకంపై సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నాస్కి(స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం ప్రతిపాదన రూపకల్పనపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ విధి విధానాలను మేయర్‌కు విశ్లేసించారు. 10 లక్షల జనాభా కేటగిరి విభాగంలో వరంగల్ నగరం వస్తుందని తెలిపారు. స్పాంజ్ పార్కుల ఏర్పాటు, గ్రౌండ్ వాటర్ రీచార్జ్ యూనిక్, ఐడీ హౌస్ నెంబర్లు, బావుల్లో నీటి వనరుల పునరుద్ధరణ, ప్రభుత్వ, ప్రైవేటు అసెస్‌మెంట్స్ మ్యాపింగ్ నైబర్ హుడ్ పార్కుల ఏర్పాటు, వాటర్ సప్లై, స్ట్రాం వాటర్ డ్రైన్ జీఐఎస్ మ్యాపింగ్ వంటి అంశాలను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వివరించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. కార్యక్రమ అమలుకు సంబంధించి సమగ్ర వివరాలను, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్‌ల రూపకల్పన చేయాలన్నారు. మిగతా వాటికి నేరుగా ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, డీఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.



మెప్మా ఆర్‌పీలకు మొక్కలు పంపిణీ చేసిన మేయర్, కమిషనర్

కేయూ డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీధర్‌కు అభినందనలు



కేయూ క్యాంపస్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందిన పంజాల శ్రీధర్‌ను శుక్రవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నేతృత్వంలో కలిసి పుష్పగుచ్ఛం శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, మంద భాస్కర్, స్కాలర్లు మాదాసి రమేశ్, డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ ఎదుట నిరసన



స్కూల్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి, తల్లి

హసన్‌పర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ ప్రైవేటు హైస్కూల్ ఎదుట శుక్రవారం ఓ విద్యార్థి, అతడి తల్లి నిరసన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏడాది ఫీజు కింద రూ.90వేలు చెల్లించిపాఠశాలలో చేర్పించినట్లు తల్లి పేర్కొంది. పాఠశాలలో ఆ విద్యార్థికి అసౌకర్యంగా ఉందని, హాస్టల్‌లో ఉండడానికి నిరాకరించడంతో తల్లి యాజమాన్యాన్ని కలిసి సమస్యను వివరించేందుకు శుక్రవారం వచ్చింది. గేటు ఎదుట ఉన్న వాచ్‌మన్ ఆమెను పాఠశాలలోకి అనుమతించక పోవడంతో ఫోన్‌లో యజమాన్యాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించగా నిరాకరించింది. దీంతో ఆ విద్యార్థితో పాటు తల్లి అక్కడే ఉదయం 10 గంటల నుంచి కూర్చొని ఆందోళనకు దిగింది. ఫీజు విషయం తరువాత మాట్లాడుకుంటామని, కనీసంలగేజీ ఇవ్వమని ప్రాధేయపడింది. ఆసిఫాబాద్ జిల్లా నుంచి తమ గోడును చెప్పుకునేందుకు వస్తే ప్రిన్సిపాల్ కలవకపోవడం సరికాదన్నారు. విద్యార్థితో పాటు తల్లి సాయంత్రం సుమారు 4 గంటల వరకు పాఠశాల మెయిన్ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యాజమాన్యం దిగి వచ్చింది. ఆందోళన చేస్తున్న విద్యార్థితో పాటు అతడి తల్లిని పాఠశాల యాజమాన్యం లోపలికి అనుమతించి సమస్యను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది.

తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం



శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేయగా సర్టిఫికెట్ అందుకుంటున్న డాక్టర్ అశ్వినినవదీప్

వరంగల్ మెడికల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి సన్నిధిలో తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అశ్విని నవదీప్ శుక్రవారం రక్తదానం చేశారు. కాకతీయ మెడికల్ కలాశాలకు చెందిన డాక్టర్ అశ్విని నవదీప్.. వరంగల్‌లోని ఎంజీఎంలో హౌస్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రక్తదానం ఆవశ్యకతను గుర్తించి తరుచుగా రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఇదివరకే 10 సార్లు రక్తదానం చేసి 11వ సారి తిరుమల శ్రీవారి సన్నిధిలో రక్తదానం చేయాలనే తలంపుతో తిరుమలలోని అశ్విని హాస్పిటల్ (టీటీడీ రక్త నిధి కేంద్రం)లో రక్తదానం చేశారు. టీటీడీ రక్త నిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌరి ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేసి అభినందించారు.

మంత్రిని కలిసేందుకు తరలిన బీజేపీ నాయకులు



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కలిసేందుకు తరలివెళుతున్న బీజేపీ నేతలు

హసన్‌పర్తి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ఫోన్ ట్యాంపరింగ్‌లో సిట్ విచారణకు హాజరవుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసేందుకు శుక్రవారం బీజేపీ మండల నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ను మద్దతు తెలిపేందుకు వెళ్లిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు సీనియర్ నాయకులు గుర్రాల చంద్రమౌళి, బొల్లం రంజిత్, తేకల రఘుపాల్ రెడ్డి, రాంశెట్టి అశోక్, చొక్కం మహేందర్, వీరమల్ల ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.

కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణం

• రాఖీ పర్వదినం సందర్భంగా కిటకిట

హనుమకొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. శనివారం రాఖీ పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వెళ్తున్న ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేయడంతో సాధారణ రోజుల కంటే శుక్రవారం రద్దీ పెరిగింది. హైదరాబాద్ నుంచి హనుమకొండకు అదనంగా 200 బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేసినప్పటికీ ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రయాణం కల్పించడంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుండడంతో సరిపడా సీట్లు లేక ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించే మహిళలు సిబ్బందికి సహకరించాలని, రద్దీ ఉన్న సమయంలో వేచి చూడాలని, ప్రాంగణంలోకి బస్సులు వస్తున్న క్రమంలో ఎదురుగా వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని ఆర్‌ఎం డి.విజయభాను విజ్ఞప్తి చేశారు.



హనుమకొండ బస్టాండ్‌లో నెలకొన్న ప్రయాణికుల రద్దీ

దుండగులా? బంధువులా??

(5వ పేజీ తరువాయి)

నోటి నుంచి రక్తం కారుతూ కనిపించింది. ఆందోళన చెందిన ఆమె స్థానిక వారి బంధువులకు తెలపగా, వారు వచ్చి చూడగా తల్లి ఇంట్లో మంచంపై, ఆమె కుమార్తె బయట చెట్టు వద్ద రక్తపు మడుగులో చనిపోయి కనిపించారు. ఘటనా స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ శ్రీనివాస్‌కుమార్, జఫర్‌గడ్ ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్ పోలీసులతో చేరుకుని మృతదేహాలను, ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్స్, క్లూస్ టీం చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించి వేలిముద్రలు, రక్తపు నమూనాలను సేకరించారు.

మిస్టరీగా మారిన హత్యలు..

తల్లీకూతుళ్ల హత్యకు గురవడం మిస్టరీగా మారింది. దుండగులు వారిని చంపడానికి గల కారణాలు తెలియరావడం లేదు. ఇంట్లో బంగారు గొలుసులు, హతురాలి ఒంటిపై చెవి కమ్మలు, చేతి బంగారు గాజులు అలాగే ఉండడంతో నగలు, నగదు కోసం హత్య జరగలేదని పోలీసులు భావిస్తున్నారు. అయితే భూమి, ఆస్తి కోసం ఎవరైనా ఈ ఘాతుకానికి పాల్పడ్డారా..? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. రాణి పేరిట ఉన్న భూమి విలువ రూ.కోటి న్నర వరకు ఉంటుందని చెబుతున్నారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంఆస్పత్రికి తరలించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

• పట్టించుకోని ఉన్నతాధికారులు



శివాజీనగర్ కాలనీ రోడ్డుపై ఉన్న స్తంభం

హసన్‌పర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇనుప విద్యుత్ స్తంభాల ద్వారా విద్యుత్ ప్రసారం జరిగి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా.. విద్యుత్ శాఖ అధికారులు మిన్నకుండడంపై కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన, ప్రమాదకరంగా మారిన ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. గ్రేటర్ 66వ డివిజన్ శివాజీనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై ఇటీవల నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్ల విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీరోడ్డు మధ్యలో ఇనుప స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రాణాలకు ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

• భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నేత నేదునూరి జ్యోతి

హసన్‌పర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రపంచంలో పెట్టుబడిదారి వ్యవస్థ తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, సంక్షోభ నివారణకు సోషలిస్టు సామ్యవాద వ్యవస్థ విధానాలే పరిష్కారమని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటు రంగానికి ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగి అసమానతలు ఏర్పడి వర్గ పోరాటానికి దారితీసి సామ్యవాద వ్యవస్థకు దారితీస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆడబిడ్డ పెళ్లికి తులంగా బంగారం, బాలికలకు స్కూటీలు, వితంతు, వికలాంగుల పింఛన్ రెట్టింపు, ఆటో కార్మికులకు యేటా రూ.12వేలు, యువతకు నిరుద్యోగ భృతి, వ్యవసాయ కార్మికులకు చేయూతలాంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. ఆగస్టు 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని కుద్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, టెలికాం డిపార్టుమెంట్ నాయకులు భారత్ బచావో జిల్లా కార్యదర్శి తోమాటి ప్రవీణ్‌కుమార్, నిర్మాణ బాధ్యులు నేదునూరి రాజమౌళి, నాంపల్లి లక్ష్మయ్య, దుస్స వెంకటేశ్వర్లు, మోడెం రాజేందర్ ఆటో యూనియన్ నాయకులు లింగాల రాజు, రేణిగుంట పరశురాములు, తాళ్ళపల్లి రాజు, బకాడి సంపత్, పిట్టల రాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర నేత జ్యోతి, నాయకులు

కాజీపేటలో దయనీయంగా పారిశుధ్యం

• విరివిగా చెత్తకుప్పలు.. మురికి కుంటలు..

• పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది, కార్మికులు

• ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



కాలనీలో చెత్తకుప్పలు

కాజీపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో పారిశుధ్యం దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురికికుంటలు దర్శనమిస్తున్నాయి. ఒకటికాదు, రెండు కాదు.. దాదాపు అన్ని డివిజన్‌లలో ఇదే పరిస్థితి. గ్రేటర్ వరంగల్‌లోని మునిసిపల్ పరిధిలోని కాజీపేటలో ఓ మునిసిపల్ సర్కిల్, ఓ డిప్యూటీ కమిషన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నప్పటికీ పారిశుధ్య కార్మికులపై ఆజమాయిషీ లేకపోవడం వల్లే కాలనీలన్నీ చెత్తమయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. హెల్త్ ఆఫీసర్, మునిసిపల్ కమిషనర్ హనుమకొండ, వరంగల్‌పై దృష్టి సారించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే చర్చ జరుగుతోంది.

చెరువును తలపిస్తున్న రహ్మత్‌నగర్

కాజీపేట 62 డివిజన్ పరిధిలోని రహ్మత్‌నగర్ వాసుల పరిస్థితి మహాదారుణంగా మారింది. విష్ణుపురి, సోమిడినుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీరుతో రహ్మత్‌నగర్ ఎఫ్‌సీఐ సమీపంలో ఒక ఖాళీ ప్లాటులో చేరి ఓ చెరువును తలపిస్తోంది. ఎఫ్‌సీఐ లోపల డ్రైనేజీ గుండా గతంలో ఈ నీరు బయటకు వెళ్లేవి. ఎఫ్‌సీఐ సిబ్బంది ఈ నీరు రాకుండా గోడ కట్టడంతో ఓ ప్లాట్‌లో నిలువ ఉంటున్నాయి. చుట్టుపక్కల గృహాల వారికి బోర్ల నుంచి, కులాయిల నుంచి వచ్చే నీరు కలుషితమై రావడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. స్థానికులు ప్రజాప్రతినిధులకు, కమిషనర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కాగా, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు కాలనీల్లో పనులు ఎగ్గొడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సరిగ్గా విధులునిర్వర్తించి సమస్యలను పరిష్కరించేలా మునిసిపల్ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



మురికికుంటగా మారిన రహ్మత్‌నగర్ కాలనీ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం 9 ఆగస్టు 2025

అనురాగం



బాలీవుడ్‌లో స్టార్లుగా ఎదిగిన అన్నాచెల్లెళ్లు చాలామందే ఉన్నారు. కానీ రక్తం పంచుకొని పుట్టకపోయినా... తోబుట్టువుల్లా అపురూప బంధాన్ని కొనసాగిస్తున్న తారలు అరుదుగా కనిపిస్తారు. వారే వీరు...

అపురూప బంధం



ఐశ్వర్యా రాయ్- సోనూసూద్

రీల్ లైఫ్‌లో కనిపించిన బంధాలు కొన్ని రియల్ లైఫ్‌లోనూ కొనసాగుతుంటాయి. అది మనసులు కలిపే ప్రేమ బంధమే కానక్కర్లేదు. అన్నాచెల్లెళ్ల అనురాగ బంధమూ కావచ్చు. అలాంటిదే ఐశ్వర్యా రాయ్, సోనూసూద్‌ల అనుబంధం. హృతిక్ రోషన్ హీరోగా చేసిన 'జోధా అక్బర్' చిత్రంలో వీరిద్దరూ తోబుట్టువులుగా నటించారు. ఈ అన్నాచెల్లెళ్ల బంధం నిజ జీవితంలోనూ కొనసాగుతోంది. సినిమా సెట్‌లో రాఖీ కట్టినప్పటి నుంచీ సోనూ ఆమెకు తన సొంత సోదరి కంటే ఎక్కువగా ప్రేమానురాగాలు పంచుతున్నారు.



అలియాభట్- యష్ జోహార్

బాలీవుడ్ అగ్ర కథానాయికల్లో ఒకరు అలియా భట్. అద్భుతమైన అభినయంతో వెండితెరపై పాత్రను ఎంతలా పండిస్తున్నారో... నిజ జీవితంలోనూ ఇల్లాలిగా, తల్లిగా, తనయగా అంతే సమర్థవంతంగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అంతేకాదు... ఆమెకు రాఖీ పండుగ చాలా ప్రత్యేకం. శ్రావణ పౌర్ణమినాడు స్టార్ దర్శకనిర్మాత కరణ్ జోహార్ తనయుడు యష్ జోహార్‌కు అలియా రాఖీ కట్టడం... కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక ఆనవాయితీ. పరిశ్రమలోకి అడుగుపెట్టకముందు నుంచీ కరణ్‌తో ఆమెకు మంచి స్నేహం ఉంది. వాళ్ల ఇంట్లో ఒక కుటుంబ సభ్యురాలిగా మెలుగుతున్నారు.




కరీనా కపూర్- మనీష్ మల్హోత్రా

కపూర్‌ల వారసురాలిగా బాలీవుడ్‌లో అడుగు పెట్టింది మొదలు... కరీనా కపూర్ పేరు నిత్యం వార్తల్లో ఉంటోంది. ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. చూపు తిప్పుకోనివ్వని అందంతో... మంత్రముగ్ధులను చేసే హావభావాలతో కోట్లమంది అభిమానులను సంపాదించుకున్నారు. స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌ను ప్రేమించి, పెళ్లి చేసుకొని, బిడ్డకు జన్మనిచ్చిన కరీనా... సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో మళ్లీ బిజీగా మారారు. కెరీర్‌లో తనతో కలిసి ప్రయాణించి, తన ఎదుగుదలలో భాగమైనవారిని తన కుటుంబ సభ్యులుగా భావిస్తారు. అలాంటివారిలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఒకరు. ప్రతి సంవత్సరం అతనికి కరీనా రాఖీ కడుతున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో దృఢమైన అన్నాచెల్లెళ్ల బంధాల్లో ఒకటిగా చెప్పుకొనే వీరి అనురాగబంధం ఇవాల్టిది కాదు... ఎన్నో ఏళ్లనాటిది.



గౌరీఖాన్- సాజిద్‌ఖాన్

హీరో షారూక్ ఖాన్ సతీమణిగానే కాకుండా... నిర్మాతగా, ఇంటీరియర్ డిజైనర్‌గా పేరు సంపాదించిన వ్యక్తి గౌరీఖాన్. 'హౌస్‌ఫుల్' వరుస చిత్రాల దర్శకుడు, హాస్య నటుడు... సాజిద్‌ఖాన్. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్‌తో గౌరీకి మొదటి నుంచీ మంచి స్నేహం. ఆమె ద్వారా సాజిద్ పరిచయమయ్యారు. నాటి నుంచీ అతడు గౌరీ కుటుంబంలో ఒక సభ్యుడయ్యారు. ఏటా క్రమం తప్పకుండా సాజిద్‌కు ఆమె రాఖీ కడుతున్నారు. చాలా సందర్భాల్లో సాజిద్ ఈ విషయం పంచుకున్నారు.



కత్రినా కైఫ్- అర్జున్ కపూర్

మోడల్‌గా మెరిపించి... తారగా వెలిగిన కత్రినా కైఫ్... హీరో విక్కీ కౌశల్‌తో పెళ్లి తరువాత సినిమాలు తగ్గించారు. నచ్చిన ప్రాజెక్టులు మాత్రమే చేస్తూ కుటుంబం కోసం సమయం కేటాయిస్తున్నారు. నటుడు అర్జున్ కపూర్. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ తనయుడుగా రంగప్రవేశం చేసినా, హీరోగా ఆశించిన విజయాలు అందుకోలేకపోయారు. అయితే అగ్రనటుడు సల్మాన్‌ఖాన్ ద్వారా కత్రినాకు పరిచయమైన అర్జున్... నేటికీ ఆమెతో ఆత్మీయ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అర్జున్‌ను తన తమ్ముడిలా చూసుకొంటూ ఆప్యాయతలు పంచుతోంది కత్రినా. ఏటా రక్షాబంధన్ రోజున అతడికి రాఖీ కడుతున్నారు.

బంగారు రాఖీ కొంటున్నారా?

రాఖీ.. మన భారతీయ సంస్కృతిలో సోదరీసోదరుల మధ్య అనుబంధానికి ఒక ప్రతీక. ప్రతి ఏడాది ఈ పండుగను కోట్ల మంది జరుపుకుంటూ ఉంటారు. కొందరు వెండి లేదా బంగారు రాఖీలను కూడా తమ సోదరులకు కడుతూ ఉంటారు.

సోదరుడి జాతకంలో చంద్రుడి వల్ల కలిగే సమస్యలకు వెండి రాఖీ పరిష్కారమని కొందరు నమ్ముతూ ఉంటారు. అంతే కాకుండా మానసిక ప్రశాంతతకు వెండిని చిహ్నంగా కూడా భావిస్తూ ఉంటారు. ఇక బంగారాన్ని తమ సోదరుడికి ఇచ్చే బహుమతిగా కొందరు భావిస్తూ ఉంటారు. ఇంకొందరు రాఖీ పండుగకు బంగారపు రాఖీలు కొని దాచుకుంటూ ఉంటారు.

వెండి లేదా బంగారు రాఖీలను కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్త లేమిటో తెలుసుకుందాం..

- సాధారణంగా వెండి లేదా బంగారపు రాఖీలు 14 క్యారెట్లు లేదా 18 క్యారెట్లతో తయారుచేస్తారు. ఇలా తయారుచేసిన రాఖీలు ఏవైనా వస్తువులు తయారు చేయించు కోవటానికి వీలుగా ఉంటాయి.
- రాఖీ కట్టించుకొనే వ్యక్తి వ్యక్తిత్వానికి తగినట్లుగా రాఖీలను కొంటే బావుంటుంది. ఈ మధ్యకాలంలో 'ఓం' చిహ్నంతో ఉన్న రాఖీలకు మంచి డిమాండ్ ఉంది.



- కొన్ని రకాల బంగారు లేదా వెండి రాఖీలను పెండెంట్‌ల కింద కూడా వాడుకోవచ్చు.
- షాపుకు వెళ్లే ముందే ఎన్ని గ్రాముల బంగారం లేదా వెండి రాఖీని కొనాలనే విషయాన్ని నిర్ణయించుకొని వెళ్తే మంచిది.
- ఈ మధ్యకాలంలో పేరున్న జ్యూయలరీ సంస్థలన్నీ వెండి లేదా బంగారు రాఖీలను విక్రయిస్తున్నాయి. అలాంటి సంస్థల నుంచి కొనుగోలు చేస్తే గ్యారంటీ కూడా ఉంటుంది.

మేకప్



తడికి చెదరకుండా..

వానాకాలం ఎన్ని జాగ్రత్తలు పాటించినా, అడపాదడపా తడుస్తూనే ఉంటాం. ఇలా తడిచిన ప్రతిసారీ మేకప్ సరిచేసుకోవడం అన్నిసార్లూ వీలుపడదు. కాబట్టి ఈ కాలానికి తగిన మేకప్ ఎంచుకోవాలి.

పరిశుభ్రం: మేకప్‌కు తగ్గట్టు ముఖ చర్మం శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖం మీద తేమ, జిడ్డులను తొలగించుకుని ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టుకోవాలి.

మాయిశ్చరైజర్: పగటివేళ ఆయిల్ ఫ్రీ మాయిశ్చరైజర్ మాత్రమే ఉపయోగించాలి. ముఖం జిడ్డుగా మారకుండా ఉండడానికి ఇది తోడ్పడుతుంది.

సన్ ప్రొటెక్షన్: వానాకాలం కదా అని సన్‌స్క్రీన్ మానుకోకూడదు. ఈ కాలంలో కూడా 30 కంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత సన్‌స్క్రీన్, ఆ తర్వాత ఫౌండేషన్ సరైన ఛాయిస్.

ప్రైమర్: మేకప్ వన్నె తగ్గకుండా ఉండాలంటే ప్రైమర్ కూడా తప్పనిసరిగా వాడాలి. ముడతలను కనపడనివ్వకుండా చేసే ప్రైమర్‌తో యంగర్ లుక్ వస్తుంది.

తక్కువ మేకప్: ముఖం మీద మేకప్ ముద్దలు కట్టకుండా, గీతలు పడకుండా ఉండాలంటే, వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. తప్పనిసరి అయితే టింటెడ్ మాయిశ్చరైజర్, కన్‌సీలర్లను ఉపయోగించుకోవచ్చు.

బ్రాంజర్: కళ్లు ఆకర్షణీయంగా కనిపించాలంటే బ్రాంజర్ వాడుకోవాలి. తాజాగా, సహజసిద్ధ సౌందర్యంతో మెరిసిపోవాలంటే నుదురు, చీక్ బోన్స్, చుబుకం, ముక్కు మీద బ్రాంజర్ అప్లై చేయాలి. ఈ కాలంలో క్రీమ్ రూపంలోని బ్రాంజర్లనే ఎంచుకోవాలి.

షిమ్మర్ వద్దు: అవసరానికి మించిన మెరుపులు ఈ కాలంలో ఎబ్బెట్టుగా ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో షిమ్మర్‌ను వాడకపోవడమే మంచిది.

బ్లష్: ఈ కాలంలో పౌడర్ బ్లష్‌లకు బదులుగా జెల్ బ్లష్ వాడుకోవాలి.

లిప్‌స్టిక్: ముదురు రంగు లిప్‌స్టిక్‌లకు బదులుగా హాయిగొలిపే లేత గులాబీ, లేత నారింజ రంగులను ఎంచుకోవాలి.

భోజన కుతూహలం

మధుమేహానికి దొండాకులే మందు..!

మన పూర్వుల ఆహార అలవాట్లు చాలా విశిష్టమైనవి. వాళ్లకు ఆహార కరువు తెలీదు. ఎందుకంటే ప్రకృతిలో కంటికి కనిపించే ఎన్నో ఆకుల్ని, కాయల్ని, పూలని, దుంపల్ని వాళ్లు ఆహారంగా మలచుకుని తిన్నారు.

దొండ ఆకుల పచ్చడి చేయటం ఇలా...

దొండ ఆకులను శుభ్రంగా కడిగి.. సన్నగా తరగాలి. ఈ ఆకులను ఉప్పు నీళ్లలో వేసి బాగా ఉడికించాలి. ఆ తర్వాత ఈ ఆకులకు నేతితో తాలింపు పెట్టాలి. కొద్దిగా ఇంగువ వేయాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.

అలాంటి వాటిలో దొండ ఆకులు కూడా ప్రధానమైనవి. చాలా మంది దొండ ఆకులు వగరుగా ఉంటాయనుకుంటారు. కానీ ఈ ఆకులు కూడా దొండకాయల రుచిలోనే ఉంటాయి. వీటితో కూర, పప్పు, పచ్చడి మొదలైనవి చేసుకోవచ్చు. మన ఆయుర్వేద గ్రంథాల ఆధారంగా దొండ ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం.

- దొండ ఆకులు అమితంగా చలవ చేస్తాయి. వాతాన్ని తగ్గిస్తాయి. అదే సమయంలో శరీరంలో వేడిని కూడా తగ్గిస్తాయి. తరుచు నోటి పూత వచ్చేవారు.
- కామెర్ల వ్యాధికి దొండాకుల రసం మంచి మందు. దొండ ఆకుల రసాన్ని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా ఒక కప్పుడు తాగితే కామెర్లు తగ్గుతాయి.
- దొండ ఆకులు రక్తహీనతను తగ్గిస్తాయి. రక్తపుష్టినిస్తాయి.
- దొండ ఆకుల రసం క్రమం తప్పకుండా తాగితే శరీరంలో కొవ్వు కరుగుతుంది. స్థూలకాయం తగ్గుతుంది.
- పురుషుల్లో లైంగిక బలహీనతను నివారించే గుణం దొండాకులకుంది.
- దొండ ఆకులను ఎండబెట్టి పొడిచేసి నీటిలో కలుపుకుని ప్రతి రోజూ తాగితే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. దొండ ఆకులు మాత్రమే కాకుండా.. దొండ పువ్వులు, దొండ వేర్లు కూడా మధుమేహ వ్యాధి నివారణకు పనికొస్తాయి.
- పక్క తడిపే పిల్లలకు దొండ ఆకులు, దొండవేళ్లు కలిపి నూరిన పసరును తేనెతో కలిపి తాగిస్తే వారిలో మార్పు వస్తుంది.



- గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

కొబ్బరి పాలతో నోరూరేలా..

రాఖీ పండక్కి అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు, బంధుమిత్రులు అందరూ ఒక చోట కలుసుకుంటూ ఉంటారు. ఈ సమయంలో ఏవైనా స్పెషల్ వంటకాలు చేస్తే ఆ ఆనందం రెట్టింపవుతుంది. ఎక్కువ శ్రమ పడకుండా తక్కువ సమయంలో పూర్తయ్యేవి అయితే ఇంకా బాగుంటుంది. కొబ్బరిపాలతో తయారుచేసే అలాంటి విభిన్న వంటకాలు మీకోసం...



కొబ్బరిపాల పలావ్

కావాల్సిన పదార్థాలు


బియ్యం- ఒక గ్లాసు, పచ్చి కొబ్బరి చిప్ప- ఒకటి, నెయ్యి- రెండు చెంచాలు, బిరియానీ ఆకు- ఒకటి, దాల్చిన చెక్క- చిన్న ముక్క, మిరియాలు- 15, లవంగాలు- మూడు, యాలకులు- రెండు, జీలకర్ర- అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- ఆరు, జీడిపప్పు- కొద్దిగా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, కేరట్ ముక్కలు- పావు కప్పు, ఆలుగడ్డ ముక్కలు- పావు కప్పు, బీన్స్ ముక్కలు- పావు కప్పు, ఉప్పు- రెండు చెంచాలు, తరిగిన కొత్తిమీర- కొద్దిగా, గరం మసాల పొడి- అర చెంచా

చిట్కాలు

- ఈ పలావ్‌లో క్యాలీ ఫ్లవర్, క్యాప్సికమ్ ముక్కలు కూడా వేసుకోవచ్చు.
- కొబ్బరి పాలను చిక్కగా తయారు చేసుకుంటే పలావ్ రుచిగా ఉంటుంది.

తయారీ విధానం

- బియ్యాన్ని కడిగి మునిగేంత వరకు నీళ్లు పోసి ఉంచాలి. కొబ్బరి చిప్పను చిన్న ముక్కలుగా కోయాలి. మిక్సీలో కొబ్బరి ముక్కలు వేసి రెండున్నర గ్లాసుల నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. స్టయినర్ సహాయంతో ఈ మిశ్రమం నుంచి కొబ్బరి పాలను గిన్నెలోకి వడబోయాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. తరవాత బిరియానీ ఆకు, కరివేపాకు, దాల్చిన చెక్క, మిరియాలు,



లవంగాలు, యాలకులు, జీడిపప్పు, జీలకర్ర వేసి దోరగా వేయించాలి.

తరవాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, కేరట్ ముక్కలు, ఆలుగడ్డ ముక్కలు, బీన్స్ ముక్కలు, కొత్తిమీర, గరం మసాల పొడి వేసి మరో అయిదు నిమిషాలు వేయించాలి. తరవాత ఆ మిశ్రమంలో నానబెట్టిన బియ్యం వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత రెండు గ్లాసుల కొబ్బరిపాలు, ఉప్పు వేసి బాగా కలపాలి. కుక్కర్‌కు మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న కొబ్బరి పాల పలావ్‌ను ఏదైనా గ్రేవీ కర్రీ లేదా రైతాతో సర్వ్ చేసుకోవచ్చు.

కొబ్బరిపాల జున్ను

కావాల్సిన పదార్థాలు

పచ్చి కొబ్బరి ముక్కలు- ఒకటిన్నర కప్పులు, నీళ్లు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- నాలుగు చెంచాలు, బెల్లం- అర కప్పు, యాలకులు- మూడు, మిరియాల పొడి- అర చెంచా

తయారీ విధానం



- మిక్సీలో పచ్చి కొబ్బరి ముక్కలు, నీళ్లు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమం నుంచి కొబ్బరి పాలను స్టయినర్ సహాయంతో గిన్నెలోకి వడబోయాలి. మరో చిన్న గిన్నెలో కార్న్‌ఫ్లోర్ వేసి అందులో కొన్ని కొబ్బరి పాలు పోసి ఉండలు లేకుండా జారుగా కలపాలి. ఈ కార్న్‌ఫ్లోర్ మిశ్రమాన్ని కొబ్బరిపాల గిన్నెలో పోసి బాగా కలపాలి. తరవాత అందులో యాలకుల పొడి, మిరియాల పొడి వేసి కలపాలి. ఈ గిన్నె మీద మూత పెట్టాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. తరవాత అందులో కొబ్బరి పాల గిన్నె ఉంచి కుక్కర్‌కు మూతపెట్టాలి. విజిల్ పెట్టకూడదు. అరగంటసేపు చిన్న మంట మీద ఉడికించాలి. తరవాత ఈ గిన్నెను బయటికి తీసి చల్లార్చాలి. ఇలా తయారుచేసుకున్న కొబ్బరిపాల జున్నును అరగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తరవాత ముక్కలుగా కోసి సర్వ్ చేసుకోవాలి.

చిట్కాలు

- ఇందులో జీడిపప్పు, బాదం పలుకులు వేస్తే రుచి మరింత పెరుగుతుంది.
- కొబ్బరి ముక్కలకు వెనక ఉన్న నల్లని భాగాన్ని తీసివేస్తే జున్ను ముక్కలు చూడడానికి బాగుంటాయి.

‘ఉజ్వల’కు 12 వేల కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపు

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై)ను కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పథకానికి రూ.12,000 కోట్లు కేటాయించింది. పీఎంయూవైతో దేశవ్యాప్తంగా 10.33 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. దేశంలోని పేద మహిళలకు ఎల్పీజీ కనెక్షన్లు అందించేందుకు గాను 2016 మేలో ఈ పథకాన్ని ప్రారంభించారు. 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తూ, ఏడాదికి 9 సిలిండర్ల వరకు అందజేస్తున్నారు. మరోవైపు సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి ఉద్దేశించిన ‘మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎంఈఆర్‌ఐటీఈ)’ పథకానికి కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 నుంచి 2029-30 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకం అమలు కోసం రూ.4,200 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. దీనికి తోడు మరో రూ.2100 కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి రుణంగా తీసుకోనుంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఉన్న 275 ప్రభుత్వ, ఎయిడెడ్ సాంకేతిక విద్యా సంస్థలకు సాయం అందించనున్నారు. నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 7.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నట్లు అంచనా. వీటితోపాటు అస్సాం, త్రిపురలకు రూ.4,250 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, తమిళనాడులో ‘మరక్కానం-పుదుచ్చేరి’ నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

సమాంతర ప్రభుత్వం నడుపుతున్నారా?

- ఇది దురదృష్టకరం.. ప్రమాదకరం కూడా
- ఐఏఎస్‌లపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): “సమాంతర ప్రభుత్వం నడుపుతున్నారా?.” అంటూ తమిళనాడు ఐఏఎస్ అధికారులపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార దర్పంతో వ్యవహరిస్తున్నారని, ఇది దురదృష్టకరం, ప్రమాదకరమని వ్యాఖ్యానిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మాజీ ఐపీఎస్ అధికారికి ఇల్లు కేటాయించే విషయంలో ఐఏఎస్ అధికారులు వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. తమిళ సాహితీవేత్తలకు ‘డ్రీమ్ హౌస్ ప్రాజెక్టు’(కన్నావు ఇల్లం) కింద ఇళ్లను కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తమిళనాడు తొలి మహిళా ఐపీఎస్ అధికారిణి(రిటైర్డ్), రచయిత్రి తిలకవతికి ఇల్లు కేటాయించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై ఆమె మరోసారి అప్పీలు చేశారని గుర్తు చేసింది. ఇదేకాకుండా రచయితలకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవడంపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ‘రచయితలకు ఇళ్ల కేటాయింపు ఒక భావోద్వేగ అంశం. దీనిని ఐఏఎస్ అధికారులు స్పష్టంగా అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నా రు.’ అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సమాంతర ప్రభుత్వంలా వ్యవహరించడం దురదృష్టకరమని, దీనిని కొనసాగిస్తే తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని పేర్కొంది. రచయితకు కేటాయించిన ఇంటిని రద్దు చేయడమనేది మాజీ సీఎం దివంగత కరుణానిధి హయాంలో జరిగి ఉంటే ఆయన చాలా బాధపడి ఉండేవారని, ఇలాంటి చర్యలను ఏ మాత్రం సహించేవారు కాదని వ్యాఖ్యానించింది.

గాజా స్వాధీనానికి ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం

పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదమే తరువాయి

టెల్ అవీవ్, ఆగస్టు 8: గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రణాళికకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పూర్తి స్థాయి క్యాబినెట్ ఆమోదం పొందితే ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. అయితే ఇజ్రాయెల్ ఇప్పటికే గాజా సరిహద్దుకు భారీగా సైనికులను తరలించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోందనే కథనాలు వస్తున్నాయి. హమాస్‌ను నాశనం చేయడం, బందీలను విడిపించుకోవడం, గాజాను సైనిక రహిత ప్రాంతంగా మార్చడం, గాజాకు ఇజ్రాయెల్ భద్రత కల్పించడం, గాజాను తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమనే 5 అంశాలతో తాజా ప్రణాళిక రూపొందించారు. అయితే గాజాను స్వాధీనం చేసుకోవడం తమ లక్ష్యం కాదని, హమాస్ ఉగ్రవాదుల వద్ద ఉన్న తమ బందీలను విడిపించుకుని, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. కాగా, గాజాను స్వాధీనం చేసుకోవాలనుకునే ప్రణాళిక తప్పని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ చర్య మరింత రక్తపాతానికి దారితీస్తుందని చెప్పారు. పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ప్రణాళికను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు ఇంతకాలం ఇజ్రాయెల్‌ను గట్టిగా సమర్థించిన జర్మనీ తాజాగా తన వైఖరిని మార్చుకుంది. ఇజ్రాయెల్‌కు సైనిక ఉత్పత్తులను ఎగుమతి చేయరాదని నిర్ణయించుకున్నట్లు జర్మనీ చాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ చెప్పారు.

ఓబీసీల క్రీమీ లేయర్ పరిమితిని సవరించాలి

- పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని తక్షణమే సవరించాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. ప్రస్తుత పరిమితి కారణంగా పెద్దసంఖ్యలో అర్హత కలిగిన ఓబీసీ అభ్యర్థులు రిజర్వేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కోల్పోతున్నారని తెలిపింది. చివరిసారిగా 2017లో ఈ వార్షిక పరిమితిని రూ.6.5 లక్షల నుంచి రూ.8లక్షలకు సవరించినట్లు శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించిన 8వ నివేదికలో కమిటీ పేర్కొంది. సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) నిబంధనల ప్రకారం.. ఈ ఆదాయ పరిమితిని అవసరమైతే ప్రతి మూడేళ్లకు ఒకసారి లేదా అంతకంటే ముందుగానే సమీక్షించాల్సి ఉంది. “ప్రస్తుత పరిమితి చాలా తక్కువగా ఉంది. ఓబీసీల్లోని ఒక చిన్న భాగాన్ని మాత్రమే ఇది కవర్ చేస్తోంది. ద్రవ్యోల్బణం రేటు, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని పెంచడం తక్షణ అవసరం” అని కమిటీ చైర్మన్, బీజేపీ ఎంపీ గణేశ్ సింగ్ పునరుద్ఘాటించారు.

45 ఏళ్లు దాటిన ప్రతి ఐదుగురిలో ఒకరికి మధుమేహం!

భారత్‌లో మధుమేహం వేగంగా విస్తరిస్తోంది. 2019లో నిర్వహించిన ఒక అధ్యయనంలో 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహంతో జీవిస్తున్నట్టు గుర్తించారు. వారిలో కూడా ప్రతి ఐదుగురిలో ఇద్దరికి తమకు ఈ వ్యాధి ఉన్నట్టు తెలియదని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. భారత్‌లో మధ్య వయస్కులు, వృద్ధుల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని ఈ అధ్యయనం పేర్కొంది. 2017-2019 మధ్య కాలంలో 45 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న 60 వేల మందిపై లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (ఎల్‌ఏఎస్‌ఐ) ఒక సర్వే నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు ఎక్కువగా డయాబెటిస్ బారిన పడుతున్నట్టు గుర్తించింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బాలకృష్ణ డబ్బింగ్ పూర్తి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘అఖండ 2: తాండవం’. ‘అఖండ’కు సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సినిమా సెప్టెంబరు 25న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులను షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయడానికి చిత్ర బృందం కృషి చేస్తోంది. తాజాగా బాలకృష్ణ తన పాత్రకు డబ్బింగ్ పూర్తిచేశారు.

షూటింగ్స్ ఆపండి

- నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ ఆదేశాలు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. వెంటనే షూటింగ్‌లు ఆపివేయాలంటూ నిర్మాతలకు ఆదేశాలు జారీ చేసింది. సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై నిర్మాతలు - ఫెడరేషన్ నాయకుల మధ్య జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కిరాని నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ‘స్టూడియోలు, ఔట్‌డోర్ యూనిట్లు అనుమతి లేకుండా ఎలాంటి సేవలు అందించవద్దు. ఈ ఆదేశాలను స్టూడియో యజమానులు, నిర్మాతలు సీరియస్‌గా తీసుకోవాలి. తెలుగు సినీ పరిశ్రమలోని 24 విభాగాల యూనియన్లు ఏకపక్షంగా సమ్మెకు పిలుపునివ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చర్చలు, సంప్రదింపులకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు దూరంగా ఉండాలి’ అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

అదరగొట్టిన ‘జడల్’



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ‘ది ప్యారడైజ్’ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇందులో నాని ఇంతకు ముందెన్నడూ చేయని క్యారెక్టర్‌ను చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి నాని ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కోరమీసం, గెడ్డం, రెండు జడలతో ఆయన విభిన్నమైన లుక్‌లో కనిపించారు. ఇందులో నాని పాత్ర పేరు ‘జడల్’. పోస్టర్‌లో నాని వెనుక కత్తులు- బుల్లెట్లతో తయారైన భారీ చక్రం, పొగ మంచులో ఎగిరే కాకులు ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. కాగా, ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 2026 మార్చి 26న తెలుగు సహా ఎనిమిది భాషల్లో విడుదల కానుంది.

నా మావ పిల్లనిత్తానన్నాడే...



నాగశౌర్య, నిధి జంటగా నటిస్తోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’. రామ్ దేశినా(రమేశ్) దర్శకత్వంలో శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ‘నా మావ పిల్లనిత్తానన్నాడే..’ అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యానికి హారిస్ జయరాజ్ స్వరాలు సమకూర్చారు. కారుణ్య, హరిప్రియ ఆలపించారు. పాటలో నాగశౌర్య, నిధి స్టెప్పులు ఆకట్టుకునేలా ఉన్నాయి.

పవర్‌ఫుల్ లుక్‌తో



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న మైథలాజికల్ థ్రిల్లర్ ‘జటాధర’. బాలీవుడ్ భామ సోనాక్షిసిన్హా కథానాయిక. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. శుక్రవారం హీరో ప్రభాస్ ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్ అని అర్థమవుతోంది. పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది.

భయపెట్టే బుల్లెట్టు



రాఘవ లారెన్స్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్ ‘బుల్లెట్టు బండి’. లారెన్స్ సోదరుడు ఎల్విన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో కతిరేశన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హీరో నాగచైతన్య ‘బుల్లెట్టు బండి’ టీజర్‌ను ఆవిష్కరించారు. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిది, శక్తిమంతమైన పాత్రలో రాఘవ లారెన్స్ కనిపిస్తారు అని కతిరేశన్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్. సీఎస్, సినిమాటోగ్రఫీ: అరవింద్ సింగ్

ప్రేమకథ



ఈ తరం యువత జీవితాలను ఆవిష్కరించే ప్రేమ కథా చిత్రం ‘ప్రేమలో రెండోసారి’. రమణ సాకే, వనిత గౌడ్ జంటగా నటించారు. సత్య మార్క దర్శకత్వంలో సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆడియోను విడుదల చేసింది. ఈ సందర్భంగా రమణ సాకే మాట్లాడుతూ ‘ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది’ అని చెప్పారు.

పెళ్లి నేపథ్యంలో



ఓ పెళ్లి వేడుకలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా తెరకెక్కిన చిత్రం ‘పెళ్లిలో పెళ్లి’. శ్రీకాంత్ సంబరం దర్శకత్వంలో గణేశ్ కోలి నిర్మించారు. శివసాయి రిషి, సంస్కృతి గోరే జంటగా నటించారు. తనికెళ్లభరణి కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది.

క్షణాలన్నీ జ్ఞాపకాలై

ఒకప్పటి సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం అంటున్నారు సంతోశ్ శోభన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ‘కపుల్ ఫ్రెండ్లీ’ చిత్రం టీజర్ లోనిదీ డైలాగ్. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ‘కపుల్ ఫ్రెండ్లీ’ టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడు



దల చేశారు. చెన్నైలో అనుకోకుండా కలసిన యువతీ యువకుల ప్రేమ కథ ఎలాంటి మలుపు తిరిగిందనే లైన్ చుట్టూ ఆసక్తికరంగా సాగే కథ అని ప్రచార చిత్రాన్ని బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తోంది.

అమ్మాయి గౌరవం పెంచేలా..



వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో కోవెలమూడి సత్య సాయి బాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మేఘ లేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. ఈనెల 14 నుంచి ఈ సిరీస్ ఈటీవీ విన్‌లో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి సిరీస్ ట్రైలర్‌ని విడుదల చేసి చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా హీరోయిన్ వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ ‘అమ్మాయిలపై గౌరవం పెంచేలా ఈ సిరీస్ ఉంటుంది’ అని అన్నారు.

అర్జున్ డ్రా చేశాడు

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీని విజయంతో ప్రారంభించిన తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి..రెండో రౌండ్‌ను ఫలితం లేకుండా ముగించాడు. చాలెంజర్స్ విభాగంలో ద్రోణవల్లి హారికకు వరుసగా రెండో రౌండ్ లోనూ పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన మాస్టర్స్ విభాగం రెండో రౌండ్‌లో డచ్ జీఎం జోర్డెన్ వాన్ ఫోరీస్ట్‌తో తలపడిన టాప్‌సీడ్ అర్జున్ 42 ఎత్తులలో డ్రా చేసుకున్నాడు. భారత్‌కు చెందిన ప్రణవ్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్న విన్సెంట్ కీమర్ (జర్మనీ) 46 ఎత్తుల్లో విజయంతో గట్టెక్కాడు. చాలెంజర్స్ కేటగిరీలో..పన్నీర్ సెల్వమ్ ఇనియన్ చేతిలో హారిక ఓటమి చవిచూసింది.

'లీడ్స్' పిచ్ ఉత్తమం

లండన్: అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలోని టెస్టు స్టేడియాల పిచ్‌లపై ఐసీసీ రేటింగ్ ఇచ్చింది. అయితే ఇందులో ఆఖరి టెస్టు జరిగిన ఓవల్ మైదానానికి ఇంకా రేటింగ్ ఇవ్వలేదు. మిగతా నాలుగింట్లో తొలి టెస్టుకు వేదికగా నిలిచిన లీడ్స్ స్టేడియం పిచ్‌తో పాటు అవుట్‌ఫీల్డ్ కూడా చాలా బాగుందని కితాబిచ్చింది. ఇక ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్‌ట్రాఫోర్డ్ పిచ్‌లు సంతృప్తికరంగా ఉన్నా..వీటి అవుట్‌ఫీల్డ్స్ మాత్రం చాలా బాగున్నట్టు ప్రకటించింది.

మనమ్మాయిలు అదరగొట్టారు

● తుర్క్‌మెనిస్థాన్‌పై భారీ విజయం

● ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్



యాంగాన్ (మయన్మార్): అండర్-20 మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు దూకుడైన ఆటతో చెలరేగింది. గ్రూప్-డిలో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో భారత అమ్మాయిలు 7-0తో తుర్క్‌మెనిస్థాన్‌ను చిత్తుగా ఓడించారు. శుభాంగి (7వ, 42వ), సులంజన (38వ, 90+వ) చెరో రెండు గోల్స్ చేయగా, శిబాని (14వ), తొయిబిసాన చాను (35వ), పూజ (65వ) తలో గోల్ సాధించారు. ఈ గెలుపుతో భారత్ గ్రూప్-డిలో 4 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది.



ఎన్నాళ్లకెన్నాళ్లకు!

● విరాట్ కోహ్లి బ్యాటు పట్టాడు

● లండన్‌లో ప్రాక్టీస్ ప్రారంభించిన టీమిండియా స్టార్

● అక్టోబరులో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్

లండన్: భారత జట్టు తదుపరి వన్డే సిరీస్ మరో రెండు నెలలకుపైగానే ఉంది. వచ్చే అక్టోబరులో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న టీమిండియా పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడనుంది. అందులో భాగంగా 3 వన్డేలు, 5 టీ20లలో భారత్-ఆస్ట్రేలియా ఢీకొననున్నాయి. అక్టోబరు 19న వన్డే సిరీస్ మొదలు కానుంది. వాస్తవంగా ఈ ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనలో భారత్ వన్డే, టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ ఆ సిరీస్ రద్దయింది. ఇక..భారత జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు సన్నాహకాలు మొదలు పెట్టాడు. విరాట్ చివరిసారి మైదానంలో కనిపించి రెండు నెలలపైనే అయ్యింది. ఇక..ఇటీవల టెస్టులు, అంతకుముందు టీ20లనుంచి రిటైర్ అయిన కోహ్లి..ఐపీఎల్ అనంతరం లండన్ వెళ్లిపోయి అక్కడే ఉంటున్నాడు. మొత్తంగా మెగా లీగ్ అనంతరం పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్న అతడు..వన్డేలలో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నాడు. గుజరాత్ సహాయ కోచ్ నయీమ్ అమీన్‌తో కలిసి లండన్‌లోని ఓ ఇండోర్ స్టేడియంలో కోహ్లి ప్రాక్టీస్ షురూ చేశాడు. ఈమేరకు ఆ ఫొటోను అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

ఆసియా బాక్సింగ్‌లో అదే జోరు

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. మరో పది మంది బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లి కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన పోటీల్లో అండర్-19 విభాగం నుంచి మహిళల్లో నిషా (54 కిలోలు), ముస్కాన్ (57 కి), విని (60 కి), నిషిత (65 కి), ఆర్తి కుమారి (75 కి), క్రితిక (80 కి), పర్ని టొకాస్ (80+ కి), పురుషుల్లో సుహాగ్ (65 కి), రాహుల్ కుందు (75 కి), హేమంత్ సాంగ్వాన్ (80 కి) సెమీఫైనల్స్‌లో ప్రత్యర్థులను ఓడించి తుదిపోరులో నిలిచారు. కాగా.. యషిక (51 కి), ఆకాంక్ష (70 కి), శివమ్ (55 కి), గౌరవ్ (85 కి) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

ఆటగాడిగా గెలిచి.. జీవితంలో ఓడి..



అనారోగ్యంతో కన్నుమూసిన ఖోఖో మాజీ ఆటగాడు సారంగపాణి



ఖోఖో క్రీడనే ప్రాణంగా భావించి.. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి, దేశానికి ఎన్నో పతకాలు అందించాడు. కానీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం పేదరికం, కష్టాలతో సహవాసం చేశాడు. బతికినంతకాలం ఆర్థిక ఇబ్బందులతోనే సతమతమై, చివరకు అనారోగ్యంతో ప్రాణాలు విడిచాడు. అతనే తెలంగాణకు చెందిన ఖోఖో మాజీ ఆటగాడు, 50 ఏళ్ల సారంగపాణి. అంతర్జాతీయ పోటీల్లో 21 సార్లు భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన సారంగపాణి.. శుక్రవారం ఉదయం తన స్వస్థలమైన వరంగల్‌లో అనారోగ్యంతో తుది శ్వాస విడిచాడు.

ఆటలో అదరగొట్టినా..

తొంభయ్యో దశకంలో భారత ఖోఖోలో తిరుగులేని డిఫెండర్‌గా పేరు తెచ్చుకున్న సారంగపాణి.. కోల్‌కతా వేదికగా 1996లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో టీమిండియా స్వర్ణ పతకం గెలవడంలో ముఖ్య భూమిక పోషించాడు. 1999లో మణిపూర్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తన సారథ్యంలో కాంస్య పతకం అందించాడు. జాతీయ, రాష్ట్రస్థాయిలో సుమారు 30కిపైగానే పతకాలు కొల్లగొట్టాడు. అమోఘమైన ప్రదర్శనతో తన క్రీడలో వెలుగొందిన అతను.. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక జీవితంలో మాత్రం ఓడిపోయాడు.

సరైన గుర్తింపు, ఉపాధి లేక..

క్రీడాకారుడిగా కెరీర్ ముగిశాక సారంగపాణి కొన్నాళ్లు వరంగల్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కాంట్రాక్టు కోచ్‌గా పని చేశాడు. ఆ తర్వాత నిధుల కొరతతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో నాయీ బ్రాహ్మణుడైన అతను కుల వృత్తి చేసుకుంటూ జీవనం వెళ్లదీశాడు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడినైన తనకు కనీసం చిన్న ఉద్యోగం కానీ, నగదు ప్రోత్సాహకం కానీ లభించకపోవడంపై సారంగపాణి తరచూ మధనపడేవాడని అతని సన్నిహితులు తెలిపారు. కోచ్‌గా కాకపోయినా, స్వీపర్ ఉద్యోగమైనా ఇవ్వాలని నెలరోజుల క్రితమే అతను కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగాడని, అయినా ఎవరూ పట్టించుకోలేదని వారు వెల్లడించారు. ఇక, జీవితంలో స్థిరపడలేదన్న కారణంతో అతను పెళ్లి కూడా చేసుకోలేదన్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి- హైదరాబాద్)

ప్రభుత్వాలు అండగా నిలవాలి

క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ వంటి కొన్ని క్రీడలకే ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల సారంగపాణిలాంటి ప్రతిభావంతులైన అంతర్జాతీయ క్రీడాకారులు ప్రపంచానికి తెలియకుండానే కనుమరుగవుతున్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి గ్రామీణ క్రీడలతో పాటు స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్ వంటి ఒలింపిక్ క్రీడల అభివృద్ధి, ఆ క్రీడాకారుల సంక్షేమంపై కూడా ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు దృష్టి పెట్టాలని క్రీడా విశ్లేషకులు కోరుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత వాళ్లకు ఏదో ఒక విధంగా ఉపాధి కల్పించాలని సూచిస్తున్నారు.

అట్టహాసంగా ఏపీఎల్ ప్రారంభం



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీ శుక్రవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని కార్యవర్గం క్రికెటర్లతో ఆటలాడుకున్న నేపథ్యంలో ఏపీఎల్-4 టోర్నీలో కొత్త మార్పులు తీసుకువచ్చి ప్రతిభకు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం మరో ముఖ్య అతిథి, సినీ నటుడు వెంకటేష్‌తో కలిసి తొలి మ్యాచ్‌లో తలపడుతున్న అమరావతి రాయల్స్-కాకినాడ కింగ్స్ జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకుని అభినందించారు. ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీశ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్, మిథాలీరాజ్ పాల్గొన్నారు.

భారత షట్లర్లకు సులువైన డ్రా

ప్రపంచ జూ. టీమ్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ జట్టుకు ప్రపంచ జూనియర్ టీమ్ చాంపియన్‌షిప్‌లో సులువైన డ్రా ఎదురైంది. హాంకాంగ్, నేపాల్, ఘనాలాంటి పసికూన జట్లతో కలిపి భారత్‌కు గ్రూప్-హెచ్‌లో చోటు దక్కింది. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ వచ్చే అక్టోబరు 6 నుంచి 11 వరకు అసోం రాజధాని గువాహటిలో జరగనుంది. మొత్తం 37 జట్లు 8 గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. ప్రతి గ్రూప్‌లో విజేతగా నిలిచిన జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. టోర్నీ టాప్‌సీడ్ థాయ్‌లాండ్ గ్రూప్-ఎలో డెన్మార్క్, స్లోవేనియా, కుక్ ఐలాండ్ జట్లతో కలిసి తలపడనుంది. ప్రతి జట్టు పురుషులు, మహిళల సింగిల్స్, పురుషులు, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

నన్నూ వదిలేయండి

సీఎస్‌కేకు అశ్విన్ విజ్ఞప్తి



చెన్నై: సంజూ శాంసన్ మాదిరే ఆర్.అశ్విన్ కూడా తన సొంత జట్టును వీడాలని భావిస్తున్నాడు. ఈమేరకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే ఇరు వర్గాల నుంచి ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడలేదు. పదేళ్ల తర్వాత ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ గత సీజన్‌లోనే మళ్లీ చెన్నైకి ఆడాడు. 9 మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసిన ఈ వెటరన్‌ను మెగా వేలంలో రూ.9.75 కోట్లకు దక్కించుకుంది. అయితే 2022-2024 మధ్య రాజస్థాన్‌కు ఆడిన అశ్విన్ తిరిగి అదే జట్టులో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి.

ఇద్దరిని ఇస్తేనే..: రాజస్థాన్ కెప్టెన్ శాంసన్‌ను తీసుకోవాలనుకుంటున్న సీఎస్‌కేకు ఆ ఫ్రాంచైజీ ఓ షరతు విధించినట్టు తెలుస్తోంది. వాస్తవానికి శాంసన్‌ను అతడి ధర రూ.18 కోట్లు ఇచ్చి చెన్నై తీసుకోవాలనుకుంది. అయితే రాజస్థాన్ మాత్రం నగదు కాకుండా శాంసన్‌కు బదులు ఇద్దరు సీఎస్‌కే ఆటగాళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తోందట. దీంతో ప్రస్తుతానికి ఈ విషయమై ప్రతిష్టంభన నెలకొంది. ఒకవేళ ఈ చర్చలకు పరిష్కారం లభించకపోతే శాంసన్ వేలానికి వెళ్లక తప్పదు.

హైదర్ అలీపై రేప్ కేసు

మాంచెస్టర్: పాకిస్థాన్ బ్యాటర్ హైదర్ అలీపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీంతో గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు ఈనెల 4న అతడిని అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. పాకిస్థాన్ షహీన్స్ జట్టు తరఫున ఇటీవల ఇంగ్లండ్‌లో పర్యటించిన హైదర్ గత నెల 23న ఓ మహిళపై అత్యాచారం చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. దీంతో అతడిపై పాక్ బోర్డు తాత్కాలిక నిషేధం విధించింది.

న్యూజిలాండ్ 601/3

బులవాయో: ముగ్గురు బ్యాటర్లు శతక మోత మోగించిన వేళ..జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ 476 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 174/1తో ఆట కొనసాగించిన కివీస్ జట్టులో రచిన్ (165 బ్యాటింగ్), హెన్రీ నికోలస్ (150 బ్యాటింగ్), కాన్వే (153) శతక్కొట్టారు. దాంతో రెండోరోజు ఆఖరికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 601 రన్స్ చేసింది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులే చేసింది.

ఆకాశ్ దీప్‌దే 'బాల్ ఆఫ్ ద సిరీస్'

ఇది సచిన్ మాట



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శనను సచిన్ ఎంతగానో కొనియాడాడు. అతడికి రావాల్సినంత గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డాడు. అయితే ఈ సిరీస్‌లో అత్యుత్తమ బంతిని విసిరింది మాత్రం ఆకాశ్‌దీప్ అని చెప్పాడు. రెండో టెస్టు నాలుగో రోజున అద్భుత ఇన్‌స్వింగర్‌తో జోరూట్‌ను ఆకాశ్ బౌల్డ్ చేశాడు. ఆ బంతినే సచిన్ 'బాల్ ఆఫ్ ద సిరీస్'గా ప్రకటించడం విశేషం. ఆ టెస్టులో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. కాగా ఐదో టెస్టు మూడో రోజు చివర్లో ఓపెనర్ క్రాలేను స్లో యార్కర్‌తో సిరాజ్ క్లీన్‌బౌల్డ్ చేసిన బంతి అద్భుతమంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



ఎస్‌బీఐ భళా

10% వృద్ధితో రూ.21,201 కోట్లకు లాభం

రూ.1,35,342 కోట్లకు పెరిగిన ఆదాయం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జూన్ త్రైమాసికానికి ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరుగుదలతో రూ.21,201 కోట్లకు చేరింది. ట్రెజరీ, ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆకర్షణీయ లాభాలు ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. ఈ క్యూ1లో బ్యాంక్ స్టాండ్ అలోన్ నికర లాభం 12 శాతం పెరిగి రూ.19,160 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి స్టాండ్ అలోన్ లాభం రూ.17,035 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం గత ఏడాదితో పోల్చితే రూ.1,22,688 కోట్ల నుంచి రూ.1,35,342 కోట్లకు పెరిగింది. మరిన్ని విషయాలు..

● ఈ క్యూ1లో మొత్తం రుణాలు 11.6 శాతం వృద్ధి చెందినప్పటికీ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం 0.13% తగ్గి రూ.41,072 కోట్లకు పరిమితమైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) కూడా 0.33% క్షీణించి 3.02 శాతానికి జారుకుంది. ఆర్‌బీఐ రెపోరేటు తగ్గించడంతో పాటు డిపాజిట్ల రేట్లను దిగువకు సవరించేందుకు సమయం పట్టడం వడ్డీ మార్జిన్లపై ప్రభావం చూపింది. రెండో త్రైమాసికం లోనూ నికర వడ్డీ మార్జిన్‌పై ఒత్తిడి కొనసాగనుందని, ఆ తర్వాత మళ్లీ మెరుగుపడవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 3 శాతం ఎన్ఐఎంను లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు.

టారిఫ్‌ల ప్రభావం మాపై ఉండదు

ట్రంప్ సుంకాలతో నేరుగా ప్రభావితమవుతున్న 4-5 రంగాలకు బ్యాంక్ రుణాలిచ్చి ఉందని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. అయితే, మొత్తం రుణాల్లో వీటి వాటా 2 శాతం లోపే కాబట్టి, ట్రంప్ సుంకాల ప్రభావం బ్యాంకింగ్ రంగంపై ఉండదన్నారు. ప్రస్తుత అనిశ్చితులు మూడో త్రైమాసికాని కల్లా సద్దుమణగవచ్చని ఎస్‌బీఐ ఎండీ అశ్వినీ కుమార్ పేర్కొన్నారు.

● క్యూ1లో వడ్డీయేతర ఆదాయం ఏకంగా 55% ఎగబాకి రూ.17,346 కోట్లకు చేరుకుంది. అందులో ఫారెక్స్ కార్యకలాపాల ద్వారా ఆదాయం 352% పెరిగి రూ.1,632 కోట్లకు చేరగా.. పెట్టుబడుల విక్రయంపై లాభం 144% వృద్ధితో రూ.6,326 కోట్లకు పెరిగింది.

● నిర్వహణ వ్యయాలు 7.88% పెరిగి రూ.27,874 కోట్లకు చేరినప్పటికీ, వ్యయ వృద్ధిని కట్టడం చేయడం లాభదాయకత మెరుగుపడేందుకు దోహదపడింది.

● బ్యాంక్ కార్పొరేట్ రుణాలు 5.7%, దేశీయ రిటైల్ రుణాలు 12.56%, విదేశీ రుణాలు 14% పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి 12 శాతం మొత్తం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శెట్టి చెప్పారు. మొత్తం రూ.7 లక్షల కోట్ల రుణాలు ప్రస్తుతం పైప్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు మంజూరైన రుణాల విడుదలపై ప్రభావం చూపుతున్నాయని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి కార్పొరేట్ రుణాల మంజూరు పెరగవచ్చని, ఈ విభాగం వృద్ధి 10 శాతానికి పెరగవచ్చన్నారు. వినియోగ డిమాండ్‌పై స్పష్టత లేకపోవడంతో కంపెనీలు కొత్త పెట్టుబడులు పెట్టడంలేదన్నారు. పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్ల రంగాల నుంచి రుణాలకు అధిక డిమాండ్ నెలకొందని శెట్టి తెలిపారు.

● ఈ క్యూ1లో బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) ఏ మార్పు లేకుండా 1.83 శాతంగా నమోదయ్యాయి. కాగా, కొత్తగా రూ.7,945 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి జారుకున్నాయి. మొండి బాకీలతోపాటు ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు రూ.4,759 కోట్లకు పెరిగాయి. 2024-25 క్యూ1లో బ్యాంక్ ఇందుకోసం రూ.3,449 కోట్లు కేటాయించింది.

● డిపాజిట్ల వృద్ధి 11.6 శాతంగా నమోదైంది. డిపాజిట్ల సేకరణ వ్యయం ఇప్పటికే పతాక స్థాయికి చేరిందని శెట్టి అన్నారు.

● అనుబంధ విభాగాలవారీగా చూస్తే, ఎస్‌బీఐ లైఫ్ నికర లాభం రూ.549 కోట్లకు పెరగగా.. ఎస్‌బీఐ కార్డ్ లాభం రూ.556 కోట్లకు తగ్గింది. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ విభాగం లాభం రూ.188 కోట్లుగా నమోదైంది.

● బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు శుక్రవారం 0.09 శాతం తగ్గి రూ.804.55 వద్ద ముగిసింది.

టాటా మోటార్స్.. ఛ్!

క్యూ1 లాభంలో 62 శాతం క్షీణత



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి టాటా మోటార్స్ లాభం రూ.4,003 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన రూ.10,587 కోట్ల పోలిస్తే లాభం 62.2% క్షీణించింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాల్లోనూ వాహన విక్రయాలు తగ్గడం, అమెరికా సుంకాల కారణంగా కంపెనీ లగ్జరీ కార్ల బ్రాండ్ జాగ్వార్ లాండ్‌రోవర్ (జేఎల్ఆర్) లాభదాయకత క్షీణించడం, బేస్ ఎఫెక్ట్ అధికంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణం. క్యూ1లో కంపెనీ ఆదాయం సైతం వార్షిక ప్రాతిపదికన 2.5% తగ్గి రూ.1,04,407 కోట్లుగా నమోదైంది. 2024-25 క్యూ1లో ఆదాయంరూ.1,07,102 కోట్లుగా ఉంది. "మార్కెట్ ప్రతికూలతల్లోనూ బలమైన వ్యాపార మూలాల మద్దతుతో కంపెనీ లాభదాయక త్రైమాసికాన్ని నమోదు చేసింది. అమెరికా సుంకాలపైనా స్పష్టత వచ్చింది. పండగ సీజన్ గిరాకీ ఊపందుకోనుంది. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల విక్రయాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బలమైన పనితీరు కనబరచడంపై ప్రధానంగా దృష్టిసారించాం" అని టాటా మోటార్స్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) పీబీ బాలాజీ అన్నారు.

మరిన్ని విషయాలు..

● *బ్రిటన్, యూరప్ నుంచి దిగుమతి చేసుకునే కార్లపై అమెరికా సుంకాలు పెంచడంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జేఎల్ఆర్ ఆదాయం 9.2% తగ్గి 660 పౌండ్లకు పడిపోయింది. యూఎస్‌తో యూకే, యూరప్ ఇప్పటికే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ముందు త్రైమాసికాల్లో కంపెనీ ఆదాయంపై సుంకాల ప్రభావం తగ్గుముఖం పట్టనుందని జేఎల్ఆర్ సీఈఓ అడ్రియన్ మార్డెల్ అన్నారు.*

● *ఈ క్యూ1లో ప్రయాణికుల వాహన టోకు విక్రయాలు 10.1% తగ్గి 1,24,800 యూనిట్లుగా నమోదయ్యాయి. సాధారణంగానే క్యూ1లో వాహనాలకు గిరాకీ తక్కువగా ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) డిమాండ్ మాత్రం ఆశాజనకంగా ఉంది. జూన్ త్రైమాసికంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు 6% తగ్గి 88,000 యూనిట్లకు పరిమితమయ్యాయి.*

తాజ్ జీవీకే లాభం రూ.36 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్ త్రైమాసికంలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ నికర లాభం దాదాపు మూడింతలై రూ.36.22 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.12.71 కోట్లుగా ఉంది. కాగా, ఆదాయం రూ.94.70 కోట్ల నుంచి రూ.128.29 కోట్లకు ఎగబాకింది. తమ సంస్థకిది అత్యుత్తమ తొలి త్రైమాసికమని తాజ్ జీవీకే చైర్మన్ జీవీకే రెడ్డి అన్నారు.

బిజినెస్

పీఎస్‌బీల లాభాల్లో సరికొత్త రికార్డు

జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ సహా దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల మొత్తం లాభాలు సరికొత్త రికార్డు స్థాయి రూ.44,218 కోట్లకు పెరిగాయి. గత ఏడాది జూన్ త్రైమాసికంలో ఈ బ్యాంకులు ఆర్జించిన రూ.39,974 కోట్లతో పోలిస్తే ఇది 11% (రూ.4,244 కోట్లు) అధికం. పీఎస్‌బీల జూన్ త్రైమాసిక లాభాల్లో ఎస్‌బీఐ వాటాయే 43 శాతం. కాగా, చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 76% వృద్ధి చెంది రూ.1,111 కోట్లుగా నమోదైంది. లాభాల్లో అత్యధిక వృద్ధి నమోదు చేసిన బ్యాంక్ ఇదే. 12 పీఎస్‌బీల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లాభంలో మాత్రం 48% తగ్గుదల నమోదైంది.

ఎయిర్‌టెల్ కౌంటర్‌లో రూ.11,227 కోట్ల డీల్

భారతీ ఎయిర్‌టెల్ కౌంటర్‌లో శుక్రవారం భారీ బల్క్ డీల్ చోటు చేసుకుంది. కంపెనీ ప్రమోటర్ సునీల్ మిట్టల్ ఆయన కుటుంబానికి చెందిన ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ఆరు కోట్ల షేర్లను రూ.11,227 కోట్లకు విక్రయించింది. రెండు విడతలుగా ఒక్కో షేరును రూ.1,870.40-1,871.95 మధ్య ఈ షేర్ల అమ్మకాలు జరిగినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	500
వరంగల్	452	గోదావరి	490
చిత్తూరు	513	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	94	అనంతపురం	82
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,27,000 ▲
విజయవాడ	1,04,200 ▲	98,300 ▲	1,18,450 ▼
విశాఖపట్నం	1,04,420 ▲	94,700 ▲	1,27,000 ▲
రాజమండ్రి	1,03,300 ▲	94,700 ▲	1,18,100 ▲
ప్రొద్దుటూరు	1,00,070 ▼	92,690 ▲	1,17,800 ▲
ముంబై	1,00,940 ▲	92,460 ▲	1,14,730 ▼

తెలుగు రాష్ట్రాల్లో రూ. 7,657 కోట్ల రుణాలు

పిరామల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : పిరామల్ ఫైనాన్స్ తెలుగు రాష్ట్రాల్లో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 55 శాఖల ద్వారా వివిధ వర్గాలకు రూ.7,657 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేసినట్టు కంపెనీ మార్కెటింగ్ హెడ్ అరవింద అయ్యర్ తెలిపారు. ఇందులో తెలంగాణ వాటానే రూ.5,000 కోట్ల నుంచి రూ.5,200 కోట్ల వరకు ఉందన్నారు. ఇది తమ మొత్తం రుణ పోర్టుఫోలియోలో పదిశాతమని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో పాటు వ్యక్తిగత, గృహ రుణాలు, ఆస్తులు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై తమ కంపెనీ రిటైల్ రుణాలు ఇస్తుందన్నారు. ఆదాయానికి సంబంధించి సరైన ధ్రువ పత్రాలు లేని వ్యక్తులకూ, కొన్ని షరతులకు లోబడి తాము రుణాలిస్తామని అయ్యర్ చెప్పారు. తామిచ్చే గృహ రుణాలపై వడ్డీ 9.9 శాతం నుంచి 14 శాతం వరకు ఉంటుందన్నారు.

స్టాక్ మార్కెట్ 'బేర్'

80,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో ట్రంప్ సుంకాల పోటు కొనసాగుతోంది. ఈ దెబ్బతో శుక్రవారం సెన్సెక్స్ 765.47 పాయింట్ల నష్టంతో 79,857.79 వద్ద ముగియగా నిఫ్టీ 232.85 పాయింట్ల నష్టంతో 24,363.39 వద్ద క్లోజయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పడిపోయి రూ.440.63 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ గత మూడు నెలల్లో ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. గత ఆరు వారాల నుంచీ ఈ రెండు కీలక సూచీలు నష్టాల్లో నడుస్తున్నాయి. కొవిడ్ తర్వాత సూచీలు వరుసగా ఇన్ని వారాలు నష్టాలతో ముగియడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు కారణంగా ఎఫ్‌పీఐలు శుక్రవారం సైతం పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగాయి. దీంతో రియల్టీ, మెటల్, టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. అయితే నిఫ్టీకి 24,200-24150 మధ్య గట్టి మద్దతు కనిపిస్తోంది. ఆ స్థాయిని కూడా బ్రేక్ చేస్తే నిఫ్టీ 23,750 పాయింట్లకు కూడా పడిపోయే ప్రమాదం ఉందని టెక్నికల్ అనలిస్టుల అంచనా.

పసిడి ధర మరింత పైకి : స్టాక్ మార్కెట్ పతనంలో పసిడి ధర శుక్రవారం మరింత జోరందుకుంది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి బంగారం రూ.800 లాభంతో రూ.1,03,420కు చేరి సరికొత్త రికార్డు సృష్టించింది. కిలో వెండి రూ.1,000 పెరిగి రూ1.15 లక్షల వద్ద ముగిసింది. గత ఐదు రోజుల్లోనే దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.5,800, కిలో వెండి ధర రూ.5,500 పెరిగాయి.

కోరమాండల్ గూటికి ఎన్ఏసీఎల్

న్యూఢిల్లీ : నాగార్జునా గ్రూప్ కంపెనీ ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ యాజమాన్యం చేతులు మారింది. ఈ కంపెనీ ఈక్విటీలో 53 శాతం వాటా కొనుగోలు పూర్తి చేసినట్టు మురుగప్ప గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తెలిపింది. దీంతో ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కొనుగోలు కోసం, కోరమాండల్ ఇంటర్నేషనల్ త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. వ్యవసాయ క్రిమి సంహారక మందుల మార్కెట్‌లో తమ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలన్న దీర్ఘకాలిక లక్ష్యానికి ఈ కొనుగోలు దోహదం చేస్తుందని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ ఒక ప్రకటనలో తెలిపారు.



గోవా రాజ్‌భవన్‌లో గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిసిన బీసీ సంఘాల ప్రతినిధులు

గోవా గవర్నర్ అశోక్ తో బీసీ నేతల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఓబీసీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు బీసీ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఓబీసీ మహాసభ సందర్భంగా గోవా వెళ్లిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు రాజ్ భవన్‌లో అశోక్ గజపతిరాజుని కలిసి బీసీల డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బీసీలకు చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ల కల్పన, మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటా, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరినట్లు తెలిపారు.

బీసీసీఐ గ్రాంట్లు ఎలా ఖర్చు చేశారు ?

- హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్‌ను ప్రశ్నిస్తున్న సీఐడీ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘన, హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో అరెస్టయిన హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్ రామ్‌చందర్‌ను కస్టడీలోకి తీసుకున్న సీఐడీ ఆయన్ను వివిధ కోణాల్లో విచారిస్తోంది. దేవరాజ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి సీఐడీ కార్యాలయానికి శుక్రవారం తీసుకొచ్చిన అధికారులు న్యాయవాది సమక్షంలో ప్రశ్నించారు. బీసీసీఐ నుంచి గ్రాంట్లు రూపంలో వచ్చిన నిధులను ఎలా ఖర్చు చేశారు, హెచ్‌సీఏ ఖాతాల నుంచి బదిలీ అయిన నగదుకు సంబంధించిన వివరాలు, జగన్‌మోహన్ రావు దాఖలు చేసిన ఫోర్జరీ డాక్యుమెంట్లకు సంబంధించి దేవరాజ్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది.

కూనంనేని ఎన్నికపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత తెలంగాణ హైకోర్టులో ఎన్నికను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారని, ఉభయ పక్షాల వాదనలు విన్న హైకోర్టు.. జూన్ 9న పిటిషన్‌ను కొట్టివేసిందని గుర్తు చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా.. గురువారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌బాగ్చీలు అడ్మిషన్ దశలోనే పిటిషన్ డిస్మిస్ చేశారని తెలిపింది.

సీఎం రమేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమని తప్పుడు ప్రచారం
- సీఎం రమేశ్‌పై ఠాణాలో బీఆర్‌ఎస్ నేత మన్నె ఫిర్యాదు

ఏపీ ఎంపీ సీఎం రమేశ్‌పై బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో తిరగాలన్నా, మంచిగా ఉండాలన్నా, ఆయన తన నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమవుతుందంటూ ఏపీ ఎంపీ సీఎం రమేశ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేశ్‌పై శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన సీఎం రమేశ్.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులకు భయపడి, మనుగడ కాపాడుకోవడానికే బీజేపీలో ఆశ్రయం పొందారని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎప్పుడో వచ్చిన బెయిల్ సంగతి ఇప్పుడు చెబుతూ కేటీఆర్‌పై అవాకులు, చవాకులు పేలడం సీఎం రమేశ్‌కు తగదన్నారు.

కల్వకుంట్ల కుటుంబానికి రేవంత్ ఫీవర్: ఆది శ్రీను

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కుటుంబానికి రేవంత్ రెడ్డి ఫీవర్ పట్టుకుందని.. రేవంత్ పేరు చెబితేనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవితలకు చలి జ్వరంతో వణుకు పుడుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌కు కేసీఆర్ ఫోబియా పట్టుకుందని కేటీఆర్ అనడం హాస్యాస్పదంగా ఉందని.. అసలు రేవంత్‌కు ప్రజా సంక్షేమం గురించి ఆలోచించడానికే సమయం సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ గజినీగా పరిణమించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఈ డిసెంబరే కాదు.. ఇంకా పది డిసెంబరులు వచ్చినా తెలంగాణకు సీఎంగా రేవంతే ఉంటారని చెప్పారు. గాంధీభవన్‌లో చేపట్టిన ప్రజాప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముఖాముఖిలో ఆయన పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు.

త్వరలోనే బీఆర్‌ఎస్ ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

యువత, మేధావులు, విద్యావేత్తలను కూడా బీజేపీలో చేరాలని ఆహ్వానిస్తున్నట్లు రాంచందర్‌రావు చెప్పారు. కాగా, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో బీజేపీలోకి వెళ్లాలనుకున్న మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేల చేరిక పలు కారణాల వల్ల వాయిదా పడినట్లు తెలిసింది. కమలం అధిష్ఠానంతో చర్చలు సఫలీకృతమైతే అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహాం కూడా బీజేపీ గూటికి వెళతారనే ప్రచారం బలంగా జరుగుతోంది. ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఉన్న మరో మాజీ ఎమ్మెల్యే కూడా కాషాయ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

దర్యాప్తు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి.. అలా రాస్తే విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధం

- సీబీఐ విచారించే అవకాశం ఉంటే.. ఈ పాటికే కేసీఆర్‌ను జైల్లో వేసేవాళ్లం
- రేవంత్, హరీశ్ ఫోన్లూ ట్యాపింగ్
- సొంత కూతురు ఫోన్‌నూ వదల్లేదు..
- జడ్జిల ఫోన్లను సైతం ట్యాప్ చేశారు
- సీఎం రేవంత్ స్టేట్‌మెంట్ అడిగే అధికారం సిట్‌కు ఉందా?: సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో తొలి బాధితుడిని తానేనని.. తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆరోపించారు. ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) వెల్లడించిన విషయాలు దిగ్భ్రాంతికి గురిచేశాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 6500 మంది ఫోన్లు ట్యాప్ చేసిందని, తనతోపాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు, నాటి మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫోన్లను సైతం ట్యాప్ చేశారని చెప్పారు. కేసీఆర్ కూతురు కవిత, అల్లుడి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కేసును సీబీఐకి అప్పగించకుంటే ఇప్పుడు జరిగేదంతా తూతూ మంత్రమేనని.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య జరిగిన ఒప్పందమేనని భావించాల్సి ఉంటుందని సంజయ్ చెప్పారు. రాష్ట్రంలో సీబీఐ నేరుగా విచారణ జరిపే అవకాశం ఉంటే ఈ పాటికి కేసీఆర్, ఆయన కొడుకును జైల్లో వేసేవాళ్లమని అన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రంలో సీబీఐ నేరుగా విచారణ జరిపే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. కాబట్టి ఫోన్ ట్యాపింగ్ కేసులో సీబీఐ, ఈడీ విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే.. విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. శుక్రవారం దిల్‌కుశ్ అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకుని ప్రభాకర్‌రావు బృందం కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకుందని, ఆ మొత్తం ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుపుతున్న సిట్ పరిధి ఎంత అని ఆయన ప్రశ్నించారు. నాటి ఎస్‌ఐబీ అధికారులు జడ్జిల ఫోన్లు కూడా ట్యాప్ చేశారనడానికి ఆధారాలున్నాయని, వారిని సిట్ పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తుందా? సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించే అధికారం సిట్‌కు ఉందా? అని సంజయ్ ప్రశ్నించారు. డబ్బుల వ్యవహారంలో నిజాలు నిగ్గు తేల్చేందుకు ఈడీకి లేఖ రాస్తే తక్షణమే విచారణ చేయించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. గ్రూప్-1 పేపర్ లీక్ కేసు విచారించిన జడ్జి ఫోన్లను సైతం కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందని ఆరోపించారు. మావోయిస్టుల పేర్లు చెప్పి తనతోపాటు రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లను కూడా ట్యాప్ చేశారని సంజయ్ వెల్లడించారు. కేసీఆర్, కేటీఆర్, సంతోష్ మినహా బీఆర్‌ఎస్ నేతల ఫోన్లన్నీ ట్యాప్ అయ్యాయని చెప్పారు. ట్యాపింగ్ కేసులో రేవంత్‌రెడ్డి ఎందుకు విచారణకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ తానా అంటే రేవంత్ తందానా అంటున్నారని.. అందుకే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను అరెస్ట్ చేయడం లేదని చెప్పారు. సీఎం కూడా వెంటనే సిట్ విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాటి సీఎం కేసీఆర్, ఆయన కొడుకు ట్విటర్ టిల్లును పిలిచి విచారించే దమ్ము సిట్‌కు ఉందా? అని నిలదీశారు. సిట్ విచారణ పేరుతో జరుగుతున్న డ్రామాలు ఆపాలని, సీబీఐ విచారణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం వావివరసలు మర్చిపోయి ఫోన్లు ట్యాప్ చేసిందన్నారు. తన ఫోన్లతోపాటు కుటుంబ సభ్యులు, స్టాఫ్, పని వాళ్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని.. ఇలాంటి నీచులను ఏమనాలో తెలియడం లేదని సంజయ్ అన్నారు. కేసీఆర్ పాలనలో అందరూ వాట్సాప్ కాల్ మాత్రమే మాట్లాడుకునే వాళ్లు. చివరకు బిచ్చమెత్తుకునే వాళ్లు కూడా మామూలు కాల్ మాట్లాడే వారు కాదంటే బీఆర్‌ఎస్ పాలనలో ఎంతటి ఘోరాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు' అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తన దగ్గరున్న సమాచారం, ఆధారాలన్నీ సిట్‌కు అందించానని చెప్పారు.



ఖైరతాబాద్ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

వాళ్లకు ఉరిశిక్ష వేసినా సరిపోదు..

మావోయిస్టు, టెర్రరిస్టుల కార్యకలాపాలను తెలుసుకుని, నియంత్రించడానికి ఏర్పాటు చేసిన ఎస్‌ఐబీని అడ్డుపెట్టుకుని కేసీఆర్, ఆయన కొడుకు కలిసి రాజకీయ నాయకులందరి ఫోన్లను ట్యాప్ చేశారని సంజయ్ చెప్పారు. ఎస్‌ఐబీ అడ్డాగా రాజకీయ నాయకులు, వ్యాపారులు, సినిమా వాళ్లు, ప్రొఫెసర్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. గ్రూప్-1 పేపర్ లీక్‌కు సంబంధించి ఆందోళన కార్యక్రమం గురించి ఫోన్లో మాట్లాడుకుంటే.. ట్యాప్ చేసి విన్న పోలీసులు తన ఇంటికొచ్చి అడ్డుకున్నారని తెలిపారు. గ్రూప్-1 కేసును విచారించిన జడ్జి ఫోన్‌నూ ట్యాప్ చేశారని, దీన్నిబట్టే కేసీఆర్ ఎంతటి నీచానికి పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చని సంజయ్ అన్నారు. ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావుకు ఉరిశిక్ష సరిపోదని చెప్పారు. చేసిన పాపాలు తలుచుకొని కుళ్లి కుళ్లి ఏడ్చేలా శిక్ష విధించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పట్టుకున్న డబ్బులేమయ్యాయి?

రాజకీయ నాయకులే కాదు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి వేల కోట్ల రూపాయలు దండుకున్నారని బండి సంజయ్ ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు పట్టుకున్నారని.. మరికొందరు కాంగ్రెస్ నేతల వద్ద వందల కోట్ల రూపాయలు పట్టుకున్నారని చెప్పారు. ట్యాపింగ్‌తో రూ.20 కోట్లు పట్టుకుంటే అందులో రూ.18 కోట్లు తినేసి.. విచారణలో రూ.2 కోట్లే చూపేవాళ్లని విమర్శించారు. ఆ సొమ్ములన్నీ ఏమయ్యాయో ఎవరికీ తెలియదని, దర్యాప్తులో ఈ విషయాన్ని తేల్చాలని అన్నారు. ఆ పైసలన్నీ ట్యాపింగ్ ముఠా తినేసిందా? ట్విటర్ టిల్లు తిన్నాడా? అన్నది తేల్చాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, ప్రభాకర్ రావు చేసిన వసూళ్లపై విచారణ జరపాలన్నారు.

కేసీఆర్ కుటుంబ అవినీతి కాంగ్రెస్‌కు ఏటీఎం..

కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏ విధంగా ఏటీఎంలా మారిందో కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి అలాగే మారిందని సంజయ్ ఆరోపించారు. ఒక్కొక్క కుంభకోణానికి ఢిల్లీలో రేటు కుదురుతుందని, అన్ని కేసుల్లోనూ మూటలు అప్పజెబుతున్నారని చెప్పారు. ఇక్కడ విచారణ చేస్తామంటూ కమిషన్‌లు ఏర్పాటు చేస్తున్నారని.. విచారణ పూర్తి కాకముందే కేసీఆర్ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని కలిసి వందల కోట్లు అప్పజెబుతున్నారని పేర్కొన్నారు.

లీగల్ నోటీసులిచ్చేందుకు కేటీఆర్‌కు సిగ్గుండాలి: సంజయ్

అనైతిక పనులు చేస్తూ లీగల్ నోటీసులు ఇస్తానంటున్నందుకు ట్విట్టర్ టిల్లుకు సిగ్గుండాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కేటీఆర్ ఓ పిరికిపంద అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానంటూ కేటీఆర్ చేసిన హెచ్చరికపై సంజయ్ స్పందించారు. లీగల్ నోటీసులు ఇస్తానని గతంలో కూడా బెదిరించి పారిపోయారని సంజయ్ ఎక్స్ వేదికగా గుర్తుచేశారు.

కేసీఆర్‌కు రేవంత్ క్లీన్ చిట్..

ఫోన్ ట్యాపింగ్ అడ్డుపెట్టుకొని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు దోచుకుంటే.. ఆ సొమ్ములో వాటా కోసమే రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ గురించి కేసీఆర్ చెప్పిందే రేవంత్‌రెడ్డి చెబుతున్నారని.. కేసీఆర్‌కు క్లీన్ చిట్ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. అందుకే ఆయనను అరెస్ట్ చేయబోమని చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనని.. విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబంపై ఏ చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ఈ ప్రభుత్వంపై నమ్మకం లేదు కాబట్టే సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో లీగల్ సెల్ నాయకులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఫోన్ ట్యాపింగ్ చేస్తలేరా? అని మాట్లాడుతున్నారని.. దేశంలో చాలా రాష్ట్రాల్లో బీజేపీ, కూటమి పాలన కొనసాగుతోందని, ఈ విషయంపై అక్కడి ప్రతిపక్షాలు చిన్న ఆరోపణ కూడా చేయలేదని గుర్తుచేశారు.

అతిథి గృహం వరకు ర్యాలీ.. ట్రాఫిక్ జామ్

సిట్ విచారణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి బండి సంజయ్ తన నివాసం నుంచి ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో ఉన్న హనుమాన్ ఆలయం వరకు కాన్వాయ్‌తో వచ్చిన ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఖైరతాబాద్ చౌరస్తా, రాజ్‌భవన్ రహదారి మీదుగా వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాదయాత్రగా దిల్‌కుశ్ అతిథి గృహం వరకు వెళ్లారు. దీంతో పంజాగుట్ట, ఖైరతాబాద్, తాజ్‌కృష్ణ రహదారి, ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, లకడీకాపూల్ మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విచారణ అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సంజయ్ బయటికి వచ్చినప్పుడు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

సంజయ్‌కు 48 గంటల గడువు!

- ఫోన్ ట్యాపింగ్‌పై వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి..
- క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు ఈడుస్తా: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా పని చేయడమంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని అన్నారు. మీడియా హెడ్‌లైన్లు, చీప్ పబ్లిసిటీ కోసం సంజయ్ వీధి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని, లేకుంటే 48 గంటల్లోపు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు లీగల్ నోటీసు పంపిస్తున్నానని, 48 గంటలలో స్పందించకుంటే కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. కేంద్రం ఆమోదించక ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబరాలు ఎందుకు చేసుకుందో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న కాలయాపనను పక్కనబెట్టి కామారెడ్డి డిక్లరేషన్‌లోని ఇతర హామీలను రాష్ట్ర ప్రభుత్వంతో అమలు చేయించాలన్నారు.

ఆ నంబరు అమిత్ షాదే!

(మొదటిపేజీ తరువాయి)

అందించినవారి నంబర్లు కూడా వెల్లడించిన సిట్ అధికారులు.. వారి ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు సంజయ్‌కు తెలిపారని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పోషించిన ప్రణీత్‌రావుకు ఒక కోడ్ ఇచ్చారని.. దాంతో ఆయన రోజూ సంజయ్‌తోపాటు వ్యక్తిగత సిబ్బంది ఫోన్‌లు ట్యాపింగ్ చేసి, ముఖ్యమైన సమాచారాన్ని నాటి ప్రభుత్వ పెద్దలకు తెలిపేవారని విచారణ సందర్భంగా సిట్ వెల్లడించినట్లు సమాచారం.

సంజయ్ వ్యక్తిగత సిబ్బందినీ..

సిట్ అధికారులు తొలుత సంజయ్ వ్యక్తిగత సిబ్బందిని కూడా విచారించారు. సుమారు 45 నిమిషాల పాటు వారిని ప్రశ్నించారు. పసునూరు మధు, బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, పోగుల తిరుపతి కాల్ రికార్డింగ్ డేటాను వ్యక్తిగతంగా ముందుంచి, ఆయా ఫోన్ నంబర్లు కలిగిన నాయకులతో మాట్లాడింది వాస్తవమేనా? అని ప్రశ్నించి, నిర్ధారించుకున్నారు. 2022 ఆగస్టు నుంచి 2023 మే చివరి వరకూ సీడీఆర్‌ను వారి ముందు ఉంచారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అనుమానం వచ్చిందా? అని ప్రశ్నించగా.. వచ్చిందని వారు సమాధానమిచ్చారు. కాగా, సంజయ్ వ్యక్తిగత సిబ్బంది కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు తాజాగా వెల్లడైంది.

సిట్‌తో తేలదు..!

ఫోన్ ట్యాపింగ్ కేసు సిట్‌తో తేలదని, సీబీఐకి ఇస్తేనే కొలిక్కి వస్తుందని కొంత మంది సీనియర్ పోలీసు అధికారులు, న్యాయ నిపుణులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి స్పష్టం చేసినట్లు సమాచారం. సిట్ విచారణ సందర్భంగా సంజయ్ కొందరు సీనియర్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో సిట్ పరిధి, ట్యాపింగ్ కేసు తీవ్రతపై చర్చించినట్లు తెలిసింది. 'టెలికం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను ఉల్లంఘించి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపింది. ఇందులో టెలికం రెగ్యులేటరీ అథారిటీని కూడా విచారణకు పిలవాలి. ఇది పూర్తిగా కేంద్రం పరిధిలోని అంశం. ఎస్‌ఐబీ చీఫ్‌గా ఐజీ స్థాయి అధికారి ఉండాలి. కానీ, అప్పటికే పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావు ఐజీగా కొనసాగుతున్నారని కేంద్ర హోంశాఖకు తప్పుడు సమాచారమిచ్చి ఎస్‌ఐబీ చీఫ్‌గా నియమించారు. ఇది పూర్తిగా నిబంధనల ఉల్లంఘనే' అని పోలీసు అధికారులు తెలిపినట్లు సమాచారం. మరోవైపు మావోయిస్టుల పేరు చెప్పి రాజకీయ ప్రముఖులు, సినీ తారలు, వ్యాపారుల ఫోన్ నంబర్లను ట్యాప్ చేసి.. అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, ఆ లావాదేవీల వివరాలు తెలియాలంటే ఈడీతో విచారణ జరపాలని వారు పేర్కొన్నట్లు తెలిసింది.



రసాయన ఎరువులకు 'నానో' తోడు

పోషకాలు ఎక్కువ.. పర్యావరణానికి మేలు.. రసాయన ఎరువులతో నష్టాలే ఎక్కువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో యూరియాకు అధిక డిమాండ్ ఉంది. ఈ సమస్య పరిష్కారానికి నానో యూరియా వాడటం మంచిదని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే పంటల ప్రాథమిక దశలో 75 శాతం వరకూ రసాయన యూరియా వాడుకోవచ్చని, చివరి దశలో 25 శాతం వరకూ నానో యూరియా వాడుకోవాలని సలహా ఇస్తున్నారు. కాగా, పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. అందుకే రసాయన యూరియానే కావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే పంట ఆరోగ్యం, నాణ్యమైన ఉత్పత్తికి పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులు ఎలా ఉపయోగపడతాయో నానో యూరియా కూడా అంతేనని అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంటలకు పోషకాలు అందించడంలో రసాయన ఎరువులకు దీటుగా నానో ఎరువులు పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. అందుకే నానో సాంకేతికతతో తయారైన ద్రవ రూప యూరియా, డీఏపీని ప్రోత్సహిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో నానో ఉత్పత్తులపై అంతగా ప్రచారం లేదు. వాటిని తమకు బలవంతంగా అంటగడుతున్నారని ఇటు డీలర్లు, అటు రైతులు వాపోతున్నారు.



రసాయన యూరియాతో నష్టాలు

సంప్రదాయ యూరియా వల్ల కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. పోషకాల సమతుల్యతకు, నీటి కాలుష్యానికి దారి తీస్తుంది. యూరియా నత్రజని వాయువుగా మారి వాతావరణంలోకి విడుదలై పర్యావరణానికి హాని చేస్తుందని చెప్తున్నారు. రసాయన యూరియా అధిక వాడకం వల్ల పొటాష్, పాస్పరస్ లభ్యతను తగ్గిస్తుంది. చిన్న మొక్కల ఎదుగుదలకు హాని చేస్తుంది. నత్రజనిని వేగంగా విడుదల చేసే సంప్రదాయ యూరియా కంటే.. నానో యూరియా బెటర్ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నానోతో ప్రయోజనం

నానో యూరియా మొక్కలకు పోషకాలు సమర్థంగా అందిస్తుంది. అధిక దిగుబడికి దారి తీస్తుంది. పంటల్లో పోషక లోపాలను సరి చేస్తుంది. మెరుగైన ఆహార నాణ్యతకు దోహదం చేస్తుంది. రసాయన ఎరువుల వినియోగ అవసరాన్ని తగ్గిస్తుంది. తక్కువ కార్బన్ విడుదలతో పర్యావరణానికి అనుకూలంగా ఉంటుంది. అధిక రసాయన ఎరువుల వల్ల దెబ్బతినే నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని చెబుతున్నారు. పంట పోషకాల సామర్థ్యాన్ని పెంచి, మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుంది. మట్టిపై రసాయన భారాన్ని తగ్గించి, వృథా కాకుండా ఉంటుంది. నానో ఎరువులు నిల్వ చేసుకోవడం, రవాణా చేయడం చాలా సులభం. నీరు, మట్టిలో కలుషితాన్ని తగ్గించి, పంట దిగుబడుల్లో మెరుగుదల కల్పిస్తుంది. గ్లోబల్ వార్మింగ్ సమస్యను పరిష్కరించడంలో సహాయపడుతుంది. బస్తా యూరియా సబ్సిడీ పోను గరిష్ఠ చిల్లర ధర రూ.266.50. అర లీటర్ నానో యూరియా ధర రూ.225. ఇది 45కిలోల యూరియా బస్తాకు సమానం. 2-4 మిల్లీమీటర్ల నానో యూరియాను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి రెండుసార్లు పిచికారి చేయొచ్చు. రసాయన యూరియాలో 30-40% పోషకాలు ఉంటే నానో యూరియాలో 80-90% ఉంటాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

20-25% నానో యూరియా వేయొచ్చు

ప్రస్తుతం రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి వంటి పంటల్లో సిఫారసుకు మించి నత్రజని ఎరువులు వాడుతున్నారు. దీనివల్ల చీడపీడలు పెరగడం, సాగు ఖర్చు పెరుగుతోంది. విచక్షణారహితంగా యూరియా వంటి రసాయన ఎరువులు వాడకం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నానో ఎరువులు కొద్ది మేర పని చేస్తున్నందున రైతులు 20-25 శాతం రసాయన ఎరువులు తగ్గించి, ఆమేరకు నానో యూరియా వాడితే మంచిది. రసాయన యూరియా 75%, నానో యూరియా 25% వేయొచ్చని రైతులకు సిఫారసు చేస్తున్నాం. పంట ప్రాథమిక దశలో కాకుండా.. ఆఖరి దశలో నానో యూరియా వాడితే కొంత ఫలితం ఉంటుంది. నానో డీఏపీపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది.

- పీవీ సత్యనారాయణ,
రీసెర్చ్ డైరెక్టర్, రంగా అగ్రి వర్సిటీ

యూరియా కోసం ఇక్కట్లు



నంగునూరు/మద్దూరు/జహీరాబాద్/బెజ్జంకి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కోసం రైతులు క్యూ కడుతున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకు సహకార సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారక ముందే వచ్చినా అక్కడికి చేరుకున్న రైతులు తమ వంతు కోసం చెప్పులను క్యూలో పెట్టారు. తెల్లవారక ముందే వచ్చినా ఒక్క బస్తా కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు మండలంలోనూ స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం ఉదయమే రైతులు యూరియా కోసం క్యూ కట్టారు. ఇదే జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎదుట రైతులు యూరియా కోసం బారులు దీరారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో యూరియా కోసం రైతులు దుకాణాల వద్ద కూడా క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆడబిడ్డలకు ఆర్థిక సాధికారతే అసలైన రక్షా బంధన్: సీఎం రేవంత్

» ప్రజలకు మంత్రి పొన్నం,పీసీసీ చీఫ్ రాఖీ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డలకు ఆర్థిక సాధికారత కల్పించడమే అసలైన రక్షా బంధన్ అని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. మహిళా సాధికారత, వారిని కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలంతా భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని.. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో రాజీపడేది లేదని సీఎం పేర్కొన్నారు. ఇటు మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇంటి పట్టా అందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పేదోడి కళ్లల్లో ఆనందం చూడాలి:పొంగులేటి

హనుమకొండ టౌన్, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పేదోడి కళ్లల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆయన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదల ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం గత ప్రభుత్వంలో ప్రజాధనాన్ని ఖర్చు చేసి పేదల కల, ఆశలను నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 లక్షల పాత కార్డులు ఉండగా, ఆరు లక్షల కొత్తగా రేషన్ కార్డులు అందించామన్నారు. శ్రావణ శుక్రవారం రోజు 592 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

ఆదివాసీల మీద కేంద్రం దాడి: మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజనుల మీద కేంద్ర ప్రభుత్వం రకరకాల రూపాల్లో దాడులు చేస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం అడవి బిడ్డల హక్కులు కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో ఆద్యకళ మ్యూజియం వారి ఆధ్వర్యంలో 'ఆదివాసీ ఉరుములు - మెరుపులు' పేరుతో నిర్వహించిన మూలవాసీల కాంతి దీపాల ప్రదర్శనను సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజన, బహుజన శ్రామికుల కళా సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు కార్యక్రమ నిర్వాహకుడు ప్రొ. జయధీర్ తిరుమల రావు చేస్తున్న కృషి అసాధారణమైనదంటూ కొనియాడారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో ఆద్యకళ ప్రదర్శన ఏర్పాటుకు తామంతా అండగా నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రజా గాయని విమలక్క, జయరాజ్, సామాజిక కార్యకర్తలు పృథ్వీరాజ్, అపర్ణ తోట, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పసునూరి రవీందర్‌తో పాటు వివిధ కళా రూపాలకు చెందిన సుమారు 80 మంది కళాకారులు పాల్గొన్నారు.

టీవీవీపీలో 1,690 పోస్టుల భర్తీ:దామోదర

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)లో 1,690 డాక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో డాక్టర్ల సంఘాలతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీవీవీపీని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా త్వరలో అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. అందుకనుగుణంగా డాక్టర్ల పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. టీవీవీపీలో క్యాడర్ స్ట్రెంత్ పెంపుపై కమిషనర్ డా.అజయ్ కుమార్‌తో మంత్రి చర్చించారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించినందుకు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

తొలి-10 బిజినెస్ స్కూల్స్‌లో అంబేడ్కర్ వర్సిటీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ విద్యా కోర్సులకు సంబంధించిన సమాచారాన్ని ప్రచురిస్తున్న అకడమిక్ ఇన్‌సైట్స్ మ్యాగజైన్ భారత్‌లోని తొలి 10 బిజినెస్ స్కూళ్లల్లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని గుర్తించడం గొప్ప విషయమని వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) కోర్సులో నాణ్యమైన విద్యను అందిస్తున్న సంస్థగా వర్సిటీకి గుర్తింపు వచ్చిందని తెలిపారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అండ్ అడ్మినిస్ట్రేషన్, కిమ్స్ స్కూల్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, ఒవైసీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ తదితర సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని ఈ కోర్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి ఎంబీఏ(హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) కోర్సు ప్రవేశ పరీక్షను ఆగస్టు 24న నిర్వహిస్తున్నామని, 14లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



తిరుమలలో జస్టిస్ ప్రవీణ్ కుమార్

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ ప్రవీణ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శనం చేసుకున్నారు. రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

కాళేశ్వరం కమిషన్ నివేదిక మాకూ ఇవ్వండి

» ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేసిన హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను తమకు కూడా ఇవ్వాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును కలిసి విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తరఫున, హరీశ్ రావు తరఫున రెండు వినతి పత్రాలను సీఎస్‌కు అందజేశారు. సీఎస్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి ఉన్నారు.

జడ్పీల్లో బీసీలు డబుల్!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్‌ల విషయంలో ప్రస్తుతం బీసీల ప్రాతినిధ్యం బాగా తక్కువగా ఉంది. వారికున్న రిజర్వేషన్ల మేరకే వారి ప్రాతినిధ్యం ఉంది. ఉదాహరణకు గత స్థానిక సంస్థల ఎన్నికలు అంటే 2019లో 32 మంది జిల్లా పరిషత్ ఛైర్మన్‌లలో కేవలం ఏడుగురు బీసీ వర్గానికి చెందిన వారు. అంటే సరిగ్గా 23 శాతం మాత్రమే. వారికి కేటాయించిన జిల్లా పరిషత్‌లను మాత్రమే వారు గెలుచుకున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల్లో జనరల్ సీట్లు గెలిచినట్లుగా జిల్లా పరిషత్ స్థానాల్లో గెలవలేకపోయారు. ఇప్పుడు పార్టీపరంగా 42 శాతం కేటాయిస్తే బీసీలకు రెట్టింపు జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలు దక్కుతాయని అంచనా వేస్తున్నారు.

30 నుంచి 55 శాతం వరకు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలుపొందిన వారి శాతాన్ని జిల్లాల వారీగా పరిశీలిస్తే..30 నుంచి 55 శాతం మధ్య ఉంది. నాగర్ కర్నూల్‌లో బీసీ సర్పంచ్‌ల సంఖ్య 26 శాతం ఉండగా, పెద్దపల్లిలో 54.53 శాతంగా ఉంది. అయితే వరంగల్ జిల్లాలో ఈ సంఖ్య మరీ తక్కువగా ఉంది. ఇక్కడ 19.38 శాతం మందే బీసీ సర్పంచులున్నారు. ఎస్టీ రిజర్వేషన్లు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్‌లో 20.29 శాతమే బీసీ సర్పంచ్‌లున్నారు. ఇక ఎంపీటీసీల విషయంలో నాగర్ కర్నూల్‌లో 33.33 శాతం ప్రాతినిధ్యం ఉండగా...పెద్దపల్లిలో 55 శాతం ఉంది. కామారెడ్డిలో 47.45 శాతం, హన్మకొండలో 48.46 శాతం బీసీ ఎంపీటీసీలు గెలిచారు. అదే జడ్పీటీసీల విషయంలో ఆదిలాబాద్‌లో 35.2 శాతం, కరీంనగర్‌లో 40 శాతం, వరంగల్‌లో 45.45 శాతం, హన్మకొండలో 66.66 శాతం బీసీలు గెలిచారు. అయితే ఎస్సీలకు ఎక్కువ స్థానాలు రిజర్వు చేసి....బీసీలకు 15 శాతం జడ్పీటీసీ స్థానాలు మాత్రమే రిజర్వు చేసిన నాగర్‌కర్నూల్‌లో 20 శాతం వరకే బీసీ జడ్పీటీసీలున్నారు.

రిజర్వేషన్ల కంటే రెట్టింపు గెలుపు

మరోవైపు గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 23 శాతమే రిజర్వేషన్లు కల్పించినా....ఆయా వర్గాలు అంతకంటే భారీగానే గెలుపొందారు. చాలా జిల్లాల్లో రిజర్వు చేసిన స్థానాల కంటే రెట్టింపు సంఖ్యలో గెలిచారు. మంచిర్యాల జిల్లాలో 49 గ్రామ పంచాయతీలను బీసీలకు కేటాయించగా...అవి కాకుండా మరో 83 జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు పోటీచేసి గెలిచారు. పెద్దపల్లి జిల్లాలో 70 గ్రామ పంచాయతీలను బీసీలకు కేటాయించగా, వాటితో పాటు మరో 77 చోట్ల జనరల్ స్థానాల్లో... ఆదిలాబాద్ జిల్లాలో 47 పంచాయతీలు కేటాయించగా...మరో 48 చోట్ల జనరల్ స్థానాల్లోను విజయం సాధించారు. ఇక హన్మకొండలాంటి జిల్లాలో జడ్పీటీసీలను తీసుకుంటే మొత్తం 12 మందిలో 8 మంది అంటే 66.66 శాతం బీసీలే గెలుపొందారు. ఈ జిల్లాలో ఆ వర్గాలకు కేటాయించిన సీట్లు మూడు కాగా, మరో ఐదు చోట్ల జనరల్ స్థానాల్లో విజయం సాధించారు.

జిల్లా పరిషత్‌లలో ఎంత రిజర్వేషన్లో అంతే

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ఎవరెంతో వారికంత అన్న నినాదం తీసుకుంది. బీసీలకు ఈ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్తోంది. పార్టీపరంగా రిజర్వేషన్లు కేటాయించినా...బీసీలకు భారీగా మేలు జరిగేది ఈ పై స్థాయిలోనే. 2019 ఎన్నికల్లో మొత్తం 32 జిల్లా పరిషత్ ఛైర్మన్ల బీసీలు కేవలం ఏడు మందే. కామారెడ్డి, జగిత్యాల, మెదక్, గద్వాల, నారాయణపేట, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో మాత్రమే జడ్పీ ఛైర్మన్ పదవులు బీసీలు కైవసం చేసుకున్నారు. దాదాపుగా రిజర్వేషన్ల మేరకే వారికి దక్కాయి. ములుగులో బీసీ జడ్పీ ఛైర్మన్‌గా ఉన్న కుసుమ జగదీష్ చనిపోవడంతో ఆ స్థానంలో ఎస్టీ వర్గానికి చెందిన బడే నాగజ్యోతికి ఛైర్‌పర్సన్‌గా అవకాశం దక్కింది. అంటే ఆ కాలంలో ఆరుగురు జిల్లా పరిషత్ ఛైర్మన్లు, ఛైర్‌పర్సన్లు మాత్రమే బీసీ వర్గాలకు చెందిన వారున్నారు. ఇప్పుడు 42% రిజర్వేషన్లు పార్టీపరంగా ఇచ్చినా ఆయా వర్గాల ప్రాతినిధ్యం ఇక్కడ భారీగా పెరుగుతుంది. దాదాపుగా రెట్టింపు సంఖ్యలో జడ్పీ పీఠాల్లో బీసీలు ఉండే అవకాశాలున్నాయి. ఇలా ఉన్నత స్థానాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగడం వల్ల భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా బీసీలు ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. జడ్పీ ఛైర్మన్ పదవులు లాంచింగ్ ప్యాడ్‌లుగా మారతాయి.

స్థానికంలో బీసీల శాతం ఎంతెంత?

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల్లో బీసీల శాతం ఎంతెంత అని ఒక 10 జిల్లాల్లో ఆంధ్రజ్యోతి పరిశీలించింది. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి.

ఎంపీటీసీలు.. బీసీల సంఖ్య, శాతం

జిల్లా	ఎంపీటీసీ మొత్తం స్థానాలు	బీసీలకు కేటాయించిన స్థానాల్లో గెలిచినవి	జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచినవి	మొత్తం బీసీలు గెలిచినవి	శాతం పరంగా
మంచిర్యాల	130	13	38	51	39.30
పెద్దపల్లి	138	37	39	76	55
సిరిసిల్ల	123	25	17	42	34
కామారెడ్డి	236	63	49	112	47.45
ఆదిలాబాద్	158	04	52	56	35.44
కరీంనగర్	178	46	17	63	35.39
వరంగల్	134	35	18	53	39.55
హన్మకొండ	130	30	33	63	48.46
నాగర్‌కర్నూల్	210	49	21	70	33.33

జడ్పీటీసీలు-బీసీల సంఖ్య, శాతం

జిల్లా	జడ్పీటీసీ మొత్తం స్థానాలు	బీసీలకు కేటాయించిన స్థానాల్లో గెలిచినవి	జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచినవి	మొత్తం బీసీలు గెలిచినవి	శాతం పరంగా
మంచిర్యాల	16	2	4	6	37.5
పెద్దపల్లి	13	4	2	6	46.15
సిరిసిల్ల	12	2	3	5	41.6
కామారెడ్డి	22	5	2	7	31.8
ఆదిలాబాద్	17	0	6	6	35.2
కరీంనగర్	15	4	2	6	40
వరంగల్	11	1	4	5	45.45
హన్మకొండ	12	3	5	8	66.66
నాగర్‌కర్నూల్	20	3	1	4	20

సర్పంచులు.. బీసీల సంఖ్య, శాతం

జిల్లా	సర్పంచు స్థానాలు	బీసీలు స్థానాల్లో	జనరల్	మొత్తం బీసీల గెలుపు	శాతం
మంచిర్యాల	311	49	83	132	42.44
పెద్దపల్లి	263	70	74	144	54.75
సిరిసిల్ల	252	56	24	80	31.74
కామారెడ్డి	526	153	96	249	47.33
ఆదిలాబాద్	468	47	48	95	20.29
కరీంనగర్	313	74	46	120	38.33
వరంగల్	325	48	15	63	19.38
హన్మకొండ	210	46	22	68	32.38
నాగర్‌కర్నూల్	461	83	37	120	26

గుడ్ల టెండర్లలో నచ్చిన ధరలు

» వెల రూ.6.3కి మించొద్దన్న ప్రభుత్వం

» పట్టించుకోని కొందరు కలెక్టర్లు

» పాలమూరు, సంగారెడ్డి, వికారాబాద్ ఆదిలాబాద్‌లో ఎక్కువకు కేటాయింపు



హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోడి గుడ్ల సరఫరా టెండర్లలో సర్కారు నిబంధనలను కొంత మంది కలెక్టర్లు బేఖాతరు చేయడం చర్చనీయాంశమైంది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో ఒక గుడ్డు ధర రూ.6.30కి మించొద్దని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా.. కొందరు కలెక్టర్లు పట్టించుకోలేదు. ప్రస్తుతానికి కొన్ని జిల్లాల్లో తెరచిన టెండర్లను పరిశీలిస్తే.. మహబూబ్ నగర్ జిల్లాలో రూ.6.40.. వికారాబాద్, సంగారెడ్డిలో రూ.6.39.. ఆదిలాబాద్‌లో రూ.6.36, నాగర్‌కర్నూల్‌లో రూ.6.35 చొప్పున కాంట్రాక్టర్లకు అప్పగించారు. కామారెడ్డిలో రూ.6.15, ములుగులో రూ.6.23.. కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాలలో రూ.6.25, జనగామ జిల్లాలో రూ.6.28 చొప్పున కాంట్రాక్టర్లు టెండరు దక్కించుకున్నారు.

డీపీసీలకు టెండర్ల బాధ్యతలు..

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు, ప్రభుత్వ విద్యా సంస్థలకు గుడ్ల సరఫరా కోసం ఇటీవల ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై మధ్యాహ్న భోజన పథకం మినహా.. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అన్ని రకాల గురుకులాలు, కేజీబీవీలు, వసతి గృహాలకు కలిపి టెండర్లు నిర్వహించుకోవాలని పేర్కొంది. కలెక్టర్ ఛైర్మన్‌గా.. విద్యా, సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉండే జిల్లా కొనుగోలు కమిటీ(డీపీసీ)లకు ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటి నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు ప్రతి నెలా 5.38 కోట్ల గుడ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేయడానికి గత నెలలో ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్‌ను సర్కారు జారీ చేసింది. ఆయా జిల్లాల కొనుగోలు కమిటీలు ఈ నెల 21 వరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కాంట్రాక్టర్లు గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇష్టం వచ్చిన ధరలు కోట్ చేయకుండా ఉండటానికి గుడ్డు ధర రూ.6.30కి మించొద్దనే షరతు విధించింది. అయితే.. కొన్ని జిల్లాల్లో కొనుగోలు కమిటీలు దీనిని అతిక్రమించాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. డీపీసీలు జిల్లాల వారీగా ఇప్పటికే టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్లను ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నాయి. భూపాలపల్లి జిల్లాలో ఇంతవరకు టెండర్ ఊసేలేదు.

కేసీఆర్ కుటుంబం అలీబాబా 40 దొంగల ముఠా

కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆ దొంగల ముఠాలో ఒక సభ్యుడు.. ఆయన రూ.వెయ్యి కోట్ల ఆస్తిని రైతులకిచ్చే దమ్ముందా

» అదే ఆస్తి నాకుంటే గంటలో మొత్తం పంచేవాడిని

» రాజకీయంగా ప్రభాకర్‌రెడ్డి ఎంత? ఆయన బతుకెంత?

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ కుటుంబం అలీబాబా 40 దొంగల ముఠా అని, అందులో కొత్త ప్రభాకర్ రెడ్డి ఒక సభ్యుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి ఆరోపించారు. "నీకున్నంత ఆస్తి నాకుంటే గంటలో మొత్తం పంచేవాడిని. నీకున్న రూ.వెయ్యి కోట్ల ఆస్తిని రైతులకు పంచే సత్తా ఉందా..? రాజకీయంగా నువ్వెంత..? నీ బతుకెంత..? నా స్థాయికి నువ్వు ఏమాత్రం పనికిరావు. నీలాగ బీ- ఫామ్ కొనుక్కునే లీడర్‌ను కాదు. నువ్వు ప్యాకేజీ లీడరైతే.. నేను పబ్లిక్ లీడర్‌ను" అని ప్రభాకర్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 30 శాతం కమీషన్ తిన్నందువల్లే హరీశ్‌రావు కాళేశ్వరం వద్దే నిద్రపోయారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దోచుకున్న దొంగలు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తే ఎలా..? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానాను దోచుకోవటంలో కేసీఆర్ కుటుంబం ఆరితేరిందని విమర్శించారు. "కాళేశ్వరం దోపిడీ, ఇసుక దందా, లిక్కర్ దందా, తెల్లవార్లు క్లబ్బులు, పబ్బులు నడిపింది మీరు కాదా..? చెరువులు మింగింది కేసీఆర్ కుటుంబం కాదా..? భూములు లాక్కున్నది ఆ కుటుంబం కాదా..? పెద్దమ్మ గుడి కమాన్ నుంచి మాదాపూర్ వరకు లిక్కర్ దందా చేసింది కేటీఆర్, జోగినపల్లి సంతోశ్ కుమార్ కాదా..? కేసీఆర్ పాలనలో రేవంత్‌రెడ్డిని సతాయించారు. ఆయన బెడ్ రూమ్‌లోకి కూడా పోలీసులను పంపింది మీరు కాదా..? ఇప్పుడు మీ బెడ్‌రూమ్‌లోకి రేవంత్‌రెడ్డి పోలీసులను పంపడం లేదు కదా..? మీ బెడ్ రూమ్‌లలోకి పోలీసులను పంపిస్తే ఆ నొప్పి ఏమిటో మీకు కూడా తెలుస్తుంది" అని జగ్గారెడ్డి అన్నారు.

నీటి పారుదలలో సాదాసీదాగా పదోన్నతులు పూర్తి

» 47 మంది ఈఈలకు ఎస్ఈలుగా ప్రమోషన్

» 123మంది ఏఈఈలకు డీఈఈలుగా పదోన్నతి

» ప్రమోషన్ల ఫైలుపై మంత్రి ఉత్తమ్ సంతకం

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదలశాఖలో అత్యంత కీలకమైన సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ)లుగా పదోన్నతులు, పోస్టింగ్ ప్రక్రియ సాదాసీదాగా జరిగిపోయింది. పైరవీలా అవినీతికి ఆస్కారం లేకుండా 47 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈ)కు ఎస్ఈలుగా పదోన్నతి కల్పించి, పోస్టింగ్ ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకున్నది. వీరితోపాటు 123 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైందని అధికారులు గుర్తు చేశారు. ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతి కల్పించడంతోపాటు పోస్టింగ్ ఇచ్చే ఫైలుపై మంత్రి ఉత్తమ్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత తమ శాఖలో పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని చెప్పారు.

అంతరాష్ట్ర జలవనరుల విభాగం ఎస్ఈగా ఆకెళ్ల సురేష్

అంతరాష్ట్ర జలవనరుల విభాగం ఎస్ఈగా ఆకెళ్ల సురేశ్‌ను, రామగుండం ఎస్ఈగా ఎ.వి.వి.ఎస్.నర్సింహారావు, ఖమ్మం ఎస్ఈగా ఎం.వెంకటేశ్వర్లు, గజ్వేల్ ఎస్ఈగా లక్ష్మణ్, సిద్దిపేట ఎస్ఈగా డి.రవీందర్‌రెడ్డి, గోదావరి బోర్డు ఎస్ఈగా టి.ఎన్.ఎన్.రవికుమార్, కరీంనగర్ ఎస్ఈగా శ్రీనివాసరావు గుప్తా, పోచంపాడు ఎస్ఈగా జగదీశ్, సీఈ సీడీవోలో ఎస్ఈ-1గా ఎం.ఏ. జహీర్, బాన్సువాడ ఎస్ఈగా కె.దక్షిణమూర్తి, మెదక్ ఎస్ఈగా రఘునాథరావు, హైడ్రాలజీ ఎస్ఈగా ఆర్.వెంకట రమణ, సీవోటీ ఎస్ఈగా మీర్జా నజీర్ హుస్సేన్, డిప్యూటీ ఈఎన్‌సీ(జనరల్)గా కె.శ్రీనివాస్ తదితరులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఇచ్చంపల్లితోనే బనకచర్లకు చెక్!

అభిప్రాయానికి వచ్చిన ప్రభుత్వం..తొలుత ఇచ్చంపల్లిపై అభ్యంతరాలు

సమీపంలో తుపాకులగూడెం ప్రాజెక్టు.. వరద కట్టడి సాధ్యం కాదని వాదన

బనకచర్ల అనుసంధానం నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిలో మార్పు

హైదరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కట్టి, అక్కడి నుంచి నీటిని తరలించాలనే ప్రతిపాదనపై చర్చించటం కోసం ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సంప్రదింపుల కమిటీ సమావేశం కానుంది. ఈ కమిటీతో పాటు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి కూడా ఛైర్మన్‌గా ఉన్న అతుల్ జైన్ అధ్యక్షతన ఈ భేటీ జరుగనుంది. తాజాగా ఇచ్చంపల్లి రిజర్వాయర్ నుంచే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతిపత్రాన్ని కూడా అందించింది. ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్‌కు ఆమోదం తెలపడం ద్వారా గోదావరి-బనకచర్ల అనుసంధానానికి చెక్ పెట్టినట్లవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కింద 300 టీఎంసీలను తరలించడానికి ఏపీ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలని పట్టుబడుతూ వచ్చిన ఏపీ.. తాజాగా రూటు మార్చింది. బొల్లాపల్లి నుంచి అనుసంధానం చేపట్టాలని కేంద్రానికి నివేదించడమే కాకుండా ఒత్తిడి పెంచుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం జరగనుంది. ఈ భేటీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎన్‌డబ్ల్యూడీఏ ఆహ్వానం పంపింది. వాస్తవానికి, గత కొన్నేళ్లుగా ఇచ్చంపల్లిపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇచ్చంపల్లి నుంచి కేవలం 24 కి.మీ.ల దిగువలోనే తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజీ ఉంది. ఇచ్చంపల్లి నుంచి వరద నీటిని ఆకస్మికంగా విడుదల చేయాల్సి వస్తే.. ఆ వరదను నియంత్రించే పరిస్థితులు ఉండబోవని, రెండు బ్యారేజీల మధ్య కేవలం 24 కి.మీ.ల దూరమే ఉన్నందున ఫ్లడ్‌రూటింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇచ్చంపల్లికి దిగువన దేవాదులకు 38 టీఎంసీలు, సీతారామకు 70 టీఎంసీలు, తుపాకులగూడెంకు 50 టీఎంసీల నీటి వినియోగం ఉందని, ఇచ్చంపల్లి రిజర్వాయర్ కడితే ఈ ప్రాజెక్టుల అవసరాలు తీర్చడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. అయితే, ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధానం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మనసు మార్చుకున్నట్లు సమాచారం. ఏపీకి ముకుతాడు వేయాలంటే ఇచ్చంపల్లి ఒక్కటే మార్గమనే భావనతో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంపై ఆసక్తి నెలకొంది.

రూ.562 కోట్లు రాష్ట్రంలో తోషిబా పెట్టుబడులు

» దీంతో యువతకు 250కి పైగా ఉద్యోగాలు

» గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తెలంగాణ

» ఈ దిశగా ప్రభుత్వం కృషి: మంత్రి శ్రీధర్ బాబు



పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలో తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (టీటీడీఐ)లో కొత్తగా నిర్మించిన కోర్ ప్రాసెసింగ్, సర్జ్ అరెస్టర్ లైన్ సెంటర్లను శుక్రవారం ఆయన మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. ఈహెచ్‌వీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంట్ విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి జపాన్ రాజధాని టోక్యో పర్యటనలో టీటీడీఐతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారని, దీని ప్రకారం రూ.562 కోట్ల పెట్టుబడితో తోషిబా.. తెలంగాణలోని తమ సంస్థల్లో తయారీ సామర్థ్యాన్ని విస్తరించనుందని, ఇందులో భాగంగా ఈ సెంటర్‌లను ప్రారంభించామని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంట్ విస్తరణకు భూమి పూజ చేశామని చెప్పారు. దీంతో మూడేళ్లలో కొత్తగా 250కి పైగా ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. తోషిబా పెట్టుబడులతో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమవుతుందని అన్నారు. తయారీ రంగంలో దేశానికి దిక్సూచిలా మారిన తెలంగాణలో కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని చెప్పారు. కొందరు కావాలని పని గట్టుకొని వాటిని ఉత్తుత్తి ఎంవోయూలు అంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ విమర్శలకు తోషిబా కంపెనీనే దీటైన సమాధానమిస్తుందని అన్నారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ.. జపనీస్ కంపెనీల భాగస్వామ్యంతో రాష్ట్రానికి మరిన్ని కొత్త పెట్టుబడులు వస్తున్నాయని, ఫలితంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

తమిళనాట ద్విభాషా విద్యా విధానమే

- స్పోకెన్ ఇంగ్లీష్ తరహాలో స్పోకెన్ తమిళం
- కేంద్ర ప్రభుత్వ విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా సొంత విధానాన్ని ప్రకటించిన సీఎం స్టాలిన్
- విద్యను మునుపటిలా రాష్ట్ర జాబితాలో చేర్చాలని..
- నీట్ పరీక్షలు రద్దుకు కేంద్రాన్ని కోరతామని వెల్లడి

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ద్విభాషా విద్యా విధానాన్నే కొనసాగిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. స్పోకెన్ ఇంగ్లీష్ తరహాలో స్పోకెన్ తమిళంపై ప్రత్యేక దృష్టి సారించనున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డీఎంకే ప్రభుత్వం.. దానికి ప్రత్యామ్నాయంగా రిటైర్డ్ జడ్జి డి. మురుగేశన్ నాయకత్వంలో 14 మంది సభ్యులతో కూడిన కమిటీతో నూతన విద్యావిధానాన్ని రూపొందించింది. ఆ విద్యావిధానాన్ని శుక్రవారం ఉదయం చెన్నైలో నిర్వహించిన సభలో సీఎం విడుదల చేశారు. ఈ విద్యావిధానంలోని ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలో ద్విభాషా విద్యావిధానాన్నే కొనసాగించనున్నట్టు సీఎం స్టాలిన్ ప్రకటించారు. విద్యను మునుపటిలా రాష్ట్ర జాబితాలో చేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. అలాగే, తమ నూతన విద్యా విధానం ప్రకారం నీట్ పరీక్షలను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరతామన్నారు. అదే సమయంలో నీట్ పరీక్షల కోసం శిక్షణ సంస్థలు చేస్తున్న అసత్య ప్రచారాలపై నిషేధం విధించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తమిళనాట ప్లస్-1 (11వ తరగతి) పబ్లిక్ పరీక్షలను కూడా రద్దు చేస్తున్నట్టు స్టాలిన్ ప్రకటించారు. అలాగే, సీబీఎస్ఈ, స్వయంప్రతిపత్తి కలిగిన కళాశాలల్లో విపరీతంగా పెంచుతున్న ఫీజులను క్రమబద్ధీకరించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎంజీఆర్, అన్నా, తమిళ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నూతన విద్యావిధానంలో ప్రతిపాదించినట్టు స్టాలిన్ తెలిపారు.

జబల్‌పూర్ భూగర్భంలో బంగారు కొండ!

- 100 హెక్టార్లలో లక్షల టన్నుల పసిడి నిల్వలు
- మధ్యప్రదేశ్‌లో గుర్తించిన జీఎస్ఐ శాస్త్రవేత్తలు



న్యూఢిల్లీ, ఆగస్టు 8: మధ్యప్రదేశ్ రాష్ట్రం దశ తిరిగింది. ఆ రాష్ట్రంపై కనక వర్షం కురవనుంది. ఇనుప ఖనిజానికి నెలవైన ఆ రాష్ట్రంలోని జబల్‌పూర్ జిల్లాలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)కు చెందిన జియాలజిస్టులు బంగారం నిక్షేపాలను గుర్తించారు. గ్రాములు, కిలోల్లో కాదు.. టన్నుల కొద్దీ బంగారం నిల్వలను కనుగొన్నారు. జబల్‌పూర్ జిల్లాలోని మహాగ్వాన్ కియోలరి ప్రాంతంలో ఏకంగా 100 హెక్టార్ల భూముల్లో లక్షల టన్నుల పసిడి నిల్వలు ఉన్నట్టు కనిపెట్టారు. ఖనిజ నిక్షేపాల కోసం ఆ ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో భాగంగా చేసిన మట్టి నమూనా పరీక్షలు, రసాయన విశ్లేషణల ద్వారా పసిడి నిల్వలపై స్పష్టమైన అంచనాకు వచ్చామని జీఎస్ఐ శాస్త్రవేత్త ఒకరు జాతీయ మీడియాకు చెప్పారు. ఆ భూముల్లో బంగారంతోపాటు రాగి, మరిన్ని విలువైన లోహాలు కూడా ఉన్నాయని చెప్పారు. మహాగ్వాన్ కియోలరి ప్రాంతంలో ఇప్పటికే పెద్ద ఎత్తున ఇనుము, మాంగనీసు నిల్వలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి వెలికితీసిన ఇనుము, మాంగనీసు, లాటిరైట్, సున్నపురాయితోపాటు సిలికా తదితర ఖనిజాలు చైనా సహా అనేక దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అదే ప్రాంతంలో ఇప్పుడు బంగారం నిల్వలు ఉన్నాయని తేలడంతో రాబోయే సంవత్సరాల్లో మధ్యప్రదేశ్ దశ తిరగబోతుంది. మైనింగ్ రంగంలో దేశంలోనే అత్యంత ధనిక రాష్ట్రంగా రికార్డులకెక్కనుంది. మధ్యప్రదేశ్‌లో బంగారం నిక్షేపాలు బయటపడడం ఇదేం తొలిసారి కాదు. ఆ రాష్ట్రంలోని కత్నీ జిల్లాలో కొన్నేళ్ల క్రితం భారీ స్థాయిలో బంగారు నిక్షేపాలను గుర్తించారు.

తల్లీకూతుళ్ల దారుణ హత్య

- తలపై ఇనుపరాడ్లతో కొట్టి చంపిన దుండగులు



అన్నమ్మ, గాలి రాణి (ఫైల్)

జఫర్‌గడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంట్లో 60 ఏళ్ల మహిళ, ఆమె తల్లి అయిన 90 ఏళ్ల వృద్ధురాలు మాత్రమే ఉంటున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం పనిమనిషి వచ్చి చూడగా.. ఇంట్లో మంచమ్మీద ముఖంపై రక్తపు మరకలతో వృద్ధురాలి మృతదేహం కనిపించింది! ఇంటి బయట చెట్టుకింద తలకు తీవ్రగాయాలైన స్థితిలో వృద్ధురాలి కూతురు విగతజీవిగా పడి ఉంది. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి (ఐ)లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. హతులు తుమ్మ అన్నమ్మ (90), ఆమె చిన్న కుమార్తె గాలి రాణి (60). ఇంట్లో బంగారు గొలుసులు.. హతుల్లో ఒకరి శరీరంపై బంగారు కమ్మలు, గాజులు అలాగే ఉండటంతో భూమి, ఆస్తి కోసం ఎవరైనా ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్నమ్మ స్వస్థలం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల. ఆమె భర్త ఇజాత్‌రెడ్డి 30ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఇజాత్‌రెడ్డి-అన్నమ్మకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుళ్లున్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారులు బతుకుదెరువు కోసం వేర్వేరు చోట్ల ఉం టున్నారు. అన్నమ్మ రెండో కుమార్తెను తమ్మడపల్లి(ఐ)కి చెందిన గాలి జార్జిరెడ్డికి ఇచ్చి పెళ్లి చేశారు. కొంతకాలానికి ఆమె చనిపోవడంతో చిన్న కూతురు రాణిని జార్జిరెడ్డికిచ్చి పెళ్లి చేశారు. జార్జిరెడ్డి 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. రాణి తనకున్న ఐదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ తమ్మడపల్లిలోనే ఉంటోంది. రాణి కూతురు కవితకు పెళ్లయి.. ఏపీలోని కృష్ణాజిల్లా కంచికచర్లలోని అత్తగారింట్లో ఉంటోంది. కాగా నీర్మాలలో ఉంటున్న అన్నమ్మ, చిన్న కూతురు రాణి ఇంటికే వచ్చి ఐదేళ్లుగా అక్కడే ఉంటోంది. అప్పట్నుంచి ఆ ఇంట్లో తల్లీ కూతుళ్లే ఉంటున్నారు. గురువారం రాత్రే దుండగులు.. అన్నమ్మ, రాణిని హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఆధార్ ఆధారిత చెల్లింపులు!

హైదరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు విడుదల చేసే బిల్లుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ చెల్లింపులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ(ఆధార్ పేమెంట్ బిల్ సిస్టం) ద్వారా నిర్వహిస్తామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. విడతల వారిగా విడుదల చేస్తున్న ఈ బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు అందేలా చేయటంలో ఈ ప్రక్రియ దోహదపడుతుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సులకు భారీ గిరాఖీ

వరుస సెలవులతో సొంతూళ్లకు పయనం.. 41-50% టికెట్ల చార్జీలు పెంచి ఆర్టీసీ దోపిడీ!

- ప్రత్యేక బస్సుల పేరుతో జేబులు గుల్ల
- అడ్డగోలుగా దోచేస్తున్నారంటూ ప్రయాణికుల ఆగ్రహం
- ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన ఎంజీబీఎస్, జేబీఎస్



సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన జేబీఎస్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో నగరంలోని ప్రధాన బస్టాండ్లన్నీ కిక్కిరిసిపోయాయి. వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి పండగలకు తోడు ఆదివారం కలిసి కావడంతో నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న జనం సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. శుక్రవారం ఉదయం నుంచే బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ఉచిత ప్రయాణాల నేపథ్యంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో వెళ్లేందుకు పోటీపడ్డారు. కాగా, రద్దీని ముందే ఊహించిన ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఎల్బీనగర్, ఆరాంఘర్, ఉప్పల్, మేడ్చల్, కేపీహెచ్‌బీ, మియాపూర్ ప్రాంతాల నుంచి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేసింది. రద్దీకి తగ్గట్లు రోజువారీ సర్వీసులతో పాటు అదనంగా 400 ప్రత్యేక సర్వీసులు నడిపినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. బస్టాండ్ల ఆవరణలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ట్రాఫిక్ కంట్రోలర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పండగ వేళ ఆర్టీసీ నిలువు దోపిడీ

సులభతరంగా, క్షేమంగా అందరికీ అందుబాటులో టికెట్ ధరలతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తామని చెప్పిన ఆర్టీసీ యంత్రాంగం పండగ సమయాల్లో మాత్రం వారిపై అధికభారం మోపుతోంది. రాఖీ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్న పేరుతో.. ఆర్టీసీ అధిక చార్జీలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సాధారణ చార్జీల కంటే 41-50 శాతం చార్జీలు పెంచి వసూలు చేస్తోందంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మామూలు రోజుల్లో ఉప్పల్ నుంచి హన్మకొండకు రాజధాని బస్సుల్లో టికెట్ చార్జీ రూ. 390 అయితే శనివారం ప్రత్యేక బస్సుల్లో ఒక్కో టికెట్‌పై రూ.160పెంచి.. రూ. 550 వసూలు చేశారంటూ హన్మకొండకు వెళ్లే ఓ ప్రయాణికుడు ఆర్టీసీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మహిళలకు ఉచిత ప్రయాణాలు కల్పిస్తున్నామంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం ఈ దోపిడీపై ఎందుకు స్పందించడం లేదంటూ పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు పెంచడంతో ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు కూడా అందినకాడికి దండుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అయితే ప్రత్యేక బస్సుల్లో మాత్రమే అదనపు చార్జీలు వసూలు చేస్తామని, సాధారణ బస్సు సర్వీస్ చార్జీల్లో ఎలాంటి మార్పు లేదని అధికారులు స్పష్టం చేశారు. పండగల వేళ బస్సు టికెట్ ధరలు పెంచేందుకు ఆర్టీసీకి అనుమతి ఉందని తెలిపారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

మరోవైపు, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం నుంచి రద్దీ నెలకొంది.. నల్లగొండ, సూర్యాపేట, ఉమ్మడి ఖమ్మం జిల్లాలతో పాటు ఏపీలోని పలు జిల్లాలకు వెళ్లేందుకు వాహనాలు బారులు తీరాయి. జాతీయ రహదారితో పాటు సర్వీస్ రహదారులు కూడా కిక్కిరిసిపోయాయి. టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి అదనపు సిబ్బందిని నియమించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.

సింగూరు డ్యామ్ రక్షణకు చర్యలు తీసుకోండి..

- అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆదేశాలు
- సింగూరు ప్రాజెక్టుకు ప్రమాదమేమీ లేదు
- ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో లేదు:ఈఎన్‌సీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, పుల్‌కల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సింగూరు కట్ట రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. సచివాలయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హొస్సేన్ తదితరులతో సమీక్షించారు. సింగూరు రిజర్వాయర్ మరమ్మతులకు ఎందుకు చర్యలు తీసుకోలేదని మంత్రి ఆరా తీయగా.. సంగారెడ్డి ఎస్‌ఈ, సీఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏ పని చేయాలన్నా ఈ రెండు పోస్టుల్లో అధికారులు అవసరమని అధికారులు వివరించినట్లు సమాచారం. ఎస్‌ఈ పదోన్నతుల ఫైల్ ఆమోదం పొందిందని, తక్షణమే పోస్టింగులపై నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టును పరిశీలించి చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. మంత్రి ఆదేశాలతో ఈఎన్‌సీ మహ్మద్ అంజద్ హొస్సేన్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) టి.శ్రీనివాస్... చీఫ్ ఇంజనీర్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఈఈ (సెంట్రల్ డిజైన్స్) ఎంఎస్‌వీ చంద్రశేఖర్‌లతో సింగూరు ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం మీడియాతో ఈఎన్‌సీ అంజద్ హొస్సేన్ మాట్లాడుతూ తాత్కాలికంగా ఇసుక, కంకర బస్తాలతో దెబ్బతిన్న ఆనకట్ట ప్రాంతానికి మరమ్మతులు చేపట్టి పటిష్ఠం చేస్తామన్నారు. అయితే నీటి నిల్వలు గరిష్ఠంగా ఉంటే పనులు చేపట్టలేమని, నీటి నిల్వలు తగ్గాక పూర్తి స్థాయి పనులు చేపడతామని తెలిపారు. సింగూరు ప్రాజెక్టుకు ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదమేమీలేదన్నారు. ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో ఏమీ లేదని, చిన్నచిన్న లీకేజీలను సరిచేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక సమస్యలను సరి చేస్తామని తెలిపారు. ఆనకట్ట భద్రత కమిటీ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.